మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
# నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 29 ఆదివారం | సెప్టెంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 13
Navabhoomi daily fallows..




## వెనక్కి తగ్గిన హైడ్రా?

- సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల నుంచి ఏర్పాటైన హైడ్రా
- రాజకీయంగా ఎన్నో సంచనాలకు దారితీసిన హైడ్రా
- ప్రతిపక్షాల నుంచి విమర్శలు వస్తున్నా ఎక్కడా తగ్గకుండా
- అక్రమ కట్టడాల భరతం పడుతూ ముందుకు
- మూసీ నిర్వాసితుల ఆందోళనతో వెనక్కి..

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** చుట్టు పక్కల ఏరియాల్లో ఇప్పుడు ఎవరినోట విన్నా హైడ్రా మాటనే వినిపిస్తోంది. ఏ ఇద్దరు కలుసుకున్నా హైడ్రా గురించే చర్చిస్తున్నారు. ఎవరికీ లొంగకుండా దూసుకెళ్తున్న బుల్డోజర్లు, నేలమట్టం అవుతున్న కట్టడాలపై అంతటా చర్చ నడుస్తోంది.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల నుంచి ఏర్పాటైన హైడ్రా.. పురుడుపోసుకున్నప్పటి నుంచే తన ప్రతాపం చూపిస్తూ వస్తోంది. రాజకీయంగా ఎన్నో సంచనాలకు దారితీసింది. ప్రతిపక్షాల నుంచి విమర్శలు వస్తున్నా ఎక్కడా తగ్గకుండా అక్రమ కట్టడాల భరతం పడుతూ సాగుతోంది.

చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించి వెలిసిన అక్రమ కట్టాలను హైడ్రా గుర్తించి వాటిని నేలమట్టం చేస్తోంది. ఇప్పటివరకు వందలాది సంఖ్యలో కట్టడాలను నేలమట్టం చేయగా.. వంద ఎకరాలకు పైగా విలువైన భూములను ప్రభుత్వానికి స్వాధీనం చేసింది. ఈ నెల మొదటి వారంలో హైడ్రా ఇచ్చిన నివేదిక ప్రకారం 23 ప్రాంతాల్లో 262 అనధికారిక కట్టడాలను కూల్చివేసినట్లు పేర్కొన్నారు. మొత్తం 111.72 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

## అయోమయంలో వైసీపీ?



- జగన్ వ్యాఖ్యల తర్వాత వైసీపీ శ్రేణుల్లో గందరగోళం
- తమ పార్టీ నేత ఏం మాట్లాడుతారో అర్థం కావడం లేదు
- కింది స్థాయి కార్యకర్తల్లో సైతం ఇదే చర్చ
- వైసీపీ రోజురోజుకూ బలహీనపడుతున్న దశలో పార్టీని మరింత కుంగదీసిన జగన్ వ్యాఖ్యలు
- శ్రీవారిని దర్శించుకొని వస్తే...జగన్‌పై నెయ్యి మచ్చ చెరిగిపోయేదని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు..

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
జగన్ వ్యాఖ్యల తర్వాత వైసీపీ శ్రేణులు అయోమయంలో పడ్డారనే చర్చ జరుగుతోంది. అసలు తమ పార్టీ అధ్యక్షులు ఏం మాట్లాడారో తమకే అర్థం కాలేదని, ఇప్పటికే లడ్డూ వివాదంతో శ్రీవారి భక్తుల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న తమకు జగన్ వ్యాఖ్యలు..

ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ రోజురోజుకు బలహీనడుతుందనే చర్చ నడుస్తున్న వేళ.. జగన్ వ్యాఖ్యలు పార్టీని ఆత్మరక్షణలో పడేసిందా అంటే ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. తిరుమల పర్యటన రద్దు తర్వాత జగన్ మీడియాతో మాట్లాడారంటే ఏ విషయాలు ఆయన చెప్పబోతున్నారంటూ ప్రజలంతా ఆసక్తిగా ఎదురుచూశారు. చివరకు తిరుమల పర్యటన రద్దుకు కారణాలు చెప్పకుండా హైందవ సంఘాల ప్రతినిధులను, ఓ రకంగా హిందు మతంపై ఆయన కొన్ని ప్రశ్నలు సంధించారు. అసలు హిందూ మతం అంటే ఏమిటి.. గుడికి వెళ్తానంటే తన మతం అడుగుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మానవత్వం తన మతమని డిక్లరేషన్‌లో రాసుకోవాలని చెప్పుకొచ్చారు. జగన్ వ్యాఖ్యల తర్వాత వైసీపీ శ్రేణులు అయోమయంలో పడ్డారనే చర్చ జరుగుతోంది. అసలు తమ పార్టీ అధ్యక్షులు ఏం మాట్లాడారో తమకే అర్థం కాలేదని, ఇప్పటికే లడ్డూ వివాదంతో శ్రీవారి భక్తుల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న తమకు జగన్ వ్యాఖ్యలు కొత్త తలనొప్పిని తీసుకొచ్చాయని చర్చించుకుంటున్నట్లు తెలుస్తోంది. తన రాజకీయ ప్రయోజనాల కోసం ఏకంగా మత సంప్రదాయాలను జగన్ ప్రశ్నించడం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిబంధనలు పాటించాలని చెప్పినందుకు హైందవ సంఘాల ప్రతినిధులను, హిందూ మతాన్ని జగన్ టార్గెట్ చేశారా అనే చర్చ జరుగుతోంది.

**డిక్లరేషన్‌పై వివాదం..**
తాను తిరుమల దర్శనానికి వెళ్తానంటే వివాదం చేస్తున్నారంటూ జగన్ వ్యాఖ్యానించారు. వాస్తవానికి జగన్‌ను తిరుమల వెళ్లొద్దని ఎవరూ చెప్పలేదు. అక్కడి నిబంధనల ప్రకారం అన్యమతస్తులు డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది.

## అక్టోబర్ 3 నుంచి డిజిటల్ కార్డులు

- పైలట్ ప్రాజెక్టుగా కుటుంబ డిజిటల్ కార్డుల జారీ
- ఇంటింటి పరిశీలన చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ, సంక్షేమ పథకాల్లో డేటా ఆధారంగా
- కుటుంబాన్ని నిర్ధరించి, క్షేత్రస్థాయి పరిశీలన

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** కుటుంబ డిజిటల్ కార్డుల జారీ కోసం అక్టోబరు 3న పైలట్ ప్రాజెక్టు ప్రారంభించి, ఇంటింటి పరిశీలన చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ, సంక్షేమ పథకాల్లో డేటా ఆధారంగా కుటుంబాన్ని నిర్ధరించి, క్షేత్రస్థాయి పరిశీలన చేయాలన్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక పట్టణం, ఒక గ్రామీణ ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టు కింద తీసుకోవాలన్నారు. మహిళే యజమానిగా కుటుంబ డిజిటల్ కార్డులు ఇవ్వాలని సీఎం సూచించారు. కార్డు వెనకవైపు కుటుంబంలోని ఇతర సభ్యుల వివరాలు ఉండాలని సూచించారు.

కుటుంబ డిజిటల్ కార్డులపై సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈనెల 25 నుంచి 27 వరకు రాజస్థాన్, హరియాణా, కర్ణాటక, మహారాష్ట్రలో పర్యటించిన అధికారులు, అధ్యయనాల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్

## ప్రజల సంక్షేమానికే హైడ్రా

- ఎఫ్టీఎల్, బఫర్ జోన్ల పరిధిలోకి వచ్చే ఏ కట్టడాన్ని వదిలేది లేదు..
- బుచ్చమ్మ ఆత్మహత్య నన్ను ఎంతగానో కలచి వేసింది..
- పెద్దలు వెనుక ఉండి, పేదలను ముందుకు పంపుతున్నారు..
- హైడ్రా అంటే బూచి కాదు.. రాక్షసి అంతకన్నా కాదు..
- ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలు, చెరువులను కాపాడానికే
- రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు : కమిషనర్ రంగనాథ్

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** గ్రౌండ్ వర్క్ జరుగుతోంది.. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ల పరిధిలోకి వచ్చే ఏ కట్టడాన్ని వదిలేది లేదు.. బుచ్చమ్మ ఆత్మహత్య నన్ను ఎంతగానో కలచి వేసింది.. పెద్దలు వెనుక ఉండి, పేదలను ముందుకు పంపుతున్నారు.. తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు హైడ్రా కమిషనర్ రంగనాథ్.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలు, చెరువులను కాపాడడం కోసం రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో హైడ్రా ఎఫ్టీఎల్, బఫర్ జోన్ లలో నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. కాగా మూసి పరివాహక ప్రాంతంలో అక్రమ కట్టడాలను కూల్చి వేసేందుకు అధికారులు రెడ్ మార్క్ సైతం వేశారు. దీనిపై తన ఇంటిని కూల్చి వేస్తారేమోనన్న భయంతో బుచ్చమ్మ అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయంపై వివరణ ఇచ్చేందుకు హైడ్రా కమీషనర్ రంగనాథ్ సచివాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ హైడ్రాను వ్యతిరేకంగా చూపించే సమయంలో మీడియా ముందుగా ఆలోచించాలన్నారు. అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న నేపథ్యంలో.. ఆ ఇంటి యజమానులను బాధితులుగా తెలుపుతున్నారని.. వరదల సమయంలో అక్రమ కట్టడాల వల్ల నగరాలు నీటిమునిగితే అప్పటి బాధితుల సంగతి ఏమిటి అంటూ ప్రశ్నించారు. పలువురు బిల్డర్ల మీద క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగిందని, తాము నోటీసులు ఇచ్చే క్రమం నుండి.. కూల్చివేతల వరకు ప్రతిదీ రికార్డు చేస్తున్నట్లు తెలిపారు.

సున్నం చెరువులో కిరోసిన్ పోసుకున్న వెంకటేష్ అనే యువకుడు రోజుకు లక్ష రూపాయల ఆదాయాన్ని గడిస్తున్నట్లు, అతను

## కేంద్ర వరద సాయమేదీ!?

- ఊరించి.. ఉసూరుమనిపించిన కేంద్ర వరద సాయం
- కేంద్ర వరద సాయం కోసం ఎదురుచూపులు
- నోరు మెదపని రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణ రాష్ట్రంలో వరదలు వచ్చి సుమారుగా నెల రోజులు అవుతోంది. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఖమ్మం జిల్లాలను వరదలు, భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి.

వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. లక్షలాది ఎకరాల్లో పంట నీట మునిగింది. చాలా వరకు ఆస్తులు కోల్పోయారు. చివరకు ఇళ్లను వదిలి పునరావాస కేంద్రాల్లో తలదాచుకోవాల్సిన దుస్థితి వచ్చింది. దాదాపు వారం రోజుల పాటు వారిని వరదలు బెడద వీడలేదు. వరదలు తగ్గాక ఇళ్లకు వచ్చి చూస్తే బురదతో నిండిపోయి ఉన్నాయి. కేవలం కట్టుబట్టలు తప్పితే ఏమీ మిగల్లేదు. ఇంట్లోని వస్తువులన్నీ పాడయ్యాయి.

వరదలు తీసుకొచ్చిన నష్టం అంతాఇంతా కాదు. వరదల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు రాష్ట్ర మంత్రులు కూడా అక్కడ పర్యటించారు. బాధితులకు భరోసా ఇచ్చారు. ఒక్కో కుటుంబానికి పది వేల చొప్పున అందిస్తామని చెప్పారు. తాత్కాలికంగా ఉపశమనం కోసం నిత్యావసరాలు అందించారు. అటు కేంద్రం నుంచి కూడా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తోపాటు కేంద్ర సహాయ మంత్రి బండి



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in





# మెట్రో డీలక్స్ బస్సుల్లో ఆర్టీసీ సిబ్బందికి నో ఎంట్రీ

**హైదరాబాద్-నవభూమి:** కొత్తగా ప్రవేశపెట్టిన మెట్రో డీలక్స్ బస్సుల్లో ఆర్టీసీ సిబ్బంది ప్రయాణించవద్దని టీజీఎస్ ఆర్టీసీ ఆదేశించింది. 'స్టాఫ్ నాట్ అలోడ్' అనే స్టిక్కర్లు అంటించింది. 'మహిళలు, పాత్రికేయులకు, బడి పిల్లలకు, ఎస్కార్ట్ పోలీసులకు, స్వాతంత్ర సమరయోధులకు, ఎయిడ్స్, డయాలసిస్ పేషంట్లకు, పోలీస్ అమరవీరుల సతీమణులకు, ఎస్కార్ట్, ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నది. అనేక మందికి 50 శాతం రాయితీలు ఆర్టీసీ యాజమాన్యం కల్పిస్తున్నది. సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు మాత్రం ఉచిత రవాణా సౌకర్యం లేకపోవడం దురదృష్టకరం' అని ఆర్టీసీ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన మెట్రో డీలక్స్ సర్వీసుల్లో ఆర్టీసీ సిబ్బందికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించకపోవడం సరికాదని నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కమల్‌రెడ్డి మండిపడ్డారు. ఈ అంశంపై ఆర్టీసీ పునః పరిశీలించాలని సూచించారు.

**ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ !**

హైదరాబాద్, సెప్టెంబర్28 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణ అంశంపై ఏకసభ్య జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని సర్కారు యోచిస్తున్నది. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు తీర్పును వెలువరించిన నేపథ్యంలో తగిన సిఫారసులు చేసేందుకు ప్రభుత్వం క్యాబినెట్ సబ్‌కమిటీని నియమించింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా కమిటీ శనివారం సచివాలయంలో మరోసారి భేటీ అయ్యింది.



# మెర్క్యురీ ఈవి టెక్ లిమిటెడ్ బిఎస్ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లో చేర్చబడింది

MERCURY EV

**హైదరాబాద్, 28 సెప్టెంబర్ ( నవ భూమి) :** విస్తృత శ్రేణి ఎలక్ట్రిక్ వాహనాల తయారీ వ్యాపారంలో నిమగ్నమైన ఈవి పరిశ్రమలో అగ్రగామిగా ఉన్న మెర్క్యురీ ఈవి టెక్ లిమిటెడ్ బిఎస్సి స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లో చేర్చబడింది. ఈ మైలురాయి పరిశ్రమలో వృద్ధి మరియు ఆవిష్కరణలకు కంపెనీ యొక్క నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.
బి ఎస్ ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లో భాగంగా, మెర్క్యురీ ఈవి టెక్ లిమిటెడ్ దాని వృద్ధి పథాన్ని మరింత మెరుగుపరుస్తుంది. ఈ గుర్తింపు ఎలక్ట్రిక్ వాహన సాంకేతికతను అభివృద్ధి చేయడానికి మరియు దాని వాటాదారులకు విలువను అందించడానికి కంపెనీ యొక్క అంకితభావాన్ని నొక్కి చెబుతుంది.గతంలో కంపెనీ రూ. ఈక్విటీ షేర్ల ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా 118.06 %జతీ% మరియు గరిష్టంగా రూ. కన్వర్టిబుల్ వారెంట్ల ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా 362.25 కోట్లు. ప్రతిపాదిత కేటాయింపుల్లో ఎఫ్‌పిఐలు ఫోర్బ్స్ ఇఎమ్ఎఫ్, నెక్స్‌ప్యాక్ లిమిటెడ్, ఎమినెన్స్ గ్లోబల్ ఫండ్ పిసిసి, ఎజి డైనమిక్ ఫండ్స్ లిమిటెడ్. ఇతర హెచ్ ఎన్ వన్ కేటగిరీ ఇన్వెస్టర్లు ఉన్నాయి. మొత్తం నిధి రూ. సేకరించిన 480 కోట్లు వర్కింగ్ క్యాపిటల్, ఎలక్ట్రిక్ కార్ డెవలప్‌మెంట్, క్యాపిటల్ ఎక్స్‌పాన్షన్ మొదలైనవాటికి ఉపయోగించబడతాయి. ఈ నిధుల సేకరణ ఉత్పత్తి ఉత్పత్తిని పెంచుతుంది అలాగే కంపెనీ యొక్క క్యూ3 నుండి వాహన విక్రయ సంఖ్యను చూడటం ఆసక్తికరంగా ఉంటుంది.ఢిల్లీ ప్రభుత్వం యొక్క ఇటీవలి జి ఆర్ లో, మెర్క్యురీ యొక్క ఎల్ 5 (6o1) కేటగిరీ వాహనం రాష్ట్ర భూభాగంలో నడపడానికి అనుమతిని ఇచ్చింది. ఇది రాబోయే కాలంలో కంపెనీకి కొత్త మార్కెట్ అవకాశాలను తెరిచింది.మెర్క్యురీ ఈవి టెక్ లిమిటెడ్ మొత్తం ఈవి ఎకో సిస్టమ్‌లో ఉనికిని కలిగి ఉన్న ప్రముఖ ఈవి కంపెనీ. ఇది అత్యాధునిక 18 ఎకరాల ఈవి టెక్నాలజీ పార్క్ మరియు తయారీ సౌకర్యాన్ని కలిగి ఉంది. కంపెనీ బ్రాండ్ "మెర్క్యురీ" క్రింద విస్తృత శ్రేణి ఉత్పత్తులను కలిగి ఉంది. కంపెనీ తన బ్రాండ్‌లో తాజా చేరిక ఏమిటంటే ఇది 1 టన్ను మోసుకెళ్లే సామర్థ్యాన్ని కలిగి ఉన్న 4-వీలర్ లోడర్ 'ముసాక్'.

# సరిగమప సీజన్ 16 ది నెక్స్ట్ సింగింగ్ యూత్ ఐకాన్ గ్రాండ్ లాంచ్

- ఈ ఆదివారం సాయంత్రం 6 గంటలకు.
- అక్టోబర్ 6 నుండి ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు, మీ జీ తెలుగులో!




**వరంగల్, 27 సెప్టెంబరు (నవభూమి):** జీ తెలుగు ఆవిర్భావం నుంచి విలక్షణమైన ఫిక్షన్, నాన్ ఫిక్షన్ షోలు, సూపర్ హిట్ సినిమాలతో ప్రేక్షకులకు అంతులేని వినోదం అందించేందుకు నిరంతరం కృషి చేస్తోంది. వినోదాల పరంపరను కొనసాగిస్తూ జీ తెలుగు పాపులర్ షో సరిగమప సరికొత్త సీజన్తో వచ్చేస్తోంది. మట్టిలోని మాణిక్యాలను వెలికితీస్తూ అత్యంత ప్రేక్షకాదరణతో విజయవంతంగా 15 సీజన్లు పూర్తిచేసుకున్న జీ తెలుగు సరిగమప తన తదుపరి సీజన్ను ఘనంగా ప్రారంభిస్తోంది. సరిగమప సీజన్ -16 ది నెక్స్ట్ సింగింగ్ యూత్ ఐకాన్ సెప్టెంబర్ 29న, సాంఎ 6:00 ప్రారంభం, అక్టోబర్ 6 నుండి ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు మీ జీ తెలుగులో మాత్రమే!
తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన గాయకులకు ప్రోత్సహించే లక్ష్యంతో డ్యాన్సింగ్, సింగింగ్ షోలతో మట్టిలో మాణిక్యాలను గుర్తిస్తోంది జీ తెలుగు. ఇందులో భాగంగానే విజయవంతంగా 15 సీజన్లు పూర్తి చేసుకున్న సింగింగ్ షో 'స రి గ మ ప' కొత్త సీజన్ ప్రారంభం కానుంది. ఈ సీజన్లో గాయనీ గాయకులు విలేజ్ వోకల్స్, సిటీ క్లాసిక్స్, మెట్రో మెలోడీస్ అనే మూడు జట్లుగా పోటీపడతారు. ఈ జట్లకు మెంటర్లుగా రేవంత్, రమ్య బెహరా, అనుదీప్ దేవ్ నాయకత్వం వహిస్తారు. ఈ సీజన్ కు ఎనర్జిటిక్ యాంకర్ శ్రీముఖి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తుండగా, సంగీత దర్శకుడు కోటి, ప్రముఖ గాయని ఎస్పీ శైలజ, పాటల రచయిత కాసర్ల శ్యామ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. జీ తెలుగు చీఫ్ కంటెంట్ ఆఫీసర్ - అనురాధ గూడూరు మాట్లాడుతూ, "యువ, అసాధారణ ప్రతిభావంతులకు ఎల్లప్పుడూ లాంచ్ ప్యాడ్ గా ఉన్న జీ తెలుగు సరిగమప సీజన్ 16 ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది. ఈ సీజన్లో సింగింగ్ యూత్ ఐకాన్ కోసం పోటీ జరుగుతుంది. ప్రతి సీజన్ మాదిరిగానే ఈ సీజన్లోనూ ప్రతిభావంతులైన గాయనీ గాయకులను ప్రోత్సహించడమే మా లక్ష్యం. ఇప్పటికే మనం చూసిన ఎనర్జీ, ప్యాషన్, టాలెంట్ చెప్పుకోదగ్గవి. తమ కలలను నిజం చేసుకోవడమే కాకుండా లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చే ఓ వేదికను అందించడమే మా ఉద్దేశం. ఈ సీజన్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుందని ఆశిస్తున్నాం' అంటూ ధీమా వ్యక్తం చేశారు.

# శ్రీవారి సేవకు టికెట్ ఖరీదు రూ.కోటిన్నర.. దక్కించుకుంటే జన్మధన్యమే!

**తిరుమల 27 సెప్టెంబరు (నవభూమి):** తిరుమలలో వైఖానస ఆగమం ప్రకారం శ్రీహరికి నిత్యం ఎన్నో కైంకర్యాలను నిర్వహిస్తారు.. ఇందులో పలు ఆర్జిత సేవల్లో పాల్గొనే అవకాశం భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కల్పిస్తోంది. ఆర్జిత సేవా టికెట్లు పొందిన వారు స్వామి వారిని దగ్గర నుంచి కొలుచుకోవచ్చు. సర్వదర్శనం, దివ్య దర్శనాలతోపాటు నిత్య, వార పూజలు, సేవలలో ప్రత్యేకమైన, విశేషమైన సేవ ఒకటుంది. అదే ఉదయాస్తమాన సేవ. ఈ సేవ టికెట్ కు ఏకంగా రూ. కోటిన్నర వెచ్చించాల్సి ఉంటుంది. వారంలో ఆరు రోజులు రూ.కోటి ఉండే ఈ టికెట్ ఖరీదు శుక్రవారం మాత్రం రూ. కోటిన్నరగా టీటీడీ నిర్ణయించింది.

# నాకు వాళ్ల ఓట్లు అక్కర్లేదు.. తీన్మార్ మల్లన్న సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్-నవభూమి:** తీన్మార్ మల్లన్న అసలు పేరు చింతపండు నవీన్. ఆయన నవీన్ కన్నా తీన్మార్ మల్లన్న గానే ఫేమస్. ఇక.. తెలుగు రాష్ట్రాల్లో ఆయన గురించి పెద్దగా పరిచయం అక్కర్లేదు. చాలా మందికి సుపరిచితం ఆయన. సొంతంగా యూట్యూబ్ చానల్ ప్రారంభించి.. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాల పనితీరును నిత్యం ప్రశ్నిస్తూనే ఉంటారు. విశ్లేషణలు ఇస్తుంటారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీన్మార్ మల్లన్న చేసిన యుద్ధం అంతాఇంతా కాదు. ఆ ప్రభుత్వం అవలంబించిన విధానాలపై ఏ రోజుకారోజు నిలదీస్తూనే ఉండేవారు. ఆ ప్రభుత్వం దిగిపోవాలంటూ పోరాటాలు చేశారు. తన చానల్ ద్వారా నిత్యం ప్రశ్నించే వారు. అలా తెలుగు రాష్ట్రాల్లో ఆయన ట్రెండ్ సృష్టించారు. అలాగే.. గత ప్రభుత్వానికి నిద్ర లేకుండానూ చేశారు. గత ప్రభుత్వంలోని కేసీఆర్, కేటీఆర్ తదితర నేతలను టార్గెట్ చేసి ఆయన వేసిన ప్రశ్నలు కింది స్థాయి ప్రజల వరకూ చేరాయి. అధికార పార్టీనే ప్రధాన టార్గెట్‌గా ప్రజా సమస్యలే లక్ష్యంగా ఆయన తన చానల్‌లో డిబేట్లు కొనసాగించారు. అయితే.. తీన్మార్ మల్లన్న ముందు నుంచి సెన్సేషనలే అని చెప్పాలి. గత ప్రభుత్వంపై ఆయన చేసిన వ్యతిరేక దాడికి ఎన్నో కేసులను ఎదుర్కొన్నారు. మరెన్నో పోలీసుల వేధింపులు భరించారు. అరెస్టులూ తప్పలేదు. కొన్ని రోజులు జైలు జీవితమూ తప్పలేదు. అలా కొనసాగిన ఆయన ప్రస్థానం మధ్యలో బీజేపీలో చేరారు. వివిధ కారణాలతో పార్టీ నుంచి బయటకు వచ్చారు. ఇక అప్పటి నుంచి ఆయన కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలుస్తూ వచ్చారు. ఆ తదుపరి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇటీవల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో మండలిలోకి అడుగుపెట్టారు. ఇక అప్పటి నుంచి గత ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లోకి తీసుకెళ్తూనే ఉన్నారు. అయితే సంచలనాలకు కేరాఫ్ అయినా ఎప్పుడు ఏది మాట్లాడినా సెన్సేషనలే అవుతుంటుంది. ఇటీవల బీసీ సదస్సులో ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. ఆయన చేసిన వ్యాఖ్యల వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ వీడియోలో ఆయన చేసిన వ్యాఖ్యలు ఇలా ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో తాను ఒకవేళ పోటీలో నిలిస్తే రెడ్డిలు, ఓసీలు తనకు ఓట్లు వేయొద్దని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ కులాల వారి ఓట్లు తనకు అవసరం లేదని తేల్చిచెప్పారు. బీసీల ఓట్లే తనకు సరిపోతాయని, గెలుపునకు సరిపోగా ఇంకా మిగులుతాయని అన్నారు. అలాగే.. తెలంగాణకు రెడ్డి సీఎం రేవంత్ రేడ్డే ఆఖరు అని.. వచ్చే 2028 నాటి ఎన్నికల్లో బీసీనే ముఖ్యమంత్రి అవుతాడని చెప్పారు. దాంతో ఇప్పుడు ఆయన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి.

# వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా కలెక్టరు ఆలస్యం

- డ్యూటీ చేసి ఇళ్లకు వెళ్ళే టైంలో విసి కొరకు పడిగాపులు.
- ఒకటి, అర కాదు సుమారుగా - మూడు గంటలు.





**ఒంగోలు, ప్రకాశం జిల్లా, నవభూమి :** కలెక్టర్ తో వీడియో కాన్ఫరెన్స్ మీటింగ్ అంటే ఏ ఉద్యోగస్తుడికైనా భయం భయం గా ఉంటుంది. ఆలస్యంగా వెళ్ళినా, అస్సలు వెళ్ళక పోయినా వారిపై చర్యలు తప్పవు. మరి ఒక జిల్లా కలెక్టర్ ఆలస్యంగా వస్తే పరిస్థితి ఏంటి!? అని పలువురు ముక్కు మీద వేలేసుకున్నారు. శనివారం సాయంత్రం 4:30 కు సచివాలయ సిబ్బందికి కలెక్టర్ తో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని తప్పకుండా హాజరుకావాలని ప్రతి మండల ఎంపిడిఒ లు వారి వారి సచివాలయ సిబ్బందికి ఫోన్ ద్వారా మెసేజ్ పంపించారు. ఉదయమే సరైన టైంకు ఎవరి డ్యూటిలకు వారు వెళ్ళారు. ఎంపిడిఓ మెసేజ్ చూసి వీడియో కాన్ఫరెన్స్ కి వారు ఇచ్చిన సమయం దగ్గర పడిందని సచివాలయ సిబ్బంది అందరూ పరుగు పరుగున ఎంపిడిఓ కార్యాలయంకు వచ్చారు గాని కలెక్టర్ ఎంత సేపటికి రావటం లేదు. ఉదయం నుండి డ్యూటిలో ఉన్నవాళ్ళకి ఎన్ని ఇబ్బందులు ఉన్నాయో పై అధికారులకు ఎవరికి తెలియదా అని కొందరు అసహనం వ్యక్తం చేశారు. ఇంటికి వెళదామని అనుకుంటే ఎక్కడ తిడతారో భయం భయంగా వీడియో కాన్ఫరెన్స్ లో కూర్చోని ఉంటే రాత్రి 7:15 కు కలెక్టరు వచ్చారని, 7:15 నుండి 7:40 లోపు మీటింగ్ ముగించేసారని,సుమారు అరగంట మీటింగ్ కోసం మూడు గంటలు ఎదురు చూడటంతో అధికారులు సిబ్బంది సహనం కోల్పోయినంత పనైందని వారి బాధను చూస్తే అర్థమవుతుంది. ఈ విషయం తెలుసుకున్న కొందరు ప్రజలు జిల్లా కలెక్టరు గతంలో రాజకీయ నాయకులుగా పనిచేశారేమో అని గుసగుస లాడుచున్నారు. ఇంత సమయం ఎలా ఉండాలని, మేము మారు మూల గ్రామాలకు ఎలా వెళ్ళాలో కూడా తెలియటం లేదని పలువురు బాధను వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ ను ప్రశ్నించే అధికారం ఎవరికీ లేదు కాబట్టి ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటూ కూర్చున్నట్లు చెప్పుకుంటున్నారు. కలెక్టర్ కు ఏముంది సవాలక్ష పనులు.కలెక్టర్ అంటే నే బిజీ బిజీగా ఉంటుంది. అటువంటిది ఆలస్యంగా వచ్చినా అడిగేవారు గాని అడిగే ధైర్యం గాని లేదు. అలాగని చెప్పిన సమయానికి రాక పోతె ఎందుకు ఆలస్యం అయ్యిందో చెప్పే అవసరం కలెక్టర్ కు గాని వారి కింది సిబ్బందికి ఉండదని కాన్ఫరెన్స్ కు హాజరైన వారిలోనే కొందరు చెప్పుకోవడం విడ్డూరంగా వుంది. కలెక్టర్ కు అకస్మాత్తుగా పని పడి ఉన్నా కనీసం ఆలస్యం అవుతున్నట్లు కింది సిబ్బంది ద్వారా సమాచారం ఇచ్చినా కలెక్టర్ కు గౌరవం ఉండేది. అలా కూడా చేయకపోవడంతో ఎంపిడిఓల దగ్గర నుండి కింది సిబ్బంది వరకు చులకనగా మాట్లాడుకోవడం గమనార్హం. ఏదిఏమైనా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ అంటే అనుభవం ఉన్న అధికారులు మాత్రం ఆలస్యంగా వస్తున్నట్లు కూడా చెప్పుకుంటున్నారు. ఇకనైనా కలెక్టర్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేస్తే ఖచ్చితమైన సమయాన్ని తెలయజేసి సిబ్బంది ఇబ్బందులు పడకుండా చూడాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# వెనక్కి తగ్గిన హైడ్రా?

(1వపేజీ తరువాయి)కట్‌చేస్తే.. ఇన్నాళ్లు దూకుడుగా వ్యవహరించిన హైడ్రా ఒక్కసారిగా వెనుకడుగు వేసిందా..? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. హైడ్రా కార్యకలాపాలకు చాలా వరకు మద్దతు తెలుపుతున్నా.. కొంత మంది పేదల నుంచి మాత్రం వ్యతిరేకత తప్పడం లేదు. కోట్లు కుమ్మరించి కొనుగోలు చేసిన ఆస్తులు నేలమట్టం అవుతుండడంతో భరించలేకపోతు న్నారు. రోదిస్తూ హైడ్రాపై శాపనార్థాలు పెడుతున్నారు. అధికారులను వదిలి పేదలను కష్టాల పాలు చేస్తున్నారని విమర్శిస్తున్నారు. దీనికితోడు నిన్న కూకట్‌పల్లిలోని యాదవ బస్తీలో గుర్రాంపల్లి బుచమ్మ అనే మహిళ హైడ్రాకు భయపడి ఆత్మహత్య చేసుకున్నట్లుగా ప్రచారం జరిగింది. దానిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్లారిటీ ఇచ్చారు. వారికి ఎలాంటి నోటీసులు జారీ చేయలేదని ఆయన చెప్పారు.
అయితే.. అటు మహిళ ఆత్మహత్య చేసుకోవడం.. ఇటు మూసీ పరిధిలో బాధితుల నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తుతుండడంతో హైడ్రా తన కార్యకలాపాలకు బ్రేక్ వేసినట్లుగా తెలుస్తోంది. అందులోభాగంగా ఇవ్వాళ్టి కూల్చివేతల కార్యక్రమాన్ని నిలిపివేసినట్లు సమాచారం. మూసీ ప్రక్షాళన కోసం అక్కడి ఇళ్లను కూల్చేందుకు ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లను సైతం ఇస్తామని చెప్పింది. దాంతో అక్కడ కూల్చివేతల కార్యక్రమం ఈ రోజు నుంచి ప్రారంభం కావాల్సి ఉంది. కానీ.. అక్కడి బాధితుల నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. అటు సర్వే కోసం వచ్చిన రెవెన్యూ అధికారులు సైతం వెనుతిరిగారు. ఇప్పటికే ఇళ్లకు మార్కింగ్ చేయగా.. ఆ మార్కింగ్‌లను బాధితులను తొలగించారు. ఈ క్రమంలో ఈ రోజుకు తాత్కాలికంగా బ్రేక్ నిచ్చిన హైడ్రా.. రేపటి నుంచి ఎలా ముందుకు వెళ్తుందా అనేది ఆసక్తికరంగా మారింది. మూసీ బాధితుల నిరసనలు తట్టుకొని కూల్చివేతలు చేపడుతుందా..? మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్నే తాత్కాలికంగా వాయిదా వేస్తారా..? అనేది ప్రశ్నగా మిగిలింది. ఒకవేళ ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కమిషనర్ రంగనాథ్ కలిసి చర్చిస్తారా..? లేదంటే ఇచ్చిన అదికారాలతో ముందుకు సాగుతారా

# ప్రజల సంక్షేమానికే హైడ్రా

(1వపేజీ తరువాయి)ట్యాంకర్ల వ్యాపారం చేస్తున్నట్లు తాము గుర్తించమన్నారు. రోజుకు లక్ష రూపాయలు సంపాదించేవారు పేదలవుతారా అంటూ రంగనాథ్ ప్రశ్నించారు. జిహెచ్ఎంసి అనుమ తులు ఉంటే తాము వాటి జోలికి వెళ్లట్లేదని.. అయితే ముందస్తుగా తాము సమాచారం ఇస్తే కొందరు సీరియస్ గా తీసుకోవట్లేదన్నారు. మరికొందరు ముందస్తుగానే ఖాళీ చేస్తూ.. తమకు సహకరిస్తున్నట్లు తెలిపారు.
బఫర్ జోన్, ఎఫ్టిఎల్ పరిధిలో పేదలు నివసిస్తూ ఉంటే వారికి తగిన సమయం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి తమకు సూచించారన్నారు. హైడ్రా పరిధి దాటడం లేదని.. చెరువుల్లో గృహాలు కట్టుకుంటే వర్షాల సమయంలో లక్షల మందికి నష్టం వాటిల్లుతుందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. తాము కూల్చివేసే ప్రతి భవనం ఖాళీ గృహాలు గానే ఉంటున్నాయని.. అయితే రాత్రికి రాత్రి వచ్చి నివాసం ఉంటున్నట్లు తాము గుర్తించామన్నారు.
ఎఫ్టిఎల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన కళాశాలల పట్ల తమకు ఫిర్యాదులు అందుతున్నాయని.. అకాడమిక్ ఇయర్ పూర్తికాగానే తప్పక చర్యలు తీసుకుంటామన్నారు. పెద్దవాళ్లే మా టార్గెట్.. కానీ వారు పేదవాళ్లను ముందుకు నెట్టి చోద్యం చూస్తున్నట్లు తెలిపారు. చాలా గ్రౌండ్ వర్క్ చేస్తున్నామని, సరైన సమయంలో అక్రమ కట్టడాలన్నింటినీ కూల్చేస్తామంటూ రంగనాథ్ తెలిపారు.
కాగా హైడ్రా చర్యల పట్ల ఓ వర్గం ప్రజల ఆదరణ లభిస్తోంది. వరదల సమయంలో అంతా కోల్పోవడం కన్నా.. హైడ్రా పరిధిలోకి వచ్చే గృహాలను కూల్చడం మేలని, సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న అక్రమ కట్టడాల కూల్చివేత నిర్ణయం ఒక చారిత్రాత్మకమని ప్రజలు తెలుపుతున్నారని కమిషనర్ తెలిపారు.

**హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హెచ్‌ఆర్సీలో కేసు నమోదు**

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హెచ్‌ఆర్సీలో కేసు నమోదైంది. కూకట్‌పల్లిలో బుచ్చమ్మ అనే వృద్ధురాలు హైడ్రా తమ ఇళ్లను కూలుస్తుందనే భయంతో ఆత్మహత్య చేసుకుందంటూ ఆమె కుటుంబ సభ్యులు మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రంగనాథ్‌పై హెచ్‌ఆర్సీ కేసు నమోదు చేసింది.
హైడ్రా కూల్చివేతల వల్లే తమ తల్లి బలవన్మరణానికి పాల్పడిందని బుచ్చమ్మ కుమార్తెలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 16063/%×చీ%/2024 కింద కేసు నమోదు చేసినట్లు, విచారణ చేపట్టనున్నట్లు మానవ హక్కుల కమిషన్ తెలిపింది.
కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన బుచ్చమ్మ అనే మహిళ శుక్రవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకుంది. హైడ్రా కూల్చివేతల భయంతోనే ఆమె బలవన్మరణానికి పాల్పడిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. యాదవబస్తీలో నివాసముండే శివయ్య, బుచ్చమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బుచ్చమ్మ దంపతులది పాలవ్యాపారం. వీరు వివిధ ప్రాంతాల్లో ప్లాట్లు కొనుగోలు చేశారు. ఆడపిల్లలకు పెళ్లి చేసిన తర్వాత ఒక్కొక్కరికి ఒక్కో ప్లాట్ ఇచ్చారు. నల్ల చెరువు పరిసరాల్లోని వెంకట్రావునగర్, శేషాద్రినగర్‌లోని ఆ స్థలాల్లో ఇళ్లు కట్టించి అద్దెకు ఇచ్చారు.అయితే, నల్ల చెరువులోని ఆక్రమణలకు హైడ్రా అధికారులు ఇటీవల తొలగించారు. చెరువు పరిసరాల్లోని ఇతర నిర్మాణాలను కూడా హైడ్రా కూల్చేస్తుందని ప్రచారం సాగుతోంది. దీంతో తమ ఇళ్లు ఎక్కడ కోల్పోతామోననే భయంతో బుచ్చమ్మ బలవన్మరణానికి పాల్పడింది. ఆ ఇళ్లను కూల్చివేస్తే తమ కూతుళ్ల ఇబ్బందులు పడతారని ఆమె మనోవేదనకు గురైంది.

# అయోమయంలో వైసీపీ?

(1వపేజీ తరువాయి)జగన్ క్రిస్టియన్ కావడంతో తిరుమలలో డిక్లరేషన్ ఇవ్వాలని హైందవ సంఘాలు డిమాండ్ చేశాయి. తిరుమలలో అక్కడి సంప్రదాయాలను పాటించకపోయినా, గౌరవించకపోయినా భక్తుల విశ్వాసాలు దెబ్బతినే అవకాశం ఉండటంతో నిబంధనలు పాటించాలని అంతా డిమాండ్ చేశారు. చివరకు జగన్ తన తిరుమల పర్యటనను రద్దు చేసుకుని ఏపీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. డిక్లరేషన్ నిబంధనల కొత్తగా వచ్చిందేమి కాదు. కొన్ని సంవత్సరాలు ఈ సంప్రదాయం ఉంది. దేశానికి రాష్ట్రపతిగా చేసిన వ్యక్తులు సైతం డిక్లరేషన్ ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. కానీ జగన్ మాత్రం తాను విశ్వసించే మతాన్ని బహిరంగంగా చెప్పడానికి ఇష్టపడకపోవడం, డిక్లరేషన్‌లో సంతకం చేయాలని అడగడంతో ఏకంగా ఆయన మత సంప్రదాయాలపై దాడి చేసే ప్రయత్నం చేశారనే విమర్శలు వస్తున్నాయి.

**రాజకీయ ప్రయోజనాల కోసమేనా..**

తన మతం మానవత్వం అంటూ జగన్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసమేనని హైందవ సంఘాలు, కూటమి పార్టీలు ఆరోపిస్తున్నాయి. డిక్లరేషన్‌పై సంతకం చేసి తిరుమల శ్రీవారిని దర్శించుకోవచ్చు. కానీ శ్రీవారిపై భక్తి కంటే రాజకీయ ప్రయోజనాలను ఆశించి.. మత సంప్రదాయాలపై వివాదం సృష్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తానికి జగన్ తీరుతో ఆ పార్టీ నాయకులు అయోమయంలో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది.

# డిజిటల్ కార్డుల జారీ..


(1వపేజీ తరువాయి)ద్వారా సీఎంకు వివరించారు. డిజిటల్ కార్డుల్లో ఏయే వివరాలు ఉండాలి. ఎలా అప్‌డేట్ చేసుకోవాలనే వివరాలను ఆదివారం సాయంత్రం లోగా కేబినెట్ సబ్ కమిటీకి నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మంత్రివర్గ ఉప సంఘం సూచనల మేరకు మార్పులు, చేర్పులు చేసి తుది నివేదిక తయారు చేయాలన్నారు. పైలట్ ప్రాజెక్టు పర్యవేక్షణ కోసం గ్రామీణ ప్రాంతాల్లో ఆర్డీవో, పట్టణ, నగర ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ స్థాయి అధికారిని నియమించాలని సీఎం రేవంత్.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సూచించారు. సమీక్షలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనరసింహ, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, సీఎం కార్యాలయ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర వరద సాయమేదీ!?

(1వపేజీ తరువాయి)సంజయ్ కుమార్ వరద నష్టంపై ఏరియల్ సర్వే నిర్వహించారు.
అలాగే.. వరద నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందాలు సైతం రాష్ట్రానికి వచ్చాయి. ప్రధానంగా ఎక్కడెక్కడ అయితే వరదల వల్ల నష్టం ఏర్పడిందో అక్కడ వారు పర్యటించారు. నష్టం అంచనాలను లెక్కలు వేశారు. ఆ తదుపరి సచివాలయంలో ముందుగా పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో రివ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సుమారు 5వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు తాత్కాలికంగా అంచనా వేశామని రేవంత్ ఆ సమయంలో వారి దృష్టికి తీసుకెళ్లారు. జరిగిన నష్టానికి అనుగుణంగా సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆ తదుపరి కేంద్రం బృందంతో నిర్వహించిన రివ్యూలోనూ అదే విషయాన్ని వివరించారు. కేంద్ర బృందం వచ్చి సర్వే నిర్వహించిన కూడా రెండు వారాలు దాటింది.
కానీ.. ఇంతవరకు కేంద్రం సాయం విషయంలో ఎలాంటి ప్రకటన రాలేదు. అసలు రాష్ట్రానికి ఎంత సాయం అందిస్తున్నారన్న అంశంపైనా క్లారిటీ లేకుండాపోయింది. ఇటు రాష్ట్ర పెద్దలు, అటు వరద బాధితులు కేంద్రం ఇచ్చే సాయం కోసం ఎదురుచూస్తున్నారు. అయితే.. ప్రస్తుతం దేశంలో జమ్మూకశ్మీర్, హర్యానా రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. దీంతో కేంద్రం పెద్దలంతా కూడా ఆ ఎన్నికల బిజీలో ఉండిపోయారు. వరద బాధితులకు సాయం అందాలంటే ముందుగా హైరిస్క్ టీమ్ భేటీ కావాల్సి ఉంటుంది. ఆ తదుపరి కేంద్ర కేబినెట్ భేటీ అయి సాయాన్ని ప్రకటించాల్సి ఉంటుంది. కానీ.. ఇప్పుడు బీజేపీ నేతలంతా ఎన్నికల బిజీలో పడడంతో అది కాస్త వరద బాధితుల పాలిట శాపంలా తయారైంది. కేంద్ర హైరిస్క్ కమిటీ ఇంకా కేంద్ర బృందం ఇచ్చిన సర్వే రిపోర్టు పైనే కసరత్తు చేస్తున్నట్లుగానూ టాక్ నడుస్తోంది. ఈ స్టడీ ఎప్పటివరకు ముగుస్తుంది..? ఆ ఎన్నికలు ఎప్పుడు అయిపోతాయి..? తమకు ఎప్పుడు సాయం అందుతుందా..? అని బాధితులు మాత్రం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. కేంద్రం స్పందించి తొరగా సాయం అందించాలని ఇటు రాష్ట్ర పెద్దలు సైతం కోరుతున్నారు.

# లులూ మళ్లీ వస్తోంది: సీఎం

**అమరావతి-నవభూమి:** లులూ సంస్థ మళ్లీ ఏపీకి వస్తోందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. లులూ గ్రూప్ చైర్మన్, ఎండీ యూసుఫ్ అలీకి, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అష్రఫ్ అలీకి సాదర స్వాగతం పలుకుతున్నానని తెలిపారు. ఇవాళ లులూ అధినేత యూసుఫ్ అలీ తన బృందంతో అమరావతిలో సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సమావేశం ఎంతో సంతృప్తికరంగా సాగిందని చంద్రబాబు వెల్లడించారు. వైజాగ్ లో ఓ భారీ షాపింగ్ మాల్, మల్టీప్లెక్స్... విజయవాడ, తిరుపతిలో హైపర్ మార్కెట్, మల్టీప్లెక్స్ థియేటర్లు నిర్మించడంపై చర్చించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పడంపైనా ఈ సమావేశంలో ప్రస్తావన వచ్చిందని చంద్రబాబు వివరించారు. లులూ సంస్థకు ఏపీ ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. మిత్రుడు యూసుఫ్ అలీ భవిష్యత్ లో స్థాపించబోయే ప్రాజెక్టులు అన్నీ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నట్టు చంద్రబాబు సోషల్ మీడియాలో వెల్లడించారు.



## మణిపూర్‌లో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం



**న్యూఢిల్లీ– నవభూమి:** మైతీ, కుకీ జాతుల మధ్య ఘర్షణలతో రగులుతున్న మణిపూర్‌లో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మణిపూర్ పోలీసులు, అస్సాం రైఫిల్స్ సంయుక్తంగా మూడు జిల్లాల్లో తనిఖీలు నిర్వహించారు. కాంగ్‌పోక్పి జిల్లాలోని లోచింగ్ రిడ్జ్‌లో భారీగా ఆయుధాలను శుక్రవారం కనుగొన్నారు. 303 రైఫిల్స్, మ్యాగజైన్‌తో కూడిన ఒక 9 ఎంఎం పిస్టల్, క్యాట్రిడ్జ్‌లు, నాలుగు హ్యాండ్ గ్రెనేడ్‌లు, రెండు డిటోనేటర్లు, దేశంలో తయారు చేసిన మోర్టార్, లాంగ్ రేంజ్ ఇంప్రూవైజ్డ్ మోర్టార్‌ను స్వాధీనం చేసుకున్నారు.

కాగా, తౌబల్ జిల్లాలోని ఫైనోమ్ కొండ ప్రాంతంలో నాలుగు హ్యాండ్ గ్రెనేడ్‌లు, రెండు 'పంపి' షెల్స్, మూడు డిటోనేటర్లు, స్టన్ గ్రెనేడ్, స్టింగర్ గ్రెనేడ్, టియర్ గ్యాస్ షెల్‌ను మణిపూర్ పోలీసులు, అస్సాం రైఫిల్స్ బృందం స్వాధీనం చేసుకున్నది. అలాగే బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్‌తో కలిసి మణిపూర్ పోలీసులు చురచంద్‌పూర్ జిల్లాలోని గోథోల్ గ్రామంలో సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. స్థానికంగా 'పంపి' అని పిలిచే రెండు అధునాతన మోర్టార్‌లను స్వాధీనం చేసుకున్నారు.

## ఆవును కాపాడబోయి.. కుటుంబంలోని నలుగురు మృతి




**కోల్‌కతా– నవభూమి:** ఆవును కాపాడబోయి ఒక కుటుంబంలోని నలుగురు మరణించారు. విద్యుదాఘాతానికి గురై వృద్ధులైన భార్యాభర్తలు, వారి కుమారుడు, మనుమడు చనిపోయారు. ఆ సమయంలో ఇంట్లో లేని వారి కోడలు ఈ దుర్ఘటన నుంచి తప్పించుకున్నది. పశ్చిమ బెంగాల్‌లోని జలపైగురి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం సాయంత్రం టాకిమరి గ్రామానికి చెందిన 30 ఏళ్ల మిథున్ పొలం నుంచి ఆవును ఇంటికి తీసుకెళ్తున్నాడు. షెడ్డు బయట నిలిచిన నీటిలో పడి ఉన్న కరెంట్ వైరు ఆవుకు తగిలింది. ఈ నేపథ్యంలో ఆవును రక్షించేందుకు ప్రయత్నించిన మిథున్ విద్యుదాఘాతానికి గురై మరణించాడు.

కాగా, మిథున్ అరుపులు విన్న 60 ఏళ్ల తండ్రి పరేష్, తల్లి దీపాలి తమ కుమారుడ్ని కాపాడేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో వారిద్దరూ కూడా కరెంట్ షాక్‌తో చనిపోయారు. దీపాలి చేతుల్లో ఉన్న మిథున్ కుమారుడైన రెండేళ్ల సుమన్ కూడా ఈ సంఘటనలో మరణించాడు. మరోవైపు ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దుర్ఘటన జరిగిన సమయంలో మిథున్ భార్య ఇంట్లో లేదని పోలీసులు వెల్లడించారు.

## ప్రముఖులకు ఆతిథ్యం ఇచ్చే ఫైవ్‌స్టార్ హొటల్‌కు బాంబు బెదిరింపులు..

### అప్రమత్తమైన పోలీసులు



**న్యూఢిల్లీ– నవభూమి:** తాజ్ గ్రూప్‌కు చెందిన ప్రముఖ హొటల్‌కు బాంబు బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఉన్న తాజ్ వెస్ట్ ఎండ్ హొటల్‌కు శనివారం తెల్లవారు జామున బాంబు బెదిరింపులు వచ్చాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఈ మెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. ప్రముఖ రాజకీయ నాయకులు, క్రికెటర్లకు ఆతిథ్యం ఇచ్చే ఈ ఫైవ్‌స్టార్ హొటల్‌కు బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపింది. వెంటనే అప్రమత్తమైన హొటల్ యాజమాన్యం పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన స్థానిక పోలీసులు బాంబ్ స్క్వాడ్ , డాగ్ స్క్వాడ్ సాయంతో హొటల్‌లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించినట్లు సెంట్రల్ బెంగళూరు డీసీపీ శేఖర్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువూ, పేలుడు పదార్థాలూ కనిపించలేదని పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి ఈమెయిల్ ఆధారంగా దుండగులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు.

## టాటా ఐఫోన్ ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం.. ఎగసిపడుతున్న మంటలు



**న్యూఢిల్లీ– నవభూమి:** తమిళనాడు రాష్ట్రంలో ఘోర అగ్నిప్రమాదంసంభవించింది. టాటా కంపెనీకి చెందిన ఐఫోన్ ప్లాంట్ లో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడుతున్నాయి. కృష్ణగిరి ( జిల్లాలో శనివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉద్దానపల్లిలోని టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో మెబైల్ ఫోన్ యాక్సెసరీస్ పెయింటింగ్ యూనిట్‌లోని రసాయన గోదాములో ఉదయం 5:30 గంటలకు మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. అనంతరం గోదాములో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ సురక్షితంగా బయటకు తరలించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు హుటాహుటిన ఏడు ఫైర్ ఇంజిన్లతో ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపుచేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ కంపెనీలో టీఈపీఎల్ సంస్థ ఐఫోన్లలో వాడే వివిధ ఉపకరణాలను ఉత్పత్తి చేస్తోంది. సుమారు 4,500 మంది ఉద్యోగులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ప్రమాద సమయంలో ఫస్ట్ షిఫ్ట్‌లో 1,500 మంది ఉద్యోగులు డ్యూటీలో ఉన్నారు. ఈ ఘటనలో ప్రాణ నష్టం జరగలేదని పోలీసులు వెల్లడించారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. గోదాము నుంచి పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడుతున్న వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.

## కుల్గాంలో ఎదురుకాల్పులు.. ముగ్గురు ఆర్మీ జవాన్లకు గాయాలు



**న్యూఢిల్లీ– నవభూమి:** జమ్మూ కశ్మీర్ లో మరోసారి ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. కుల్గాం జిల్లాలో శనివారం ఉదయం భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో నలుగురు అధికారులకు గాయాలయ్యాయి. కుల్గాం జిల్లాలోని అదిగమ్ గ్రామంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న ముందస్తు సమాచారంతో భద్రతా దళాలు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. ఉగ్రవాదుల కోసం ప్రతి ఇంట్లో సోదాలు చేపట్టారు. ఈ క్రమంలోనే భద్రతా దళాలపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. అప్రమత్తమైన భద్రతా దళాలు ఎదురు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ముగ్గురు ఆర్మీ జవాన్లు, ఓ పోలీసు అధికారికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని అధికారులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఆపరేషన్ కొనసాగుతోంది.

### ఎండీసీ ఎన్నికల్లో రాజ్యాంగాన్ని ఉల్లంఘించారు..

## సుప్రీంకోర్టుకు వెళ్తాం.. : సీఎం అతిషీ




**న్యూఢిల్లీ–నవభూమి:** ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఖాళీగా స్టాండింగ్ కమిటీ స్థానానికి శుక్రవారం ఓటింగ్ జరిగింది. ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ ఎన్నికల్లో పాల్గొనలేదు. అయితే, ఎండీసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికను ఆప్ రాజ్యాంగ, చట్ట విరుద్ధమని ఆమ్ ఆద్మీ పార్టీ పేర్కొంది. ఎన్నిక అక్రమ పద్ధతిలో జరిగిందని.. ఎన్నికల్లో లెఫ్టినెంట్ గవర్నర్, బీజేపీ, వారి అధికారులు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఉల్లంఘించారని సీఎం అతిషీ ఆరోపించారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. 18వ ఎండీసీ సభ్యుడి కోసం శుక్రవారం ఎన్నిక జరగ్గా.. ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నికల్లో పాల్గొనలేదు. బీజేపీ కౌన్సిలర్స్ మాత్రమే పాల్గొని ఓటు వేశారు. దాంతో అధికారులు బీజేపీ అభ్యర్థి విజయం సాధించినట్లు ప్రకటించారు. ఈ ఎన్నికలపై సీఎం అతిషీ మాట్లాడుతూ.. మన దేశం రాజ్యాంగ, రాజ్యాంగం ద్వారా రూపొందించిన చట్టాలపై నడుస్తుందన్నారు. పార్లమెంట్ ఓ చట్టాన్ని ఆమోదించిందన్నారు. కార్పొరేషన్ సమావేశంలో దాని తేదీ, సమయం, స్థలాన్ని మేయర్ మాత్రమే నిర్ణయిస్తారని.. కార్పొరేషన్ సమావేశానికి మేయర్ మాత్రమే అధ్యక్షత వహిస్తారన్నారు. ప్రజాస్వామ్య ఉల్లంఘన, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఉల్లంఘించినా బీజేపీ పట్టించుకోదని, అధికారాలు లేకపోయినా లెఫ్టినెంట్ గవర్నర్ ఉత్తర్వులు ఇస్తారని, కమిషనర్ ఆదేశాలను పాటించి కార్పొరేషన్ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహిస్తారని అతిషి విమర్శించారు. ఎన్నికైన మేయర్ స్థానంలో ఏఐఎస్ అధికారిని అధ్యక్షుడిగా చేస్తుందన్నారు. వివాదాల మధ్య శుక్రవారం జరిగిన ఎన్నికల్లో బీజేపీకి చెందిన సుందర్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆప్, కాంగ్రెస్ బహిష్కరించగా.. 115 ఓట్లతో సుందర్ సింగ్ తన్వర్ విజయం సాధించినట్లు ప్రకటించారు. 18 మంది సభ్యుల కమిటీలో బీజేపీకి 10, ఆప్‌కి ఎనిమిది మంది నభ్యులున్నారు. వాస్తవానికి గురువారం అర్ధరాత్రి ఎన్నికలు జరగాల్సి ఉన్నా.. వాయిదాపడింది. ఎల్‌జీ ఆదేశాల మేరకు శుక్రవారం మళ్లీ సభను సమావేశ పరిచారు. అయితే, అయితే మేయర్ షైలీ ఒబెరాయ్, డిప్యూటీ మేయర్ అలె ఇక్బాల్, సీనియర్ కౌన్సిలర్ ముఖేష్ గోయల్ అధ్యక్షత వహించేందుకు నిరాకరించారు. ఆ తర్వాత కమిషనర్ ఎన్నికల నిర్వహణకు ప్రిసైడింగ్ అధికారిగా అదనపు కమిషనర్ జితేంద్ర కుమార్‌ను నియమించారు. ఒంటిగంటకు అడిషనల్ కమిషనర్ సమావేశానికి ప్రిసైడింగ్ అధికారిగా వచ్చి ఎన్నికలు నిర్వహించారు. ఈ సమయంలో బీజేపీకి చెందిన మొత్తం 115 మంది సభ్యులు హాజరయ్యారు. ఓటింగ్ సమయంలోనూ ఓటు వేయని సభ్యుల పేర్లను పిలిచారు. చివరకు ఎవరూ రాకపోవడంతో బీజేపీ అభ్యర్థి 115 ఓట్లతో గెలిచినట్లు ప్రకటించారు.

### కోర్టు హాల్‌లోకి చైనా వెల్లిగడ్డలతో లాయర్..

## జడ్జి సీరియస్.. విషయం ఏందంటే..!



**న్యూఢిల్లీ– నవభూమి:** ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ హైకోర్టులో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ఓ న్యాయవాది అర కిలో చైనీస్ వెల్లుల్లితోపాటు మన దేశంలో ఉత్పత్తయ్యే సాధారణ వెల్లుల్లిని తీసుకుని కోర్టు హాల్‌కు వచ్చాడు. దాంతో న్యాయమూర్తి సీరియస్ అయ్యారు. ఇంతకూ ఆ లాయర్ వెల్లుల్లిని కోర్టు రూమ్‌లోకి ఎందుకు తీసుకొచ్చాడు..? జడ్జి ఎందుకు సీరియస్ అయ్యారు? అనే విషయాలను వివరంగా తెలుసుకుందాం..

అసలు విషయం ఏమిటంటే.. మన దేశంలో చైనా వెల్లుల్లిపై నిషేధం ఉంది. 2014లో చైనా వెల్లుల్లి దిగుమతి, వాడకంపై నిషేధం విధించారు. అయినప్పటికీ ఇంకా మన దేశ మార్కెట్‌లో చైనా వెల్లుల్లి విరివిగా లభిస్తున్నది. ఈ విషయాన్ని ఆధారాలతో నిరూపించాలనే ఆ న్యాయవాది ఇలా చేశారు. భారత మార్కెట్‌లలో చైనా వెల్లుల్లి లభ్యత అంశాన్ని లేవనెత్తుతూ.. న్యాయవాది మోతీలాల్ యాదవ్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా జస్టిస్ రాజన్ రాయ్, జస్టిస్ ఓం ప్రకాశ్ శుక్లాలతో కూడిన ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వానికి సమన్లు జారీ చేసింది. చైనీస్ వెల్లుల్లి లభ్యతను సీరియస్‌గా తీసుకున్న అలహాబాద్ హైకోర్టు.. యూపీ ప్రభుత్వ ఫుడ్ సేఫ్టీ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ అధికారిని కోర్టుకు పిలిపించింది. అతడిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. హానికరమైన ప్రభావాల కారణంగా 2014లోనే చైనా వెల్లుల్లిపై నిషేధం విధించినా ఇంకా మన మార్కెట్లోకి ఎలా వస్తోందని ధర్మాసనం ప్రశ్నించింది. ఇలాంటి నిషేధిత వస్తువులు దేశంలోకి ప్రవేశించకుండా నిరోధించే యంత్రాంగానికి తగిన సూచనలు చేయాలని భారత డిప్యూటీ సొలిసిటర్ జనరల్ సూర్యభాన్ పాండేని ఆదేశించింది.

అలాంటి వస్తువుల ప్రవేశానికి మూలాన్ని గుర్తించడానికి, నిరోధించడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో తెలుపాలని కోర్టు కోరింది. భారత మార్కెట్‌లో నిషేధిత చైనీస్ వెల్లుల్లి ఎగుమతి, అమ్మకాలపై విచారణ జరిపి దోషులుగా ఉన్న అధికారులు, ఇతర నేరస్థులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా సీబీఐని ఆదేశించాలని న్యాయవాది యాదవ్ తన పిటిషన్‌లో కోరారు. దేశంలోకి ఫంగస్ సోకిన వెల్లుల్లి వస్తుందని వచ్చిన నివేదికల కారణంగా 2014లో భారత ప్రభుత్వం చైనీస్ వెల్లుల్లి దిగుమతిని నిషేధించింది. అక్రమంగా తరలిస్తున్న వెల్లుల్లిలో పురుగు మందులు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేయడంతో భారత్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రపంచంలో వెల్లుల్లిని ఎక్కువగా ఉత్పత్తి చేసే దేశం చైనా. చైనీస్ వెల్లుల్లి పురుగు మందులు, రసాయనాలను ఉపయోగించి ఉత్పత్తి చేయబడుతుందని యాదవ్ తన పిల్‌లో పేర్కొన్నారు. అందువల్ల ఇది భారతదేశ నాణ్యతా ప్రమాణాలను అందుకోవడంలో విఫలమైందన్నారు. దేశంలో చైనా వెల్లుల్లి దిగుమతి, రవాణా, అమ్మకంపై నిషేధం ఉన్నప్పటికీ మన మార్కెట్‌లో అందుబాటులో ఉందన్నారు.

## పవన్ వీర హిందూత్వ...టీడీపీని కలవరపెడుతోందా ?



**ఏపీ: నవభూమి:** పవన్ కళ్యాణ్ రాజకీయ నాయకుడు కంటే ఎమోషనల్ గా కనెక్ట్ అయ్యే ఒక సగటు మనిషిగానే అంతా చూడాల్సి ఉంటుంది. ఆయనకు ఏ విషయం మీద అయినా కమిట్మెంట్ ఉందంటే దానిని ఆయన ఎక్కడా దాచుకోరు. అంతే కాదు ఆయన బలంగా గట్టిగా చెప్పాల్సిన చోట చెబుతారు. పవన్ స్వభావమే అంత. ఆయన దేనికీ ఎవరికీ భయపడరు. ఆయన ఈ దేశాన్ని ఎక్కువగా ప్రేమిస్తారు. దేశంలోని సనాతన ధర్మం పట్ల కూడా ఆయనకు ఉన్న అంకితభావం ఏమిటో తాజాగా ఆయన చెప్పిన మాటలు చేసిన ప్రసంగాలు చూస్తే అర్థం అవుతుంది. పవన్ కళ్యాణ్ తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ అయిన విషయంలో తీవ్రంగా కలత చెందారు అన్నది తెలిసిందే. %ూశ్రీంశీ =ఝుం% – హాంకాంగ్ లో విష సంస్కృతి... మహిళలపై ఇదేం పాడుపని? అందుకే ఆయన ప్రాయశ్చిత్త దీక్షకు పూనుకున్నారు. అంతే కాదు కనకదుర్గమ్మ వారి మెట్లను కడగడం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. అంతే కాదు సనాతన ధర్మం పట్ల చులకనగా మాట్లాడరాదు అని ఆయన హెచ్చరించారు. ఈ విషయంలో తాను ఉన్న సినీ సీమలో ఎవరు అయినా ఎలాంటి మాట మాట్లాడినా ఆయన సహించలేకపోయారు. ఆఖరుకు అది ప్రకాష్ రాజ్ అయినా కార్తీ అయినా పవన్ స్టాండ్ ఒక్కటే. ఆయన ఆవేశంగానే బదులిచ్చారు. మరోవైపు చూసుకుంటే హిందూ ధర్మానికి ఇబ్బంది కలుగుతూంటే హిందువులు అంతా బయటకు రావాలి కదా వారు వచ్చి తమ సంఘీభావం తెలియచేయాలి కదా పవన్ కోరిన తీరు కానీ ఇచ్చిన పిలుపు కానీ ఎన్న తగినదే. ఒక సగటు రాజకీయ నేత నుంచి ఎవరూ ఇలాంటి పిలుపుని ఆశించలేరు. వారి ఎన్నో కొలతలు లెక్కలు పారామీటర్లు పెట్టుకుని ఆలోచిస్తారు. కానీ ముందే చెప్పుకున్నట్లుగా పవన్ కళ్యాణ్ కమిట్మెంట్ ని ఎవరూ శంకించలేరు. అయితే పవన్ లో ఈ వీర హిందూత్వ వైఖరి ఆయన ఆవేశం టీడీపీ కూటమిలోని బీజేపీకి అయితే మహా సంతోషంగా ఉంటోంది. కానీ అదే కూటమిని లీడ్ చేస్తున్న టీడీపీకి మాత్రం ఇబ్బందిగా ఉంది అని అంటున్నారు. ఎందుకంటే టీడీపీ లడ్డూ కల్తీ ఇష్యూ తానుగా బయటపెట్టినా ఒక పరిమితికి లోబడే కామెంట్స్ చేసింది. పైగా టీడీపీ కామెంట్స్ అన్నీ జగన్ చుట్టూనే అల్లుకుని సాగాయి. ఆయననే కార్నర్ చేస్తూ వెళ్లాయి. దాని వల్ల బహువిధాలుగా లాభాలను టీడీపీ ఆశించింది. మధ్యలో పవన్ వీవ హిందూత్వ ఎపిసోడ్ లేకపోయి ఉంటే కనుక టీడీపీ ప్లాన్స్ నూరు శాతం పారేవి. అయితే పవన్ ఆవేశంతో చేసిన కొన్ని కామెంట్స్ వల్లనే ఇపుడు టీడీపీలో చర్చ సాగుతోంది. అదే సమయంలో మాజీ ఎంపీ హర్ష కుమార్ లాంటి వారు అంతా పవన్ మీద విమర్శలు చేస్తూ వచ్చారు. దళితులను ముందుకు తెచ్చి మరీ వారు టీడీపీ కూటమి తీరుని ఎండగట్టారు. అలాగే ఇతర వర్గాల గురించి కూడా వారు మద్దతుగా మాట్లాడుతూ బీజేపీ మూసలోకి టీడీపీ కూటమి వెళ్తోంది అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇంకో వైపు చూస్తే పవన్ ప్రవచించిన సనాతన ధర్మం అన్నది కూడా లడ్డూ కల్తీ అయిన ఇష్యూని దాటి ఒక బిగ్ డిబేట్ గా సాగింది. వామపక్షాలు అయితే దీని మీద ఫైర్ అయ్యారు. ఏపీలో అధికారం ఇస్తే మత రాజకీయాలు చేస్తారా అని వామపక్ష నేతలు విరుచుకుపడుతున్నారు. మరో వైపు కొన్ని వర్గాలలో కూడా సందేహాలు రేపేలా ఇటీవల పరిణామాలు ఉన్నాయని అంటున్నారు. ! అయితే పవన్ కళ్యాణ్ ఆవేశం వెనక అంకితభావం ఉంది. అర్థం ఉంది. ఆయన రాజకీయ సమీకరణలు లెక్కలు కాకుండా అతీతంగానే మాట్లాడుతారు. దాంతోనే ఇపుడు టీడీపీలో చర్చ సాగుతోంది. పవన్ వీర హిందూత్వ వల్ల ఇబ్బందులు వస్తాయా అని సందేహాలు ఉన్నా కూడా టీడీపీ అయితే ముందుకు సాగిపోవడం తప్ప చేసేది ఏమీ లేదని అంటున్నారు. ఏది ఏమైనా పవన్ మొదటి మూడు నెలలూ సైలెంట్ గానే ఉన్నారు. ఎన్నికల తరువాత ఆయన మరోసారి తన అవేశాన్ని ప్రదర్శించారు. ఇపుడు అధికారంలో కూటమి ఉంది కాబట్టే అది ఏమైనా వేరే సంకేతాలు ఇస్తుందా అన్నదే మల్లగుల్లాలు పడుతున్నారుట.

## అమెరికాను వణికించిన హరికేన్ హెలెనా...



**న్యూఢిల్లీ–నవభూమి:** ఆగ్నేయ అమెరికాలో అతితీవ్రమైన హరికేన్ హెలెనా విధ్వంసం సృష్టిస్తోంది. హెలెన్ నేషనల్ హరికేన్ సెంట్రల్ డేటా ప్రకారం... యూఎస్ చరిత్రలో 14వ అత్యంత శక్తివంతమైన హరికేన్ గా, ఫ్లోరిడాలోకి దూసుకొచ్చిన ఏడవ అత్యంత శక్తివంతమైన హరికేన్ గా ఇది నిలిచిందని అంటున్నారు. ఈ తుఫాను కారణంగా ఇప్పటివరకూ 44 మంది మృతి చెందినట్లు చెబుతున్నారు. అవును... అతి తీవ్రమైన హరికేన్ హెలెనా ఆగ్నేయ అమెరికాలో విధ్వంసం సృష్టిస్తోంది. ఫ్లోరిడా, జార్జియా, నార్త్ కరోలినా, సౌత్ కరోలినా, వర్జీనియా రాష్ట్రాల్లో కేటగిరి – 4 హరికేన్ ప్రభావం అధికంగా ఉందని చెబుతున్నారు. ఈ తుఫాను కారణంగా సుమారు 15 నుంచి 25 బిలియన్ డాలర్ల ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. మృతులు కనీసం 44 మందని అధికారులు ధృవీకరించారు! మృతుల్లో ముగ్గురు అగ్నిమాపక సిబ్బందితో పాటు ఓ మహిళ, నెల వయసున చిన్నారి సైతం ఉన్నట్లు వెల్లడించారు. ఇక వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాని అధ్యక్షుడు జో బైడెన్ తెలిపారు. అందరూ సురక్షితంగా ఉండాలని తాను ప్రార్థిస్తున్నట్లు వెల్లడించారు. మొత్తం ఐదు రాష్ట్రాల్లో అత్యవసర ప్రకటనలను ఆమోదించారు. ఈ సందర్భంగా స్పందించిన గవర్నర్ బ్రియాన్ కెంప్... దక్షిణ జార్జియా నగరంలోని వాల్డోస్టాలో 115 నిర్మాణాలు హెలెన్ కారణంగా దెబ్బతిన్నాయని.. వాటి లోపల చిక్కుకున్న ప్రజలను రక్షించడానికి సిబ్బంది తీవ్రంగా ప్రయత్నించారని అన్నారు. ఫ్లోరిడాలో తుఫాను తీరం దాటేటప్పుడు గంటకు 225 కి.మీ. వేగంతో గాలులు వీచినట్లు అధికారులు పేర్కొన్నారు. ఫ్లైట్ అవేర్, ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్ సైట్స్ ప్రకారం... శుక్రవారం మధ్యాహ్నం నాటికి 900 కంటే ఎక్కువ యూఎస్ విమానాలు రద్దు చేయబడగా.. 3,300 కంటే ఎక్కువ విమానాలు ఆలస్యం అయ్యాయి. ఇక దక్షిణాది రాష్ట్రాలైన జార్జియా, ఫ్లోరిడా, సౌత్ కరోలినా, నార్త్ కరోలినా, వర్జీనియాల్లో సుమారు 3.5 మిలియన్ల మంది విద్యుత్ లేకుండా ఉండిపోయారు.

## లీవ్ ఇవ్వని మేనేజర్.. చివరికి ఉద్యోగి ప్రాణాల మీదకు..



**న్యూఢిల్లీ–నవభూమి:** అనారోగ్యానికి గురయ్యాని.. ఒకరోజు సెలవు ఇవ్వాలని కోరినందుకు ఆ మేనేజర్ కర్కశంగా ప్రవర్తించాడు. చివరకు ఆయన నిర్ణయం కాస్త ఆ ఉద్యోగి ప్రాణాల మీదకు తెచ్చింది. థాయ్‌లాండ్‌లోని సుఖోథాయ్‌లో జరిగిన ఈ ఘటన ఆ కంపెనీలో తీవ్ర విషాదం నింపింది. సుఖోథాయ్‌లోని డెల్టా ఎలక్ట్రానిక్స్ ప్లాంట్‌లో 30 ఏళ్ల యువతి ఉద్యోగి చేస్తోంది. కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. పెద్దపేగు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆమె ఈ నెలలోనే 5 నుంచి 9 వరకు అనారోగ్య సెలవులు తీసుకున్నారు. అనంతరం డ్యూటీకి వచ్చింది. కానీ ఆరోగ్య పరిస్థితిలో మార్పు కనిపించలేదు. దాంతో మళ్లీ ఆమె సెలవు పెట్టింది. తిరిగి 12న విధుల్లో చేరింది. అప్పటికీ ఆమె ఆరోగ్య పరిస్థితి అలానే ఉండిపోయింది. దాంతో అనారోగ్యంతో ఉన్నానని సెలవు కోసం మేనేజర్ వద్దకు వెళ్లింది. కానీ.. ఆ మేనేజర్ మాత్రం లీవ్ ఇచ్చేందుకు నిరాకరించాడు. సెలవు కావాలంటే డాక్టర్ సర్టిఫికేట్ కావాలని ఆదేశించాడు. అటు డాక్టర్ సర్టిఫికేట్ తీసుకురాలేక.. ఇటు ఉద్యోగం పోతుందనే భయంతో ఆమె అలాగే విధులు నిర్వర్తించింది. ఆ మరుసటి రోజు డ్యూటీకి వచ్చిన 20 నిమిషాలకే ఆమె కుప్పకూలింది. ప్రాథమిక చికిత్స అనంతరం ఆస్పత్రికి తరలించినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. ఇప్పటికే థాయ్‌లాండ్‌లో ఉద్యోగుల సంక్షేమంపై ఆందోళనలు ఉన్నాయి. ఈ క్రమంలో ఈ ఘటన జరగడంతో మరింత రెట్టింపయింది. కాగా.. యువతి మృతిపై డెల్టా కంపెనీ స్పందించింది. ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టింది. తమ సంస్థ సభ్యులలో ఒకరిని కోల్పోయామని, ఈ క్లిష్ట సమయంలో కంపెనీ ఆమె కుటుంబం, స్నేహితులు, సహోద్యోగులకు సంతాపం తెలుపుతున్నట్లు అందులో పేర్కొంది. అటు డెల్టా సీఈఓ విక్టర్ చెంగ్ సైతం ఈ ఘటనపై స్పందించారు. డెల్టా ఎలక్ట్రానిక్స్ ఓ ఉద్యోగిని కోల్పోయిందని, ఇది అత్యంత బాధాకరమని చెప్పుకొచ్చారు. దీనిపై విచారణ జరిపించి.. ఆ తరువాత మరిన్ని వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. వారి కుటుంబానికి తమ సంస్థ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## ముంబైకి ఉగ్రముప్పు హెచ్చరికలు.. పోలీసులు హై అలర్ట్

**న్యూఢిల్లీ– నవభూమి:** దేశ ఆర్థిక రాజధాని ముంబై లో భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయి. ముంబై మహానగరానికి ఉగ్ర ముప్పు పొంచి ఉన్నట్టు కేంద్ర నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో అప్రమత్తమైన నగర పోలీసులు ముంబై వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టారు. రద్దీ ప్రాంతాలతోపాటు మతపరమైన ప్రాంతాల్లో సైతం పోలీసులు భారీగా మోహరించారు. ఆయా ప్రాంతాల్లో మాక్ డ్రిల్స్ సైతం నిర్వహించాలని ఆదేశించినట్లు నగర పోలీస్ ఉన్నతాధికారి ఒకరు శనివారం వెల్లడించారు. నగరంలోని డీసీపీలు (డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్) కూడా తమ తమ జోన్లలో భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే ముందు జాగ్రత్త చర్యగా వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని సూచించారు. అయితే, పండుగల సీజన్ నేపథ్యంలో నగరంలో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 10 రోజులపాటు గణేశ్ నవరాత్రి ఉత్సవాలు జరుపుకున్న ముంబై వాసులు ఇప్పుడు దుర్గాపూజ, దసరా, దీపావళి పండగలు సిద్ధమవుతున్నట్లు గుర్తు చేశారు.

## ముడా స్కామ్‌లో ఏ1గా సిద్ధరామయ్య..





**న్యూఢిల్లీ– నవభూమి:**సీబీఐ విచారణ కోసం హైకోర్టుకు ఆర్టీఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ బెంగళూరు, సెప్టెంబర్ 27: ముడా స్కామ్‌లో కర్ణాటక కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై కేసు నమోదైంది. ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టు ఆదేశాల మేరకు లోకాయుక్త పోలీసులు శుక్రవారం మైసూరులో ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇందులో సిద్ధరామయ్యను ఏ1గా, ఆయన భార్య బీఎం పార్వతిని ఏ2గా, బావమరిది మల్లికార్జున స్వామిని ఏ3గా, దేవరాజును ఏ4గా పేర్కొన్నది. దేవరాజు వద్ద నుంచే మల్లికార్జున స్వామి భూమిని కొని పార్వతికి బహుమతిగా ఇచ్చాడని చెప్తున్నారు. తక్కువ విలువ కలిగిన ఈ భూమిని అభివృద్ధి పనుల కోసం మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) సేకరించి, పరిహారంగా పార్వతికి ఖరీదైన 14 స్థలాలను కేటాయించిందనే ఆరోపణలు ఉన్నాయి. స్నేహమయి కృష్ణ అనే సమాచార హక్కు చట్టం కార్యకర్త సిద్ధరామయ్యపై ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో సిద్ధరామయ్యపై విచారణ చేసేందుకు గవర్నర్ అనుమతించగా, ఆయన హైకోర్టులో సవాల్ చేశారు. హైకోర్టు సైతం విచారణ జరగాల్సిందేనని స్పష్టం చేసింది. దీంతో ప్రజా ప్రతినిధుల కేసులు విచారించే ప్రత్యేక కోర్టు సిద్ధరామయ్యపై కేసు నమోదు చేయాలని లోకాయుక్త పోలీసులను బుధవారం ఆదేశించింది.



## వృత్తుల ఆధునికీకరణ

గ్లోబలైజేషన్ సందర్భంలో అగ్రవర్ణాలు సైతం డ్రైక్లీనింగ్, సెలూన్ వంటి వృత్తులలోకి ప్రవేశించారు. ఇది ఎలా సాధ్యమైంది? కేవలం వృత్తిని ఆధునికీకరించడం వల్ల మాత్రమే సాధ్యమైంది. గ్రామీణ స్థాయిలో వృత్తిని నమ్ముకొని పొట్టపోసుకునే వాళ్లకు వృత్తిని ఆధునికీకరించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. తద్వారా వృత్తి బ్రతకడమే కాకుండా, ఆ వృత్తి మీద ఆధారపడి జీవించే సమూహాలు కూడా బ్రతికేందుకు అవకాశం లభిస్తోంది.

తెలంగాణ రాష్ట్రంలో వృత్తుల సంక్షేమం కీలకంగా మారింది. మునుపెన్నడూ లేనివిధంగా వృత్తులకు పెద్దపీటవేయడం పట్ల భిన్నమైన స్పందనలు వ్యక్తమవుతున్నాయి. వృత్తిని ప్రోత్సహించడం అంటే రాజ్యాధికారానికి దూరం చేయడమా? లేక వృత్తులను కాపాడాల్సిన అవసరం ఉందా? అందులో వృత్తుల ఆధునికీకరణ అవసరాన్ని గుర్తిస్తున్నామా? అనే ప్రశ్నలు ప్రస్తుతం తెలంగాణ సమాజాన్ని, బుద్ధిజీవులను ఆలోచింపజేస్తున్నవి. వృత్తి అనగానే వెంటనే గుర్తుకు వచ్చే అంశం కులమే. చేతి వృత్తులు, సేవ వృత్తులు వెనుకబడిన కులాలకు చెందినవే. జనాభాలో సింహభాగంగా యాభై రెండు శాతంగా ఉన్న బీసీలతో మెజారిటీ వృత్తులు మమేకమై ఉన్నాయి. బీసీలకు సంక్షేమ ఫలాలు అందాలన్న ప్రభుత్వ లక్ష్యానికి గమ్యాగమనాలు చర్చించడమే ఈ వ్యాసోద్దేశం.

తెలంగాణలో వృత్తుల విధ్వంసం గ్లోబలైజేషన్ కంటే ముందే మొదలైంది. ఆంధ్ర వలస పాలనలో తెలంగాణలో వ్యవసాయ సంక్షోభం తలెత్తింది. అది పరోక్షంగా వృత్తుల మీద పడ్డది. దీంతో వృత్తుల మీదే ఆధారపడి జీవించే కులాలకు ఉపాధి లేకుండా పోయింది. వృత్తి మీద మమకారంతో దాన్ని?వదులుకోలేని కులాలు ఆకలి చావుల, ఆత్మహత్యల బాట పట్టిన విషాదం కూడా ఉంది. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన తెలంగాణ సర్కార్ తెరమీదికి తెచ్చిన అంశం వృత్తులకు ప్రోత్సాహం.

వృత్తులను ప్రోత్సహించడమంటే కుల వ్యవస్థను కాపాడడమేనా? అనే ప్రశ్న సమర్ధనీయమైంది కాదు. గ్రామీణ భారతపు ఎకానమీ అంతా వ్యవసాయం, వృత్తుల మీదే ఆధారపడి ఉందనే విషయాన్ని గమనించాలి. తెలంగాణ వెనుకబాటులో ఈ రెండు ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. వీటిలో కులం వల్ల వృత్తికి వచ్చిన అమానుష గుర్తింపులను వదిలించడానికి ప్రయత్నాలు జరగాలి. గౌతమ బుద్ధుని కాలం కంటే ముందు నుంచే వృత్తులు ఉన్నాయి. కానీ, ఆనాడు కులాలు లేకపోవడం వల్ల వృత్తులకు గౌరవం దక్కింది. మనువాద కుల వ్యవస్థ మొదలైన తరువాత వృత్తుల్లో గౌరవనీయమైన వృత్తులు, నీచ వృత్తులు, అంటరాని వృత్తులు అనే విభజన ఏర్పడింది. బీసీలు చేసే వృత్తులను బ్రాహ్మణీయ సమాజం గౌరవనీయమైనవిగా గుర్తించ నిరాకరించింది. ఇక సేవ కులాలుగా ఉన్న చాకలి, మంగలి వృత్తుల పట్ల ఇప్పటికీ వివక్ష కొనసాగుతూనే ఉంది. ఈ పరిస్థితి మారాలంటే ప్రభుత్వం కల్పించే ప్రోత్సాహం ఈ వృత్తిని ఆధునికీకరించే విధంగా ఉండాలి.

గ్లోబలైజేషన్ సందర్భంలో అగ్రవర్ణాలు సైతం డ్రైక్లీనింగ్, సెలూన్ వంటి వృత్తులలోకి ప్రవేశించారు. ఇది ఎలా సాధ్యమైంది? కేవలం వృత్తిని ఆధునికీకరించడం వల్ల మాత్రమే సాధ్యమైంది. వృత్తి ఆధునికీకరణ అనేది పూర్తిగా ఆర్థిక వనరుల మీద ఆధారపడిన విషయం. స్కిల్, టెక్నాలజీ, నాలెడ్జ్ దానికి తోడైనా సరే డబ్బున్నవారికి మాత్రమే వృత్తిని ఆధునికీకరించుకునే వెసులుబాటు ఏర్పడింది. అయితే గ్రామీణ స్థాయిలో వృత్తిని నమ్ముకొని పొట్టపోసుకునే వాళ్లకు వృత్తిని ఆధునికీకరించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. తద్వార వృత్తి బ్రతకడమే కాకుండా, ఆ వృత్తి మీద ఆధారపడి జీవించే సమూహాలు కూడా బ్రతికేందుకు అవకాశం లభిస్తోంది. అలాగే వృత్తిని ఆధునికీకరించడం వల్ల మాత్రమే వృత్తికి ఆపాదించబడిన తక్కువ ఎక్కువ కొలమానాలు కూడా క్రమంగా కనుమరుగై వృత్తి ప్రొఫెషన్‌గా ఎదుగుతుంది. ఈ దిశగా ప్రభుత్వం సంపూర్ణ ఆర్థిక పరిపుష్టికై ఆలోచనలు చేయాల్సిన అవసరం ఉంది. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వృత్తిని ఆధునీకరించాలి. ప్రత్యామ్నాయం లేకుండా వృత్తులు పోవాలని కోరుకోవడం అత్యాశ.

ఇక రాజ్యాధికార భాగస్వామ్యం విషయానికొస్తే... వృత్తులను ప్రోత్సహించడం పేరుతో, బహుజనులను రాజ్యాధికారానికి దూరం చేస్తున్నారనే చర్చ కూడా ఉంది. ఇది పాక్షిక సత్యమే. రాజ్యాధికారంలో వాటా జనాభా దామాషా ప్రకారం దక్కాల్సిందే. దాన్ని వృత్తుల ప్రోత్సాహానికి ముడిపెట్టడం సరైనది కాదు. ఇవి రెండు వేరు వేరు విషయాలు. ఇవాళ ఆకలితో ఉన్న వృత్తికులాలకు నీకు అధికారం కావాలా? అన్నం కావాలా? అంటే ఖచ్చితంగా ఆకలితీరే దారి గురించే ఆలోచిస్తాయి. అలాగని వారినేం అధికారానికి దూరం చేయాల్సిన అవసరం లేదు. ఇందుకోసం చేయాల్సిన పని దశలవారీగా ఉంది. ముందుగా వృత్తుల మీద ఆధారపడి జీవిస్తున్న వారి లెక్కలు తీయాలి.వారి వయసులు, చదువు ఆధారంగా ప్రోత్సాహం అందించాలి. అలాగే చదువు ఉండి ఉపాధి లేక అవస్థలు

# శ్వేత విప్లవం 2.0: భారతదేశ పాడి పరిశ్రమ వృద్ధికి కొత్త యుగం.



భారతదేశంలోని పాడి పరిశ్రమ చాలా కాలంగా వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో అంతర్భాగంగా ఉంది, లక్షలాది మందికి జీవనోపాధిని అందిస్తోంది మరియు గ్రామీణ అభివృద్ధికి గణనీయమైన కృషి చేస్తోంది. "ఆపరేషన్ ఫ్లడ్" ద్వారా నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డ్ నాయకత్వంలో 1970లలో ప్రారంభమైన "శ్వేత విప్లవం" భారతదేశాన్ని ప్రపంచవ్యాప్తంగా పాల ఉత్పత్తిలో అగ్రగామిగా మార్చింది. ఈ విజయాన్ని దృష్టిలో ఉంచుకుని, భారత ప్రభుత్వం ఇప్పుడు "శ్వేత విప్లవం 2.0" 2.0)ని ప్రారంభించింది. ఇది మౌలిక సదుపాయాలను ఆధునీకరించడం మరియు ప్రాంతీయ అసమానతలను పరిష్కరించడం ద్వారా పాడి పరిశ్రమను మరింత మెరుగుపరచడం మరియు విస్తరించడం లక్ష్యంగా పెట్టుకుంది.

ఆపరేషన్ ఫ్లడ్: ది విజన్ ఆఫ్ డాక్టర్. వర్గీస్ కురియన్ మరియు ఇండియాస్ డైరీ ట్రాన్స్‌ఫర్మేషన్: శ్వేత విప్లవం(%ఔష్ట్రత్‌వ =వజశీశ్రీబ్‌అశీఅ% 2.0) ను "ఆపరేషన్ ఫ్లడ్" అని కూడా పిలుస్తారు, ఇది ప్రపంచవ్యాప్తంగా అత్యంత విజయవంతమైన పాడి పరిశ్రమ అభివృద్ధి కార్యక్రమాలలో ఒకటిగా పరిగణించబడుతుంది. నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (%చీణణదీ%) ద్వారా 1970లో ప్రారంభించబడింది మరియు డాక్టర్ వర్గీస్ కూరియన్ నేతృత్వంలో, దేశవ్యాప్తంగా పాల నెట్‌వర్క్‌ను స్థాపించడంలో సహాయపడింది. ఇది పాల ఉత్పత్తిదారులను నేరుగా పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లో వినియోగదారులతో అనుసంధానించే బలమైన సరఫరా వ్యవస్థను స్థాపించింది. ఈ విధానం మధ్యవర్తులను తొలగించి, సహకార సంస్థల ద్వారా చిన్న-స్థాయి పాడి రైతులకు శక్తివంతమైన అవకాశాలను అందించింది. ఆపరేషన్ ఫ్లడ్ అమలు వల్ల పాల ఉత్పత్తి గణనీయంగా పెరగడమే కాకుండా గ్రామీణ ఆదాయాలు, పోషకాహార భద్రత మరియు పాడిపరిశ్రమ రంగంలో మహిళల సాధికారతలో గణనీయమైన మెరుగుదలలకు దారితీసింది. 1990ల చివరి నాటికి, భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామి పాల ఉత్పత్తిదారుగా నిలిచింది. ఈ ప్రత్యేకత ఇప్పటికీ ఉంది.

శ్వేత విప్లవం 2.0: విషన్ మరియు లక్ష్యాలు: 2024లో ప్రారంభమయ్యే శ్వేత విప్లవం 2.0 (%ఔష్ట్రత్‌వ =వజశీశ్రీబ్‌అశీఅ% 2.0)అనేది ఐదేళ్ల కాల వ్యవధిలో భారతదేశ పాడి పరిశ్రమను మార్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం. ఈ కార్యక్రమం పాల సేకరణ ప్రక్రియలను పెంపొందించడానికి, పాడి పరిశ్రమ సహకార సంఘాలకు మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడానికి మరియు దేశవ్యాప్తంగా ఈ సహకార సంఘాల పరిధిని విస్తరించడానికి ప్రయత్నిస్తుంది. భారతదేశంలో పాల ఉత్పత్తిని పెంచడం, పాల నాణ్యతను పెంచడం మరియు పాడి పరిశ్రమ అభివృద్ధిలో ప్రాంతీయ అసమానతలను పరిష్కరించడం ప్రాథమిక లక్ష్యం.

ప్రాథమిక లక్ష్యాలు వీటిని కలిగి ఉంటాయి:

1. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఒడిశా మరియు ఆంధ్రప్రదేశ్‌తో సహా వివిధ రాష్ట్రాల్లో 56,000 కొత్త బహుళార్ధసాధక పాల సహకార సంఘాల (%ణజూ%) ఏర్పాటు.
2. అధునాతన పాల సేకరణ మరియు పరీక్షా సౌకర్యాలను ప్రవేశపెట్టడం ద్వారా ప్రస్తుతం ఉన్న 46,000 డెయిరీ సహకార సంఘాలను మెరుగుపరచడం
3. పాడి పరిశ్రమ సహకార విస్తరణ:

సహకార వ్యూహాలను అవలంబించడంలో సాపేక్షంగా వెనుకబడి ఉన్న పశ్చిమ బెంగాల్ మరియు ఈశాన్య ప్రాంతాలను, ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ మరియు ఈశాన్య ప్రాంతాలను కలుపుకుని, పాడి సహకార సంఘాల భౌగోళిక ఉనికిని విస్తరించడం

4. పాడి పరిశ్రమలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, సహకార సంస్థల్లో వారికి నాయకత్వ అవకాశాలను కల్పించడం.

డైరీ రంగానికి నిధులు: ప్రభుత్వ కార్యక్రమాలు మరియు సహాయ వ్యవస్థలు: "నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ డెయిరీ డెవలప్‌మెంట్ (%చీూణణ%) 2.0" ద్వారా ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సహాయం అందించబడుతుంది. ఈ నిధులు గ్రామాలలో పాలు కొనుగోలు వ్యవస్థలు, శీతలీకరణ సౌకర్యాలు మరియు శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయడానికి ఉపయోగించబడతాయి. హర్యానా, మధ్యప్రదేశ్, మరియు కర్ణాటకలలో పైలట్ ప్రాజెక్ట్ ఆశాజనకమైన వృద్ధిని కనబరిచింది, ఇది 79 కొత్త డెయిరీ కోఆపరేటివ్ సొసైటీల (%ణజూం%) ఏర్పాటుకు దారితీసింది, ఇది ఇప్పుడు ప్రతిరోజూ దాదాపు 2,500 మంది రైతుల నుంచి 15,000 లీటర్ల పాలను సేకరిస్తుంది. అంతేకాకుండా, పాల సేకరణ మరియు పంపిణీ వ్యవస్థల్లో అభివృద్ధిని సులభతరం చేసేందుకు, డెయిరీ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి "మల్టీపర్పస్ ప్రైమరీ అగ్రికల్చరల్ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీస్‌కి ఆర్థిక వనరులు అందించబడతాయి.

సవాళ్లు మరియు అవకాశాలు: శ్వేత విప్లవం 2.0(%ఔష్ట్రత్‌వ =వజశీశ్రీబ్‌అశీఅ% 2.0) భారతదేశ పాడి పరిశ్రమను ఆధునీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, అనేక సవాళ్లు ఉన్నాయి:

1. భారతదేశం అతిపెద్ద పాలను ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, ఇతర దేశాలతో పోలిస్తే దిగుబడి తక్కువగా ఉంటుంది. అన్యదేశ జాతులు రోజుకు సగటున 8.55 లీటర్ల పాలు ఉత్పత్తి చేస్తుండగా, దేశీయ జాతులు 3.44 లీటర్ల పాలు మాత్రమే ఉత్పత్తి చేస్తాయి. ఇది జాతి నాణ్యతను మెరుగుపరచడానికి మరియు పశువుల పోషణను మెరుగుపరిచే సామర్థ్యాన్ని సూచిస్తుంది.
2. గుజరాత్ మరియు పంజాబ్ వంటి రాష్ట్రాలు డెయిరీ కోఆపరేటివ్‌లను అభివృద్ధి చేస్తున్నప్పటికీ, తూర్పు మరియు ఈశాన్య ప్రాంతాలు అభివృద్ధి చెందలేదు. శ్వేత విప్లవం 2.0 ఈ వెనుకబడిన ప్రాంతాలలో సహకార నెట్‌వర్క్‌లను విస్తరించడం ద్వారా దీనిని పరిష్కరించాలని భావిస్తోంది.
3. భారతదేశ పాల ఉత్పత్తి మరియు విక్రయాలలో అసంఘటిత రంగం ప్రధాన పాత్ర పోషిస్తుంది, ఇది సహకార సంఘాల అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుంది. సహకార సంఘాలను బలోపేతం చేయడం ద్వారా, ఈ రంగాన్ని మరింత అధికారికీకరించవచ్చు, దీని ఫలితంగా రైతులకు మెరుగైన నాణ్యత నియంత్రణ మరియు నమ్మకమైన ధర లభిస్తుంది.
4. పాలను పరీక్షించడం, నిల్వ చేయడం మరియు రవాణా చేయడం, దాని నాణ్యత మరియు భద్రతను మెరుగుపరచడం కోసం కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడాన్ని అభివృద్ధి సూచిస్తుంది. సరఫరా వ్యవస్థ నిర్వహణకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (%ూ×%) మరియు డేటా విశ్లేషణను జోడించడం వల్ల కార్యకలాపాలు మరింత మెరుగ్గా ఉంటాయి.

ఆర్థిక ప్రభావం: భారతదేశంలోని పాడి పరిశ్రమ దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైనది, వ్యవసాయం మరియు సంబంధిత రంగాల ద్వారా ఉత్పత్తి చేయబడిన విలువలో దాదాపు 40% వాటా ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో, దేశం 230.58 మిలియన్ టన్నుల పాలను ఉత్పత్తి చేసింది, గృహ వినియోగం మరియు ఆర్థిక స్థిరత్వం కోసం పాల ఉత్పత్తి యొక్క ప్రాముఖ్యతను సూచిస్తుంది. శ్వేత విప్లవం 2.0(%ఔష్ట్రత్‌వ =వజశీశ్రీబ్‌అశీఅ% 2.0) సహకార సంఘాలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుంది, ఇది గ్రామీణ ఆదాయాలను పెంచడం మరియు లక్షలాది ఉద్యోగాలను సృష్టించడం. పశుగ్రాసం, పశువైద్య సంరక్షణ మరియు పాల ప్రాసెసింగ్ వంటి సంబంధిత రంగాలను ప్రభావితం చేయడం ద్వారా పాడి పరిశ్రమ ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం చేకూరుస్తుంది.

సామాజిక ప్రభావం: మహిళా సాధికారత: శ్వేత విప్లవం 2.0(2.0) యొక్క ప్రధాన లక్ష్యం పాడి పరిశ్రమలో మహిళల ప్రమేయాన్ని పెంచడం. ఈ కార్యక్రమం శిక్షణ, సహకార సంస్థలలో నాయకత్వ స్థానాలు మరియు ఆర్థిక స్వాతంత్ర్యానికి అవకాశాలను అందిస్తుంది. భారతదేశంలో, పాడి పరిశ్రమ సాధారణంగా కుటుంబ వ్యాపారంగా ఉంది, మహిళలు జంతువుల సంరక్షణ మరియు పాలు ఉత్పత్తి చేయడంలో ఎక్కువగా పాల్గొంటారు. సహకార సంస్థల ద్వారా ఈ పనిని నిర్వహించడం ద్వారా, ఇది న్యాయమైన వేతనానికి హామీ ఇవ్వడంలో సహాయపడుతుంది మరియు వారి కృషిని గుర్తిస్తుంది.

ముగింపు: శ్వేత విప్లవం 2.0) భవిష్యత్ సవాళ్లను పరిష్కరించడానికి భారతదేశం యొక్క పాడి పరిశ్రమ యొక్క పరివర్తనలో కీలకమైన పురోగతిని సూచిస్తుంది. ఈ ప్రోగ్రాం మౌలిక సదుపాయాలను ఆధునీకరించడం, సహకార నెట్‌వర్క్‌లను విస్తృతం చేయడం మరియు అట్టడుగు వర్గాలకు మరియు మహిళలకు సమానమైన అవకాశాలను అందించడంపై దృష్టి పెడుతుంది. సుస్థిరమైన, న్యాయమైన మరియు అభివృద్ధి చెందుతున్న డెయిరీ రంగాన్ని స్థాపించడం దీని లక్ష్యం. ఇది సమర్ధవంతంగా అమలు చేయబడితే, ప్రపంచ పాల ఉత్పత్తిలో అగ్రగామిగా భారతదేశం యొక్క హోదాను కాపాడుకోవడమే కాకుండా అసంఖ్యాక గ్రామీణ రైతుల జీవనోపాధిని మెరుగుపరిచే అవకాశం ఉంది.

మొహమ్మద్ అక్బర్
మహబూబాబాద్

# ఆందోళన కలిగిస్తున్న హృద్రోగ మరణాలు:





సెప్టెంబర్ 29 ప్రపంచ హృదయ దినోత్సవం హృదయ సంబంధ వ్యాధుల గురించి ప్రజలలో అవగాహన పెంచడానికి, వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి సమాయత్తం చేయడానికి ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబరు 29 న "ప్రపంచ హృదయ దినోత్సవం" జరుపుకుంటారు. ఈ దినోత్సవమును ప్రపంచ ఆరోగ్య సంస్థ, వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ లు సంయుక్తంగా నిర్వహిస్తాయి. గుండెపోటు, గుండె జబ్బులను నివారించడంకోసం 1946లో జెనీవా దేశంలో వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ సంస్థ ఏర్పాటయింది. 1999లో అప్పటి వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ తొలిసారిగా ఈ దినోత్సవాన్ని జరిపాడు. అలా 2000 నుండి ప్రపంచవ్యాప్తంగా ప్రారంభించబడింది. 2010 వరకు సెప్టెంబరు నెలలోని ఆఖరి ఆదివారం నిర్వహించబడిన ఈ దినోత్సవం 2011వ సంవత్సరం నుంచి సెప్టెంబరు 29వ తేదీన నిర్వహించబడుతోంది. 2024లో ప్రపంచ హృదయ దినోత్సవం యొక్క థీమ్ "వారి గుండె ఆరోగ్యాన్ని చూసుకోవడానికి వ్యక్తులను ప్రేరేపించడం." గుండె ఆరోగ్యానికి బాధ్యత వహించేలా వ్యక్తులను ప్రోత్సహించడం, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే చర్యలను సూచించడం, జాతీయ స్థాయిలో హృదయ ఆరోగ్య కార్యాచరణ ప్రణాళికను అమలుచేయడం, సానుకూల ప్రభావం చూపడానికి ప్రజలను, రోగులను, వైద్యులను నిమగ్నం చేయడం అనేవి ఈ యేడాది ప్రపంచ హృదయ దినోత్సవం లక్ష్యాలుగా పెట్టుకోవడం జరిగింది.

**మన దేశంలో పరిస్థితులు:**

మన దేశంలో గత మూడు సంవత్సరాలుగా గుండెపోటు మరణాలు పెరిగాయి. 2022లో గుండెపోటు కారణంగా 32,457 మంది మరణించారని, అంతకుముందు సంవత్సరంలో నమోదైన 28,413 మరణాల కంటే గణనీయమైన పెరుగుదల ఉందని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్ సి ఆర్ బి) తెలిపింది. 2022లోనే గుండెపోటు కేసులలో 12.5% ఎరుగుదల ఉందని తెలిపింది. ప్రపంచవ్యాప్తం గణాంకాలలో భారతదేశం రెండవ స్థానంలో ఉంది. మనదేశంలో ఏటా 20% పురుషులు 17% మంది స్త్రీలు మరణిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలో మనదేశంలో స్త్రీల కంటే పురుషులలో హృదయ సంబంధిత మరణాల రేటు ఎక్కువగా ఉందని తెలిపింది. ఒక లక్ష మందిలో పురుషులలో 349 మంది స్త్రీలలో 265గా మరణాలు ఉన్నాయి. ఈ రేట్లు యునైటెడ్ స్టేట్స్ కంటే రెండు నుండి మూడు రెట్లు ఎక్కువగా ఉన్నాయి. గుండె సమస్యలతో యువకులు అకాల మరణాలకు గురవుతున్నారు. ఇది ఆందోళన కలిగించే విషయం యువకులలో గుండెపోటు విషయానికి వస్తే అతిపెద్ద సవాళ్ళలో ఒకటి. చాలా మందికి తమకు ప్రమాదం ఉందని తెలియదు.

కారణాలు:

ఫాస్ట్ ఫుడ్, అధిక ప్రాసెస్ చేసిన వస్తువులు, చక్కెర పానీయాలతో నిండిన ఆధునిక ఆహారాలు యువకులలో అధిక ఊబకాయం, అధిక రక్తపోటు, అనారోగ్య లిపిడ్ ప్రొఫైల్‌లకు దోహదపడుతున్నాయి.

యువకులు తమ రోజులో గణనీయమైన భాగాన్ని పనిలో లేదా విశ్రాంతి కోసం కూర్చొని గడుపు తున్నారు. ఇది బరువు పెరగడానికి, హృదయనాళ ఫిట్‌నెస్‌లో క్షీణతకు, గుండె సమస్యలకు ఎక్కువ ప్రమాదానికి దారితీస్తుంది. పొగాకు వినియోగం, మాదకద్రవ్యాలు మద్యం వాడకం మరో పెద్ద కారణం. దీర్ఘకాలిక ఒత్తిడి అనేక విధాలుగా గుండె ఆరోగ్యాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. డిప్రెషన్ లేని వారితో పోలిస్తే డిప్రెషన్‌ను నివేదించిన యువకులకు గుండె జబ్బులు వచ్చే అవకాశాలు రెండింతలు ఎక్కువగా ఉన్నాయని కొత్త అధ్యయనాలు కనుగొన్నాయి.

పరిష్కారాలు:

తృణధాన్యాలు, లీన్ ప్రోటీన్లు, పండ్లు,కూరగాయలతో కూడిన సమతుల్య ఆహారం గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. కొవ్వు పదార్థాలు, చక్కెర పానీయాలు వంటి ప్యాక్ చేయబడిన, ప్రాసెస్ చేయబడిన ఆహారాల వినియోగాన్ని తగ్గించడం చాలా ముఖ్యం. తక్కువ చక్కెర, కొలెస్ట్రాల్ స్థాయిలు, ట్రాన్స్ ఫ్యాట్స్, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు అధికంగా ఉన్న ఆహారం గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. స్థిరమైన వ్యాయామ దినచర్యను నిర్వహించడం గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను, రక్తపోటును తగ్గిస్తుంది. ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి సహాయపడుతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ పెద్దలందరికీ ప్రతి వారం 150 నిమిషాల మితమైన వ్యాయామం చేయాలని సిఫార్సు చేసింది. అనారోగ్య కొలెస్ట్రాల్ స్థాయిలతో గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది. ధూమపానం గుండె జబ్బులకు అత్యంత సాధారణ ప్రమాద కారకాల్లో ఒకటి. దీనిని మానేయడం హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అదే సమయంలో మొత్తం గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఆల్కహాల్ అధిక వినియోగం హృదయ సంబంధిత వ్యాధులకు దోహదం చేస్తుంది. రక్తపోటుకు కూడా దారితీస్తుంది.

జనక మోహన రావు దుంగ
ఫోన్: 8247045230

# విశ్వశక్తి వైభవం

భక్తి



శాశ్వతమైన ఉనికి 'సత్'. ఆ ఉనికి స్వభావమైన చైతన్యమే 'చిత్'. ఈ రెండూ ఒకే వస్తువు లక్షణాలు. ఇదే వస్తువును 'పరబ్రహ్మ' అంటుంది వేదం. ఈ బ్రహ్మం ఆనంద స్వరూపంగా ఉంటుంది. అందుకే పరబ్రహ్మను రుషులు 'సచ్చిదానందం'గా భావిస్తారు.

ఈ అనంత విశ్వానికి సచ్చిదానంద తత్వమే కారణం. ఇది విశ్వవ్యాపకమైనది. శక్తి అంటే ఇదే! ఈ సచ్చిదానంద శక్తిని మహర్షులు 'జగదంబ'గా సాక్షాత్కరింపజేసుకున్నారు. విశ్వవ్యాపకమైన, విశ్వాతీతమైన మహాశక్తి ఇది. వేదాల్లో, ఆగమాల్లో (మంత్ర శాస్త్రాలు), పురాణాల్లో ఇది బహురూపాలుగా ప్రతిపాదితమైంది.విశ్వంలో నిండిన శబ్దమయ నాదశక్తి– బ్రాహ్మీ. జగత్ వ్యాపక మహాతరంగాల చైతన్యం– వైష్ణవి. కర్మానుగుణంగా జీవులను నిర్వహించే శాసక శక్తి– మాహేశ్వరి. జ్ఞానస్వరూపం– కౌమారి. అలాగే అన్నశక్తి– వారాహి. బలప్రదాయకమై శిష్టరక్షణ దుష్టశిక్షణ నిర్వర్తించే మహాశక్తి– ఇంద్రాణి. సంసార లంపటత్వాన్ని నిర్మూలించే తత్వరూప మోక్షశక్తిని 'చాముండా'గా ఆరాధిస్తారు. ఇవన్నీ సప్త మాతృకా స్వరూపాలు, విశ్వవ్యాపక మహాచైతన్యానికి సంబంధించిన విభిన్న రూపాలు. వీటన్నింటినీ సనాతన ధర్మం 'ఉపాసనా మూర్తులు'గా ఆవిష్కరించింది. అనంతాకాశంలో సహజమైన నీలిమ, అంధకారం కాళీదేవిగా గోచరిస్తాయి. అంతరిక్షంలోని జ్యోతిఃస్వరూపాల కాంతితత్వమే గౌరీ దేవి (ప్రకాశ స్వరూపిణి). గగనాల్లో భువనాల్లో నిండిన సౌందర్య శోభాశక్తి 'లక్ష్మి'గా వెలుగులీనుతుంది. బుద్ధుల్లో భాసించే విద్యారూపిణి 'సరస్వతి'గా ప్రత్యక్షమవుతుంది. ఆకాశ శక్తిని 'భువనేశ్వరి'గా భావిస్తారు. కాలశక్తిని 'కాళి'గా, మూడు కాలాల ముల్లోకాల వ్యాపక శాసక శక్తిని 'త్రిపుర'గా– మరికొన్ని ఆగమాలు వర్ణించాయి.నిగమ (వేద), ఆగమాల వర్ణనల్ని, దృక్కోణాల్ని సమన్వయపరచింది పురాణం. అది దేవీరూప, మంత్ర, ఆరాధన, లీలా కథల్ని అద్భుతంగా ఆవిష్కరించింది. బహురూపాలుగా ఉన్న ఆ ఏక శక్తిని ఆదిశక్తిగా ఉపాసించే విధానాలున్నాయి. వాటిలో శరన్నవరాత్రులకు అత్యంత ప్రాధాన్యముంది. ఆదిశక్తి పలు రూపాలు. కాలాల పరిణామాల్ని అనుసరించి, సనాతన ధర్మంలో అనేక పండుగలు కనిపిస్తాయి. వీటిలో– ఆయా కాలాల్లో జరిగే ప్రకృతి పరిణామాలు, జ్యోతిర్మండలాల ప్రభావాల మార్పులు ప్రతిఫలిస్తాయి. క్షేమకారక రక్షణ శక్తిగా విశ్వమాతను ఆరాధించే సందర్భమే– ఆశ్వీయుజ నవరాత్రుల మహా పర్వం. పూర్ణత్వానికి సంకేతంగా 'నవ'సంఖ్యతో దేవీపూజల్ని ఆచరించే తొమ్మిదిరోజుల పండుగ ఇది.

ఈ పండుగకు జ్యోతిర్విజ్ఞాన, ఉపాసన, ఆధ్యాత్మిక ప్రాధాన్యాలు ఉన్నాయి. వీటికి విభిన్న జీవన రీతుల సంస్కృతీ సంప్రదాయాల శోభలూ జత కలిసి, దేశవ్యాప్త మహాపర్వ ప్రాముఖ్యం సంతరించు కుంది. అంతరంగ, బహిరంగ ప్రతికూల శక్తుల్ని జయించే ఆనందకర దివ్య శక్తుల విజయోత్సాహం ఇది. ఇదే దసరా మహోత్సవాల ప్రధాన లక్షణం, లక్ష్యం. సర్వ దేవతల సమాహార మూర్తిగా, సకల శక్తుల సమన్వయ దీప్తిగా మహాశక్తిని పూజిస్తారు. స్త్రీరూపంగా సంభావించి సమర్చన చేయడం ఒక గణనీయ విశిష్టాంశం.ప్రతి స్త్రీమూర్తినీ పరాశక్తి కళగా గౌరవించాలనే భావం బాల, కుమారి, సువాసినీ పూజల్లో కనిపిస్తుంది. కలశంలో, యంత్రంలో, విగ్రహాల్లో, హోమగుండాల్లో 'లోకాల తల్లి'ని ఆవహింపజేసి ఆరాధిస్తారు.

స్త్రీమూర్తిలో దేవిని దర్శించి పూజిస్తే గాని పూర్ణం కాని పండుగ ఇది!

వికసించిన పూల దొంతరల కూర్పులో, అతి ప్రధానంగా విశ్వంలో వికసించే ప్రాణశక్తిని 'బతుకమ్మ'గా సంభావిస్తారు. ఆడి పాడి ఆరాధించే అద్భుతం ఇది! ప్రకృతి శక్తి ప్రసాదించిన విభిన్న శక్తులన్నీ విశ్వహిత కాంక్షతో ఏకమవుతాయి. అలా ఉద్యమించి సామరస్య శాంతిని సాధించాలనే ఆంతర్యం ఇందులో స్పష్టంగా కనిపిస్తుంది. అందుకే ఈ గొప్ప పండుగకు లెక్కకందని మొక్కులు!



## తెల్లసొనతో మెరుపులు...

గుడ్డులోని తెల్లసొనలో మేనిఛాయను పెంచే పోషకపదార్థాలు చాలా ఉంటాయి. అవి శిరోజాల టెక్చర్‌ని మెరిసేలా చేస్తాయి. జుట్టును ఆరోగ్యంగా, ద ృఢంగా ఉంచుతాయి. చర్మంలో దెబ్బతిన్న టిష్యూలను బాగు చేసి చర్మం బిగువుగా ఉండేలా తోడ్పడతాయి. శిరోజాల పెరుగుదలకు సైతం సహకరిస్తాయి. తెల్లసొన చిట్కాలు కొన్ని...

. కీర పేస్టులో తెల్లసొన వేసి మెత్తగా చేసి ఆ పేస్టును ముఖానికి రాసుకొని 20 నిమిషాలు అలాగే ఉంచుకోవాలి. ఆ తర్వాత గోరువెచ్చటి నీళ్లతో ముఖాన్ని కడుక్కోవాలి. అలా వారానికి రెండుసార్లు చేయాలి. దీనివల్ల చర్మంలో కొల్లాజన్ పెరుగుతుంది. చర్మంలో రక్తప్రసరణ బాగా జరుగుతుంది. చర్మం మెరుస్తుంది.

చర్మకాంతిని తెల్లసొన పెంచుతుంది. తెల్లసొనలో ఒక టేబుల్‌స్పూను నిమ్మరసం, రెండు టేబుల్‌స్పూన్ల ఆలివ్ ఆయిల్ వేసి బాగా కలిపి ఆ పేస్టును ముఖానికి రాసుకుని పదిహేను నిమిషాలు అలాగే ఉంచుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మం మ ృదువుగా తయారవడమే కాకుండా మేనిఛాయ కూడా పెరుగుతుంది.వయసు కనిపించకుండా ఉండడానికి ఒక ఎగ్ తెల్లసొనలో చక్కెర, పెరుగు ఒక్కొక్క టేబుల్‌స్పూను వేసి పేస్టులా చేసి ముఖానికి రాసుకొని పదిహేను నిమిషాలు అలాగే ఉంచుకోవాలి. ఆతర్వాత ముఖాన్ని చల్లటి నీళ్లతో కడగాలి. దీనివల్ల చర్మం బిగువుగా అవడమే కాదు టోనింగ్ కూడా బాగా ఉంటుంది. చర్మంపై మచ్చలు పోతాయి. ఈ మాస్కు చర్మాన్ని బాగా శుభ్రం చేస్తుంది. దీనివల్ల వయసు కనపడదు. ఇలా వారానికి రెండుసార్లు మాస్కు వేసుకుంటే మంచి ఫలితాలు కనిపిస్తాయి.

# ఏం తిన్నారో కాదు.. ఏం చదివారో చెబుతాం



బడిలో ఇచ్చే 'ప్రోగ్రెస్ కార్డుల' గురించి తెలుసు మనకు.
*చదువులో, నడతలో వారి ప్రగతిని చెబుతాయివి.. కదా!*
*మరి ఆరోగ్యపరంగా వాళ్లు ఎలాంటి ప్రగతి సాధిస్తున్నారు?*
*పిల్లల దేహదారుఢ్యం సంగతేమిటీ?*
వాళ్లకి రోజువారి పోషకాలు అందుతున్నాయా? అందినా వాళ్ల శరీరం వాటిని తీసుకోగలుగుతోందా?
వీటన్నింటిని వివరించే 'ఆరోగ్య ప్రగతి కార్డు' అందిసుం?తది ఈ డాక్టరమ్మ!
ఇందుకోసం పరీక్షలు చేసి, సమస్యలని సవరించి, పిల్లలందరినీ ఆరోగ్య హీరోలుగా మారుస్తోంది.
ఇదేదో కార్పొరేట్ బడులకే పరిమితం కాదండోయ్. ప్రభుత్వ బడులకీ ఈ సేవలనందిస్తోంది డాక్టర్ కంభం మేఘన!
ఈ ఆలోచన తనకెలా వచ్చిందో వివరిస్తోందిలా..

'మా పాప అస్సలు తినదు', 'సెలవులొస్తే చాలు.. మా బాబు టీవీ రిమోట్ వదలడు..', 'మా పింకీ ఎవరితోనూ కలవదు..' ఈ రోజుల్లో పిల్లల విషయంలో ఇలాంటి ఫిర్యాదులు చాలానే ఉంటాయి. ఇవన్నీ భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలుగా తలెత్తే ప్రమాదమూ లేకపోలేదంటున్నాయి పలు అధ్యయనాలు. పిల్లల్లోని అలాంటి అలవాట్లను మార్చడమే మా 'కేర్ అండ్ గ్రో' సంస్థ లక్ష్యం. దాన్నెందుకు మొదలుపెట్టామంటే.. మాది నెల్లూరు. కానీ పెరిగిందంతా వైజాగ్‌లో. నాకు రెండేళ్లున్నప్పుడే నాన్న చనిపోయారు. అమ్మ మానసిక నిపుణురాలు. అప్పటి నుంచీ అన్నీ తానై నన్ను పెంచింది. మనం.. మన ప్రపంచం మాత్రమే అనుకుని గిరిగీసుకుంటే మన చుట్టూ ఎవరూ ఉండరని అమ్మ నాకు చెప్పడమే కాదు.. ఆచరణలోనూ పెట్టేది. మా అమ్మ ఓ పాఠశాల నడుపుతుంది. అందులో పరిపాలనా విభాగంలో అంతా వితంతువులూ, ఏ అండాలేని మహిళలకే ఉద్యోగం ఇచ్చింది. అవన్నీ చూశాక నేనూ సేవ గురించి ఆలోచించేదాన్ని. ఆ అవకాశం వైద్య వృత్తిలో ఎక్కువగా ఉంటుందని దాన్నే ఎంచుకున్నా. డబ్బులడిగేవారు.. మెడిసిన్‌కోసం ఆంధ్ర మెడికల్ కాలేజీలో చేరా. హౌస్ సర్జన్‌గా వైజాగ్‌లోని కేజీహెచ్‌లో పని చేస్తున్నప్పుడు రోగులు చిన్న సమస్య కోసం దూర ప్రాంతాలనుంచి రావడం, తిరిగివెళ్లేందుకూ చేతిలో డబ్బులు లేక ఇబ్బందులు పడటం గమనించేదాన్ని. ఓసారి రక్తపోటు సమస్యను చూపించుకోవడానికి ఒకావిడ వచ్చింది. తిరిగి వెళ్లడానికి కనీసం బస్సు ఛార్జీలు కూడా లేక మా అందరి దగ్గరా తలా కొంత అడిగింది. ఇలాంటివాటికి పరిష్కారం ఏంటా అని ఆలోచించా. అనారోగ్యాల్ని అదుపు చేయాలంటే తగిన శారీరక దార&ఢ్యం, మానసిక ప్రశాంతత, పోషకాహారం అవసరం. ఆ పునాది చిన్నతనం నుంచే పడాలి. అందుకే స్కూలు స్థాయి నుంచే మార్పు తేవాలనుకున్నా. ప్రతిఏటా వాళ్ల ఆరోగ్య పురోగతినీ నమోదు చేసే పురోగతి రికార్డులను అందించే ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నా. అది సాధ్యం కావాలంటే ఎప్పటికప్పుడు వారి శారీరక, మానసిక, ప్రవర్తనాపరమైన పరిస్థితులను పరీక్షల ద్వారా గుర్తించి వారికి తెలియజేయాలనుకున్నా. అంటే.. పోషకాహారం మొదలు జీవనశైలీ, ప్రవర్తనలో మార్పులు చేసుకోవడం, శారీరకదార&ఢ్యం పెంచుకోవడం వంటివన్నీ కూడా వివరించాలనుకున్నా.శిక్షణ తీసుకున్నా.. వైద్యం పూర్తయ్యాక చాలామందిలా ప్రాక్టీస్ మొదలుపెట్టలేదు. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ బిజినెస్ స్కూలు నుంచి ఏడాదిపాటు సోషల్ ఎంటర్‌ప్రైజెస్ కోర్సు పూర్తిచేశా. దాంతోపాటూ ఇన్‌సీడ్ అనే విద్యాసంస్థలో ఇలాంటి శిక్షణ ఉందని తెలిసి దరఖాస్తు చేసుకున్నా. నాలాంటి మూడులక్షలమంది నుంచి ప్రతిపాదనలు వస్తే.. అందులోంచి వందమందిని ఎంపికచేశారు. వారిలో నేనూ ఉన్నా. అక్కడున్నప్పుడే నా ఆలోచనను ఓ ప్రదర్శనలో వివరిస్తే.. మరో ఇద్దరు ఆసక్తి చూపించి తామూ భాగస్వాములం అవుతామని ముందుకొచ్చారు. అలా రెండేళ్ల క్రితం 'కేర్ అండ్ గ్రో'ని ప్రారంభించాం. అయితే అంతకన్నా ఏడాది ముందు దీన్ని ప్రయోగాత్మకంగా బెంగళూరు, ఒడిశా, పశ్చిమబంగ వంటి
చోట్ల రెండువేల మంది చిన్నారుల్లో ఉండే పోషకాహారలేమి, రక్తహీనత సమస్యల్ని గుర్తించి, ఎలా పరిష్కరించుకోవాలో చెప్పి విజయం సాధించా.



**పాఠశాలలతో ఒప్పందం..** నిజానికి ఇలాంటివి యూరప్, యూకే వంటి చోట సుపరిచితమే. మనదగ్గర మాత్రం అరుదనే చెప్పొచ్చు. వందల సంఖ్యల్లో తెలుగు రాష్ట్రాల్లోని పలు కార్పొరేట్, ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు మా ప్రతిపాదన చెప్పాం.కలిసి పనిచేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాం. పాఠశాలల్ని బట్టి హయ్యర్ గ్రేడ్, మిడిల్, ప్రైమరీ అని విభజించుకున్నా. మొదటిదానికి ప్రత్యేక ప్యాకేజీలూ, ఏడాదికి నిర్ణీత రుసుమూ తీసుకుంటే, రెండోదానికి ఏడాదికి ఆరు నుంచి ఎనిమిది వందల రూపాయలూ, మూడొ దానికి పూర్తిగా ఉచితంగా మా సేవలు అందించడానికి సిద్ధమయ్యాం. మొదటి రెండు విభాగాల పాఠశాలల నుంచి తీసుకున్న డబ్బును ప్రైమరీ అంటే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కేటాయిస్తాం. ఏటా రెండుసార్లు మా పారామెడికల్ సిబ్బందీ మాతో ఒప్పందం కుదుర్చుకున్న పాఠశాలల్లోని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తారు. దీనికోసం ఓ ఫార్మాల్యాబ్‌తోనూ ఒప్పందం కుదుర్చుకున్నాం. ఆరోగ్య పరీక్షలతోపాటూ వాళ్లేమయినా ఒత్తిడికి గురవుతున్నారా.. వాళ్ల ప్రవర్తన ఎలా ఉందీ.. ఆహారపుటలవాట్లు.. ఇలా అన్నింటినీ గమనించి వాళ్ల వివరాలన్నింటినీ కంప్యూటరులో నమోదు చేస్తాం. ఇందుకోసం మేం ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్‌ని రూపొందించాం. తరవాత ఆ వివరాలన్నింటినీ కార్డులుగా రూపొందించి పిల్లలకు అందిస్తాం. వారి సమస్యల ఆధారంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలూ, ఆహారపరంగా చేసుకోవాల్సిన మార్పుల్ని వివరిస్తాం. వాళ్లు ఆచరణలో పెట్టేలా కూడా ప్రణాళికలు రూపొందిస్తాం.వ్యాయామం చేయిస్తాం.. పిల్లల ఆరోగ్య పరిస్థితి ఆధారంగా రాబోయే ఆరునెలల్లో వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో వివరిస్తాం. ఉదాహరణకు పిల్లల్లో పోషకాహార లోపం ఉందనుకోండి.. తదనుగుణంగా మార్పులు చెబుతాం. పిల్లలతో మీరే స్వయంగా పెసల మొలకలు చేసుకుని రండి.. సలాడ్‌ని చేయించుకుని తీసుకుని రండి అని సూచిస్తాం. వాళ్లు ఉత్సాహంగా చేసుకుని వచ్చాక.. కలిగే లాభాలేంటో వివరించే ప్రయత్నం చేస్తాం. ఈ విషయంలో వారి తల్లిదండ్రుల సహకారమూ తీసుకుంటాం. ఇవన్నీ పాఠశాల ద్వారానే జరుగుతాయి. ప్రతి పిరియడ్ విరామంలో పది నిమిషాల చొప్పున వ్యాయామం చేయిస్తాం. వ్యక్తిగత పరిశుభ్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలూ, నలుగురిలో ఎలా మాట్లాడాలీ, ఎలా ఉండాలనేదీ చెబుతాం. కొందరు పిల్లల్లో డిస్‌గ్రాఫియా అనే సమస్య ఉంటుంది. వాళ్లు ఎంత చురుగ్గా ఉన్నా. బాగా చదివినా సరిగ్గా రాయలేరు. దాన్ని గుర్తిస్తే చిన్న కౌన్సెలింగ్, పర్యవేక్షణతో మార్పు తెచ్చేందుకు ప్రయత్నిస్తాం. మేం చెప్పినట్లు విని.. చక్కగా గోళ్లు కత్తిరించుకుని, పరిశుభ్రమైన సీసాల్లో నీళ్లు తెచ్చుకుని, పోషకాహారం తీసుకునేవారిని హెల్దీ హీరోస్‌గా గుర్తించి చిన్నపాటి కానుకలు ఇస్తాం. ఇవన్నీ చేయడం వల్ల స్థూలకాయమే కాదు, పిల్లల్లో ఒత్తిడీ అదుపులో ఉంటుంది. చురుగ్గానూ ఉంటారు. మా సేవలు అందుకునే పాఠశాలల్లో వైజాగ్‌లోని చైతన్య గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, సంస్కృతి గ్లోబల్ స్కూల్, హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, మిలీనియం మోడల్ స్కూళ్లు, జెడ్‌పి హెచ్ స్కూల్ ఇర్విన్ వంటివి ఉన్నాయి. ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలలతో కలిపి మొత్తంగా ఎనిమిదివేలమంది విద్యార్థుల్లో మార్పు తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం. ఈ సంవత్సరం వీలైనంత ఎక్కువమందిలో ఆ చైతన్యం తెచ్చే ప్రయత్నంలో ఉన్నాం.

# బాదం భేష్!



పరీక్షల సమయంలో శక్తినిచ్చి, అలసటకు లోను చేయని ఆహారం తీసుకోవాలి. చటుక్కున తినగలిగే స్నాక్స్‌లో బాదం భేషైనది!

పరీక్షల సమయంలో పలువురు సెలబ్రిటీలు ఎంచుకున్న పవర్‌ఫుల్ స్నాక్ బాదం. తమ బాల్యంలో, పరీక్షల సమయంలో బాదం పప్పు తినేవాళ్లమని బాలీవుడ్ నటులు సోహా అలీ ఖాన్, మిలింద్ సోమన్‌లు చెప్పారు. వాళ్లు ఏమన్నారంటే....

సోహా అలీ ఖాన్: పరీక్షల సమయంలో పిల్లలు ఒత్తిడికి లోనవుతూ ఉంటారు. ఈ అనుభవం నేనూ ఎదుర్కొన్నాను. నా చిన్నతనంలో అమ్మ నా స్టడీ టేబుల్ మీద బాదం అందుబాటులో ఉంచేది. ఎక్కువ సమయం పాటు చదువుతూ, ఆకలి అనిపించినప్పుడు శక్తి కోసం బాదం బాగా ఉపయోగపడేవి.

మిలింద్ సోమన్: పరీక్షల సమయంలో పిల్లలు ఫిట్‌నెసను నిర్లక్ష్యం చేస్తారు. అయితే ఇందుకోసం స్టడీ టైమ్ నుంచి కొంత బ్రేక్ తీసుకోవాలి. ప్రత్యేకంగా వ్యాయామం కోసం సమయం కేటాయించలేకపోతే, నడుస్తూ చదవడం లేదా ఇంటిని చుట్టి రావడం చేయాలి. అలాగే బలవర్ధకమైన ఆహారంలో భాగంగా బాదం తప్పక తీసుకోవాలి. మెదడుకు పోషణ!

పరీక్షల సమయంలో భోజనానికీ, భోజనానికీ మధ్య ఆకలి వేయడం సహజం. ఇలాంటప్పుడు పిల్లలు చిరుతిళ్ల జోలికి వెళ్లకుండా బాదం తినడం మేలు. బాదం తింటే మెదడుకు పోషణ లభించి చురుగ్గా పని చేస్తుంది.

# సౌందర్యానికి చల్లటి తైలం

డ్రై, సెన్సిటివ్ చర్మాలకు ప్రత్యేక కేర్ అవసరం. ఈ చర్మాలకు కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్స్ తగినంత రక్షణ అందిస్తాయి. మృదుత్వాన్ని కాపాడుతూ తేమ కోల్పోకుండా సంరక్షించటంలో కోల్డ్ ప్రెస్డ్ అయిల్స్‌కు మించిన సౌందర్య సాధనం మరొకటి లేదు.

**కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్స్ అంటే?**

చల్లని వాతావరణంలో విత్తనాలు, నట్స్ నుంచి తీసే నూనెను కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్ అంటారు. ఈ నూనెల్లో ట్రాన్స్ ఫ్యాట్స్ ఉండవు. ఇతరత్రా విషపూరిత రసాయనాలు కూడా ఉండవు. రసాయనాలు ఉపయోగించకుండా నూనె తీసే పద్ధతి ఉపయోగించటం వల్ల ఈ నూనెల ధర కూడా ఎక్కువగానే ఉంటుంది.

**ఈ నూనెలు మేలైనవి**

క్లిష్టమైన పద్ధతులు ఉపయోగించటం వల్ల తయారయ్యే నూనె తక్కువ మొత్తంలో ఉన్నా ఎంతో నాణ్యత కలిగి ఉంటుంది. సహజసిద్ధమైన పోషకాలు, యాంటి ఆక్సిడెంట్లు, సువాసనలు ఈ నూనెల్లో పుష్కలంగా ఉంటాయి. ఈ పద్ధతిలో కాకుండా రసాయనాలు, వేడి ఉపయోగించి తీసే నూనెల్లో సహజ గుణాలు లోపిస్తాయి. ఈ నూనెలు తక్కువ కాలం నిల్వ ఉంటాయి. కాబట్టి ఎండ తగలని ప్రాంతంలో నిల్వ ఉంచి సాధ్యమైనంత త్వరగా ఉపయోగించాలి.

**కొబ్బరి నూనె..**చర్మానికి కొబ్బరినూనె తేమనందిస్తుంది. కోల్డ్ ప్రెస్డ్ ప్రాసె?సలో తయారైన కొబ్బరి నూనె చర్మానికి రెండింతల మేలు చేస్తుంది. యాంటి ఆక్సిడెంట్లు, పోషకాలు చర్మంలోకి ఇంకి ముడతలు మటుమాయం చేయటంతోపాటు చర్మాన్ని నునుపుగా మారుస్తాయి.

# బాదంతో చర్మకాంతి



బాదం పలుకులను గ్రైండ్ చేసి కొన్ని చుక్కల తేనె, అర టీ స్పూన్ గోరువెచ్చని పాలు కలిపి పేస్ట్ చేయాలి. ఈ పేస్ట్‌ని ముఖానికి పట్టించి ఆరిన తరవాత కడిగేయాలి. ఇలా వారంలో రెండు సార్లు చేస్తే చర్మం నిగారిస్తుంది. పాలలో గంటసేపు నానబెట్టిన బాదం పలుకులని పేస్ట్ చేయాలి.దీంట్లో కొన్ని చుక్కల నిమ్మరసం, చిటికెడు పసుపు కలపాలి. ఈ మిశ్రమాన్ని శుభ్రపరచిన ముఖానికి పట్టించాలి. 20 నిమిషాల తరవాత కడిగేస్తే నిగనిగలాడే చర్మం మీ సొంతమవుతుంది.

# మనోవైకల్యాలను తొలగించండి

టీనేజర్లలో దుడుకు స్వభావం పెరిగేందుకు అనేక రకాల అంశాలు దోహదం చేస్తుంటాయి. ఆ స్వభావం వల్ల అనేక రకాల మనోవైకల్యాలు వారిలో కలు గుతుంటాయి.. కొన్ని కొన్నిసార్లు వారు చేస్తున్న పనులపై వారికే కంట్రోల్ ఉండదు. వాటన్నింటినీ వారు ఒక్కరే ఎదుర్కోవడం అసాధ్యం. పైగా ఆ మనో వైకల్యాల వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ సంద ర్భంలో వారిలో ఏర్పడే మనో సంక్షిష్టతలకు గల కారణాలేంటో చూద్దాం !

టీనేజర్లలో ఉండే కొన్ని రకాల మనోవైకల్యాలను సమాజంలో చాలామంది వయసు ప్రభావానికి ప్రతీకలుగా పేర్కొంటారు. కానీ వాటివల్లనే నేరాల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. నేర ప్రవ ృత్తి, మనోవైకల్యం పెరగడం ఇలాంటి వన్నీ మనదేశంలో కన్నా పశ్చిమ దేశాల నగరాల్లోనే ఎక్కువగా ఉంటాయి. అక్కడ సమాజంలో ధనికవర్గం ఎక్కువగా ఉండడం ఒకెత్తయితే, పిల్లలకు మితిమీరిన స్వేఛ్ఛ ఇవ్వడం మరో ఎత్తు. అక్కడి సమాజంలో పిల్లలకు చిన్నప్పుడే స్వతంత్రంగా బతకడం నేర్పిస్తారు. ఇది ఒకందుకు మంచిదే అయినా మితిమీరిన స్వతంత్రం పిల్లల్లో నేర ప్రవ ృత్తి, దుడుకు స్వభావం పెంచుతుంది.

మన సమాజంలో మధ్యతరగతికి చెందిన వారే అత్యధికం కాబట్టి ఈ బాపతు అవకతవకలున్నా కూడా అవి అంతగా బయటకు రావు. పైగా అలాంటి గణాంక వివరాలు కూడా మనకంత తేలికగా దొరకవు.

ఇక ఎక్కడైనా టీనేజ్‌లో మిస్‌బిహేవియర్ ఉన్నప్పటికీ అల్లరి చిల్లరితనం ఎంతో కొంత ఉంటుందని మాత్రం చెప్పుకోవచ్చు. ఇది కేవలం పాశ్చాత్య దేశాల్లోనే కాదు మన దేశంలో కూడా ఉంది. అందుకు కారణాలు అనేకం. అందుకోసం బాల్యం నుంచి పిల్లలను చక్కటి ప్రేమ, సంరక్షణలో పెంచితే ఆ పిల్లలు టీనేజ్ వచ్చేనాటికి ఏ అవకతవకలూ లేకుండా మంచి మానసిక ఆరోగ్యంతో ఆనందదాయకమైన ఎదుగుదల కొనసాగిస్తారు.

**భంగపాటు**

టీనేజ్‌లో సక్రమమైన మానసికస్థితి లేకపోవడానికి చాలా కారణాలు కనిపిస్తాయి. ఫలానా కారణం వల్లనే వారిలా ఉంటున్నారని నిర?యించడం కష్టం. టీనేజ్‌లో శారీరక ఎదుగుదల అనేక మార్పులతో చకచకా జరిగిపోతుంది. ఆ సమయంలో వచ్చే రకరకాల శారీరక మార్పులవల్ల హార్మోన్ల ఉత్పత్తిలో బాలెన్స్ లోపిస్తుంది. అంటే కొన్నిసార్లు అధిక మొత్తంలో హార్మోన్లు ఉత్పత్తి అవడం, మరికొన్నిసార్లు తక్కువ మొత్తంలో ఉత్పత్తి అవడం ఇలా, హార్మోన్ల ఉత్పత్తిలో సమతూకం లోపించడం వల్ల వ్యక్తి స్వభావంలో, టెంపర్‌మెంట్‌లో నిలకడ శక్తి లేకుండాపోతుంది. దాంతో వారు ఒకసారి ఒకలా మాట్లాడితే మరునిమిషంలో మరోలా వేరే ఆలోచనతో మాట్లాడుతారు. అసలు ఈ టెంపర్‌మెంట్ ఎలా ఏర్పడుతుందంటే....

ఒక వ్యక్తి శారీరక యంత్రాంగం అతని మనస్సు మీదా ఉద్వేగాల మీదా చూపే ప్రభావం అతనిలోని స్వభావం లేక టెంపరమెంట్‌కి పునాదిగా ఉంటుంది. ఇది శారీరకంగానూ, మానసికంగానూ రెండు రకాలుగా ఉంటుంది. శరీర అవయవాలు ఉత్పత్తిచేసే హార్మోన్లలో సమతూకం లోపించినప్పుడు అతని టెంపరమెంట్‌లో కూడా సహజంగా అవకతవకలు ఏర్పడతాయి. ఇది కేవలం శారీరక సంబంధమైన కారణంగా చెప్పుకోవచ్చు. ఇక మానసిక సంబంధమైన కారణాలు గమనించినప్పుడు అనేకం కనిపిస్తాయి.

టీనేజ్‌లో ఆదర్శవాదం మితిమీరిన స్థాయిలో ఉండడం సహజం. వారిలా ఉండాలి లేదా అలా తయారవ్వాలి, ఇలాంటి పనులే చేయాలి... అనే తరహాలో ఏదో ఒక ఆదర్శంతో ఉండేందుకే ప్రయత్నిస్తుంటారు. అయితే వాస్తవ జీవితంలో తప్పులు తెలుస్తున్నప్పుడు, భంగపాటుకు గురవుతున్నప్పుడు ఈ ఆదర్శవాదం తాలూకు భ్రమలు కుదేలైపోతుంటాయి. ఫలితంగా కుర్రకారులో ఫ్రస్ట్రేషన్ ప్రభావం వల్ల మనస్తత్వంలో నిలకడ లోపిస్తుంది. ప్రవర్తనలో అవకతవకల ధోరణి ప్రవేశిస్తుంది.

**స్వీయ నియంత్రణ..**టీనేజ్లో సెక్స్ అనుభూతులు, దుడుకు స్వభావం ఒకదానితో ఒకటి పోటీ పడుతూ వేగంగా అభివ ృద్ధిచెందుతుంటాయి. ఈ రెంటి తాలూకు తీవ్రత తట్టుకోలేక కుర్రవాళ్ళు స్వీయ నియంత్రణ కోల్పోతారు. నిలకడ లేకుండా అడ్డదిడ్డంగా ప్రవర్తిస్తారు.

కుర్రవాళ్ళల్లో తమమీద తమకు నియంత్రణ లేకపోవటానికి పైన చెప్పుకున్న కారణాలే కాకుండా పెంపకానికి సంబంధించిన కారణాలు కూడా కొన్ని కనిపిస్తాయి. వాటిలో స్వీయ క్రమశిక్షణ అలవర్చుకోలేకపోవడం ఒకటి.



క్రమశిక్షణా లోపం

టీనేజర్లు క్రమశిక్షణ అలవర్చుకోలేక పోవటానికి కారణాలు అనేకం ఉంటాయి. వీటిల్లో ముఖ్యంగా రెండింటిని ప్రధానంగా చెప్పుకోవచ్చు. బాల్యంలో తల్లిదండ్రులు అతి గారాబం చేసి చెడగొట్టటం కావచ్చు లేక తల్లిదండ్రులకే నియంత్రణశక్తి లేకపోవడంవల్ల, ఆదర్శంగా ఉండాలని కన్నబిడ్డలకు చెప్పలేకపోటమూ కారణం కావచ్చు. చాలామంది తల్లిదండ్రులు 'బాల్యదశలో ఉన్నప్పుడే కట్టుదిట్టంలో పెంచినట్లయితే ఇప్పుడిలా తయారయ్యేవాడు కాదు' అని చెప్పుకోవడం వింటూవుంటాం. 'మొక్కై వంగనిది మానై వంగుతుందా' అనే సామెత ఇలాంటి సందర్భలోంచి పుట్టిందే. ఇవన్నీ క్రమశిక్షణకు సంబంధించినవే. క్రమశిక్షణలేకపోడం ఒకెత్తయితే ఒక్కోసారి మితిమీరిన క్రమశిక్షణ కూడా టీనేజర్లలో చెడునడతకు కారణంగా ఉంటూ ఉంటుంది.

బాల్యంలో పిల్లవాణి? మితిమీరిన క్రమశిక్షణలో ఉంచడంవల్ల పెద్దయి కాస్త స్వేఛ్ఛ లభించే సమయానికి సంకెళ్లు తెంచుకుని రివోల్టయ్యే అవకాశం ఏర్పడుతుంది. బాల్యమంతా పిల్లాణి? బొటనవేలు కింద నొక్కిపెట్టి తమ నిర?యాల్ని పిల్లలపై రుద్దడంవల్ల వారిలో ఆలోచించే జ్ఞానం తగ్గిపోతుంది. పెద్దయ్యాక స్వంత నిర?యం తీసుకునే శక్తిసామర్థ్యాలు కొరవడతాయి. దానివల్ల కాలేజీ జీవితంలో ప్రవేశించినా కూడా ఈత రానివాడు సముద్రంలో గిలగిలలాడినట్టు ఉక్కిరి బిక్కిరైపోతాడు. ఇలాంటి కుర్రవాళ్లల్లో సంకల్పం, వ్యక్తిత్వం రెండూ లోపించి తమకు దొరికిన స్వేఛ్ఛా స్వాతంత్ర్యం ఎలా ఉపయోగించుకోవాలో తెలియక వ్యతిరేక ఫలితాలు పొందుతారు. అంతకు మునుపు తల్లి తల్లిదండ్రులు తమ నిర?యాన్ని రుద్దినట్లుగానే ఇప్పుడు తోటి సహచరులు తమ నిర?యాల్ని అతని మీద రుద్దుతుంటారు.

**అభద్రతా భావం**

మనుషులలో మనోవ్యాకులత అనే అవలక్షణం ఎప్పుడూ ఉంటుంది. దీనివల్ల ఎప్పుడూ టెన్షన్, ఆదుర్దా, ఆందోళనతో ఉంటారు. ఈ న్యూరోసిస్‌కి మూలకారణం భద్రతారాహిత్యం! పసిప్రాయంలో తల్లి అందించే ప్రేమ మీదే పిల్లల భద్రతాభావం ఆధారపడి ఉంటుంది. పిల్లలతో తల్లి అంటీముట్టనట్టు ప్రవర్తిస్తే, తిరస్కారానికి గురవుతున్నానే భావం పిల్లల్లో కలుగుతుంది. దాంతో బిడ్డ భద్రతకు సంబంధించిన భయాందోళనకు లోనవుతాడు. తల్లిప్రేమ ద్వారా లభించే భద్రతాభావం నిస్సహాయులైన పసిపిల్లలమీద ఎంతో ప్రభావం చూపిస్తుంది. 'నీకు నేనున్నాను' అనే భద్రతా భావం తల్లి దగ్గర నుంచి పిల్లవాడికి దొరకనప్పుడు అతనిలో భద్రతాభావం లోపిస్తుంది. పెద్దయ్యాక జీవితాన్ని ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోలేడు. నిరాశావాదం, ఆందోళన, బిడియంలాంటివి అతణి? చుట్టుముడతాయి. అందరితో కలుపుగోలుగా ఉండలేడు. ఇతరుల్ని ప్రేమించలేడు. తనను తాను ప్రేమించుకోవడంలోనే మునిగిపోయి ఒంటరిగా మిగిలిపోతాడు. జీవితంలో అతనికి ఇవన్నీ నష్టాన్ని కలుగజేసే అంశాలు. తల్లిదండ్రుల నుంచి ప్రేమ లభించని పిల్లలు నానారకాలుగా ప్రతిస్పందించే అవకాశం ఉంది. భయాందోళనలకు గురికావచ్చు. వైరాగ్యానికి లోనుకావచ్చు. చెల్లెలు లేక తమ్ముడు పుట్టడం మూలంగా తల్లి ప్రేమకు దూరమైనట్టు భావిస్తే మనస్సులో కోపం, ఈర్ష్య పెరిగి, వాటిని ఇతరుల మీద ప్రదర్శిస్తారు. లేకపోతే ఇతరుల నుంచి జాలి పొందే ప్రయత్నం చేస్తారు.వారి ప్రేమ పొందేందుకు కొన్ని స్వయం కల్పిత పనులను చేస్తారు. ఉదాహరణకు జ్వరం వచ్చినప్పుడు తల్లిదండ్రులు అతిప్రేమ ప్రదర్శిస్తారు. ఇలాంటి ప్రేమకోసమే కోరి జ్వరం తెచ్చుకుంటారు. లేకపోతే ఒక దెబ్బ తగిలించుకుని తల్లిదండ్రుల నుంచి గారాబం చవిచూడాలని ప్రయత్నిస్తారు. ఇవన్నీ వాళ్ళు తెలిసి కావాలని చేయరు. మనస్సు అసంకల్పితంగా స్పందించి శరీరం కూడా అలా స్పందించేలా చేస్తుంది. ఈ లక్షణాలన్నీ ప్రేమాదరణ లభించని పిల్లల్లో చోటుచేసుకోవడం సహజం. ముఖ్యంగా ఇద్దరు పిల్లలున్న ఇంట్లో ఈ లక్షణాలు ఎవరికైనా వచ్చే

# ఐఫోన్ 16పై ఐసీఐసీఐ బ్యాంక్ ఆఫర్లు





**న్యూఢిల్లీ- నవభూమి:** ఇటీవల మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చిన ఐఫోన్ 16పై ఐసీఐసీఐ బ్యాంక్ కూడా ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నది. ఐఫోన్ 16ని కొనుగోలు చేసినవారికి రూ.5 వేల ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్ అందుకోవచ్చునని తెలిపింది. అలాగే ఈఎంఐ ఆప్షన్‌లో నెలకు రూ.2,497 చెల్లించి ఈ ఫోన్‌ను కొనుగోలు చేయవచ్చునని సూచించింది.
ఈ ఆఫర్లు డిసెంబర్ 31 వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నాయని పేర్కొంది. పాత ఐఫోన్ కలిగివున్నవారు అప్‌గ్రేడ్‌తో ఐఫోన్ 16ని కొనుగోలు చేసిన వారికి క్యాష్‌బ్యాక్‌తోపాటు వడ్డీరహిత ఈఎంఐని ఎంచుకోవచ్చునని సూచించింది. ఈ ఆఫర్ కేవలం ఐఫోన్ 16 ప్రొ మ్యాక్స్, ఐఫోన్ 16 ప్రొ, ఐఫోన్ 16 ప్లస్, ఐఫోన్ 16 మాడళ్లకు వర్తించనున్నది. ఈ-కామర్స్ సంస్థలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లతోపాటు ఆఫ్‌లైన్ స్టోర్లు అప్‌ట్రానిక్స్, యూనికార్న్, క్రోమా, రిలయన్స్, విజయ సేల్స్, సంగీత మొబైల్స్‌లో లభించనున్నది.




## ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లోఐడీఎఫ్‌సీ విలీనం




**న్యూఢిల్లీ-నవభూమి:** ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ విలీనానికి ఇరు సంస్థల బోర్డులు ఆమోదం తెలిపాయి. ఈ విలీనం అక్టోబర్ 1 నుంచి అమలులోకి రానున్నది.
ఈ విలీనానికి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, చెన్నై బెంచ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఐడీఎఫ్‌సీ లిమిటెడ్ వాటాదారులకు రూ.10 ముఖ విలువ కలిగిన 100 ఈక్విటీ షేర్లకుగాను ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌నకు చెందిన 155 ఈక్విటీ షేర్లు లభించనున్నాయి.

## బీఎస్ఎన్ఎల్ సరికొత్త ప్లాన్

**న్యూఢిల్లీ- నవభూమి:** ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ మరో ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 60 రోజుల కాలపరిమితితో రూ.345 ప్రీపెయిడ్ ప్లాన్‌ను తెచ్చింది. ఈ ప్లాన్ కింద రోజుకు 1జీబీ డాటాతోపాటు అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌ను అందిస్తున్నట్లు తెలిపింది.
4జీ సేవలు అందించడానికి సిద్ధమతున్న సంస్థకు ఈ నూతన ప్లాన్‌తో కస్టమర్లకు అధిక ప్రయోజనాలు లభించనున్నాయని తెలిపింది. ఇతర టెలికం సంస్థల కంటే బీఎస్ఎన్ఎల్ టారిఫ్‌లు చాలా తక్కువ స్థాయిలో ఉన్నాయి.
అమూల్ టర్నోవర్ 59,445 కోట్లు అమూల్ పేరుతో పాల ఉత్పత్తులను విక్రయిస్తున్న గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్(జీసీఎంఎంఎఫ్) అంచనాలకు మించి రాణిస్తున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.59,445 కోట్ల(7 బిలియన్ డాలర్లు) ఆదాయాన్ని ఆర్జించింది.

## అమూల్ టర్నోవర్ 59,445 కోట్లు




**న్యూఢిల్లీ-నవభూమి:** అమూల్ పేరుతో పాల ఉత్పత్తులను విక్రయిస్తున్న గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్(జీసీఎంఎంఎఫ్) అంచనాలకు మించి రాణిస్తున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.59,445 కోట్ల(7 బిలియన్ డాలర్లు) ఆదాయాన్ని ఆర్జించింది.
క్రితం ఏడాది వచ్చిన ఆదాయంతో పోలిస్తే ఎనిమిది శాతం వృద్ధిని నమోదు చేసుకున్నట్లు 50వ వార్షిక సాధారణ సర్వసభ్య సమావేశం అనంతరం వెల్లడించింది. అలాగే గ్రూపు టర్నోవర్ రూ.80 వేల కోట్లు(10 బిలియన్ డాలర్లు)గా నమోదైందని తెలిపింది. 2022-23 ఏడాదికిగాను 72 వేల కోట్లు(9 బిలియన్ డాలర్లు) ఆర్జించింది.
ప్రపంచంలో అత్యంత బలమైన ఆహార బ్రాండ్, బలమైన పాల ఉత్పత్తుల బ్రాండ్‌గా అమూల్ ఎదిగింది. రైతులే యజమానిగా ఎదిగిన అమూల్ కో-ఆపరేటివ్ సొసైటీలో 36 లక్షల మంది రైతుల నుంచి రోజుకు 300 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నది. ఈ సందర్భంగా జీసీఎంఎంఎఫ్ చైర్మన్ శామల్‌భాయ్ పటేల్ మాట్లాడుతూ..జీసీఎంఎంఎఫ్ మరో చారిత్రక మైలురాయికి చేరుకున్నదని, ప్రపంచంలో అత్యంత బలమైన ఆహార పదార్థాల బ్రాండ్‌గా అవతరించిందన్నారు.

## సెయిల్‌లో వైజాగ్ స్టీల్ విలీనం.. విక్రయ ప్రతిపాదనపై వెనక్కి తగ్గిన కేంద్ర సర్కార్!

**న్యూఢిల్లీ- నవభూమి:** ఆర్థిక నష్టాల్లో కొనసాగుతున్న ప్రభుత్వరంగ స్టీల్ ఉత్పత్తి సంస్థ రాష్ట్రీయా ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్(వైజాగ్ స్టీల్) విక్రయ ప్రతిపాదనపై కేంద్ర సర్కార్ వెనక్కి తగ్గింది. కార్మికుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో మోదీ సర్కార్ మరో ఆఫర్‌ను తెరపైకి తీసుకొచ్చింది. ఈ వైజాగ్ స్టీల్‌ను మరో ప్రభుత్వరంగ సంస్థయైన సెయిల్‌లో విలీనం చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ గడ్డు పరిస్థితి నుంచి గట్టెక్కించడానికి సెయిల్‌లో విలీన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా భావిస్తున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి.
అలాగే వైజాగ్ స్టీల్‌కు ఉన్న 2వేల ఎకరాల భూములను సైతం ఎన్ఎండీసీకి విక్రయించడంతోపాటు సంస్థకు ఉన్న బ్యాంక్ రుణాలకు శాశ్వత పరిష్కారం సూచించబోతున్నట్లు చెప్పారు. దీంట్లో భాగంగా డీఎఫ్ఎస్ కార్యదర్శి, స్టీల్ సెక్రటరీతోపాటు బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వైజాగ్ స్టీల్‌కు అత్యధికంగా రుణం ఇచ్చింది ఎస్బీఐ కావడం విశేషం.

# రియల్టీ సంస్థలపై రెరా కొరడా

**హైదరాబాద్- నవభూమి:** నిబంధనలు ఉల్లంఘించిన రియల్ ఎస్టేట్ సంస్థలపై రెరా కొరడాఝు లిపించింది. మార్కెటింగ్ కార్యకలాపాలు, ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో జరుగుతున్న మోసాలపై ఉక్కుపాదం మోపడానికి రెరా పలు కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. పూర్తిస్థాయిలో రెరా ఏర్పాటైన గడిచిన ఏడేండ్లలో ఏకంగా వెయ్యికి పైగా ప్రాజెక్టులపై రూ.36 కోట్ల వరకు జరిమానా విధించింది. వీటిలో ఇప్పటికే రూ.15 కోట్లను ఆయా సంస్థలు చెల్లించాయి కూడా.
ఎనిమిది కంటే ఎక్కువ ప్లాట్లను విక్రయించిన, 600 గజాలు అంతకంటే ఎక్కువ స్థలంలో నిర్మించి విక్రయాలు చేసినా ప్రాజెక్టులు రెరా పరిధిలోకి వస్తాయి. ఇలాంటి సంస్థలు తప్పకుండా రెరా వద్ద నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ రెరా వద్ద నమోదు చేసుకోకుండానే విక్రయాలు జరిపితే ఆయా ప్రాజెక్టులు చేపట్టిన సంస్థలపై ఈ మండలి భారీస్థాయిలో జరిమానా విధిస్తున్నది.

**రెరా నంబర్ లేకుండానే ప్రకటనలు..**

రెరా నంబర్ లేకుండానే రియల్ ఎస్టేట్ సంస్థలు భారీ స్థాయిలో వాణిజ్య ప్రకటనలు జారీ చేసిన సంస్థలపై ఫిర్యాదులు అందడంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వాణిజ్య ప్రకటనలపై ఖచ్చితంగా రెరా నంబర్ ఉండాల్సిందేనని షరతు విధించింది. దీంతో తమ ప్రకటనల పక్కన రెరా నంబర్‌ను ఖచ్చితంగా ముద్రిస్తున్నాయి.
ప్రీలాంచ్ ఆఫర్లు, ముందస్తుగా ఒప్పందం చేసుకున్న మేరకు ప్లాట్లను అప్పగించకపోవడం, వాటిలో సరైన వసతులు కల్పించకపోయిన ప్రాజెక్టులపై కూడా చర్యలు తీసుకున్నది. ఒక దగ్గర ప్రాజెక్టు నమోదు చేసుకొని..అదే అనుమతితో మరికొన్ని చోట్ల విక్రయాలు చేస్తున్న ప్రాజెక్టులను గుర్తించడానికి ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది.

# నూతన కార్ల సందడే..సందడి




**న్యూఢిల్లీ- నవభూమి:** ప్రస్తుత పండుగ సీజన్‌లో కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి ఆటోమొబైల్ సంస్థలు సరికొత్త మాడళ్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నాయి. ఇప్పటికే ప్రతి నెలలో అర డజన్‌కు పైగా మాడళ్లను విడుదల చేస్తున్న సంస్థలు..వచ్చే నెలలోనూ ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తూ ఐదు మాడళ్లను విడుదల చేయడానికి సిద్ధమవుతున్నాయి. వీటిలో కియా, నిస్సాన్, బీవైడీ, మెర్సిడెజ్ బెంజ్‌లు ఉన్నాయి. ఈ వివరాలు..

**కియా నుంచి రెండు మాడళ్లు**

కొరియాకు చెందిన వాహన సంస్థ కియా.. దేశీయ మార్కెట్లోకి నయా కార్నివాల్‌ను విడుదల చేయబోతున్నది. వచ్చే నెల 3న మార్కెట్లోకి విడుదల చేస్తున్న ఈ కారు ధర రూ.50 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. 2.2 లీటర్ 4-సిలిండర్ డీజిల్ ఇంజిన్‌తో తయారైన ఈ కారు 193 బీహెచ్‌పీల శక్తినివ్వనున్నది. దీంతోపాటు మరో ఈవీ మాడల్‌ను కూడా అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 99.8 కిలోవాట్ల బ్యాటరీతో తయారు చేసిన ఈవీ 9లో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసింది. సింగిల్ చార్జింగ్‌తో 561 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. కేవలం 24 నిమిషాల్లోనే 10 శాతం నుంచి 80 శాతం వరకు చార్జింగ్‌కానున్నది.

**నిస్సాన్ మ్యాగ్నైట్ ఫేసిలిఫ్ట్**

వచ్చే నెల 4న మ్యాగ్నైట్ ఫేసిలిఫ్ట్ మాడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది నిస్సాన్ ఇండియా. దేశీయ మార్కెట్‌తోపాటు ఇతర దేశాలకు అనుగుణంగా లెఫ్ట్-హ్యాండ్ డ్రైవ్ వెర్షన్ కూడా తీసుకురాబోతున్నది.

**బీవైడీ ఈమ్యాక్స్ 7**

చైనాకు చెందిన ఈవీల తయారీ సంస్థ బీవైడీ మరో మాడల్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయబోతున్నది. వచ్చే నెల 8న ఈమ్యాక్స్ 7 మాడల్‌ను అందుబాటులోకి తెస్తున్నది. అడాస్ సూట్, ప్రీమియం స్విచ్‌గేర్, సాఫ్ట్-టచ్ మెటీరియల్స్, లగ్జరీ లుక్‌తో తీర్చిదిద్దింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారులో 55.4 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 420 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనుండగా, 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ఇవ్వనున్నది.

**మెర్సిడెజ్ బెంజ్ ఈ-క్లాస్**

జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ ఈ-క్లాస్ ఎల్‌డబ్ల్యూబీ మాడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 14.4 ఇంచుల సెంట్రల్ టచ్‌స్క్రీన్‌తోపాటు 12.3 ఇంచుల ప్యాసింజర్ టచ్‌స్క్రీన్, 4డీ సరౌండింగ్ సౌండ్ సిస్టమ్ కలిగిన ఈ మాడల్‌ను 2.0 లీటర్ల పెట్రోల్ ఇంజిన్‌తో తయారు చేసింది.

## టీజీఐఐసీ నిర్లక్ష్యంతో
# అమాయకులు బలి!

**హైదరాబాద్- నవభూమి:** తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీజీఐఐసీ) నిర్లక్ష్యం కొందరు అమాయకులకు శాపంగా మారుతున్నది. ఏండ్ల క్రితం పరిశ్రమల కోసం సేకరించిన భూములను కూడా టీజీఐఐసీ తన పేర మ్యుటేషన్ చేయించుకోకపోవటంతో నష్టపరి హారం తీసుకున్న పట్టాదార్లు తమ భూములను అమాయకులకు అంటగడుతున్నారు. భూములు కొనుగోలు చేసినవారు వాస్తవం తెలిసిన తర్వాత లబోదిబోమంటున్నారు.
హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఈ తరహా ఘటనలు లెక్కలేనన్ని ఉండొచ్చని అధికారులే అంగీకరిస్తున్నారు. పారిశ్రామిక అవసరాల కోసం రైతుల నుంచి భూములు సేకరించి, మౌలిక సదుపాయాలు కల్పించిన అనంతరం పరిశ్రమలకు విక్రయించడం టీజీఐఐసీ బాధ్యత. రైతుల నుంచి సేకరించిన భూములను నష్టపరిహారం చెల్లించిన వెంటనే టీజీఐఐసీ పేర రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఇలా చేయడంవల్ల పట్టాదార్లు ఇతరులకు విక్రయించే అవకాశం ఉండదు. అయితే టీజీఐఐసీకి చెందిన అధికారుల నిర్లక్ష్యం వల్ల చాలా ప్రాంతాల్లో సేకరించిన భూములు ఇంకా పట్టాదార్ల పేర్లతోనే కొనసాగుతుండటంతో వారు క్రయవిక్రయాలు జరుపుతున్నారు. దీనివల్ల కొనుగోలు చేస్తున్న అమాయకులు మోసపోతున్నారు.

ఉదాహరణకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలో వివిధ సర్వే నంబర్లలో దాదాపు 20 ఏండ్ల క్రితం అప్పటి ఏపీఐఐసీ సుమారు 200 ఎకరాల భూములు సేకరించింది. అందులో పావువంతు భూముల్లోనే పరిశ్రమలు ఏర్పాటు కాగా, మిగిలిన భూములు ఖాళీగానే ఉన్నాయి. భూములు సేకరించినా వాటిని పరిశ్రమల పేరుతో గానీ, ఏపీఐఐసీ పేరుతోగానీ రిజిస్ట్రేషన్ చేయించలేదు. దీంతో ఇంకా ఆ భూములు పట్టాదార్ల పేరు మీదే ఉన్నట్టు రికార్డులు చెప్తున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు వాటిని మళ్లీ ఇతరులకు విక్రయించారు.

**చేతులెత్తేసిన టీజీఐఐసీ**


సర్వే నంబరు 81 పరిధిలో ఇటువంటి ఘటన ఒకటి తాజాగా వెలుగుచూసింది. 20 ఏండ్ల క్రితం ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో ఆరు ఎకరాల భూమి ఇప్పటికే నలుగురు చేతులు మారింది. తీరా ఐదో వ్యక్తి దాన్ని కొనుగోలు చేసేందుకు ప్రయత్నించగా, టీజీఐఐసీ పేర రిజిస్టర్ అయినట్టు రికార్డులు చూపుతున్నాయి. దీంతో విక్రయానికి ఉంచిన ఆ నాలుగో వ్యక్తి తాను మోసపోయానని లబోదిబోమంటున్నాడు. తాను పట్టాదారు వద్ద భూమి కొనుగోలు చేసినట్టు, తన భూమిని విక్రయించేందుకు ఎన్వోసీ ఇవ్వాలని బాధితుడు టీజీఐఐసీని వేడుకొంటున్నాడు. అధికారులు మాత్రం ఎన్వోసీ ఇచ్చే ఆస్కారం లేదని చేతులెత్తేశారు. ఆ 200 ఎకరాల భూముల్లో ఇలాంటి ఇంకా ఎన్ని ఉన్నాయో తేలాల్సి ఉన్నది.
స్థానికంగా విచారించుకొని కొనుగోలు చేయాలి: టీజీఐఐసీ
పారిశ్రామిక ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేయాలనుకొనేవారు సమగ్రంగా విచారించుకొని, స్థానికులతో మాట్లాడిన తర్వాతే భూములు కొనుగోలు చేయాలని టీజీఐఐసీ అధికారులు సూచిస్తున్నారు. సిబ్బంది కొరత వల్ల తాము సేకరిస్తున్న భూములను వెంటనే టీజీఐఐసీ పేర రిజిస్ట్రేషన్ చేయించుకోలేకపోతున్నామని, దీన్ని ఆసరాగా చేసుకొని పట్టాదార్లు నష్టపరిహారం తీసుకొని కూడా ఇతరులకు విక్రయించుకొంటున్నట్టు తెలిసిం దని చెప్తున్నారు. సేకరించిన భూములను టీజీఐఐసీ పేర మ్యూటేషన్ చేయాల్సిన బాధ్యత రెవెన్యూశాఖపై ఉంటుందని, వాళ్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తాము చేసేదేమీ లేదని స్పష్టంచేస్తున్నారు. మొత్తంగా అధికారుల నిర్లక్ష్యం వల్ల అమాయకులు ఎంతోమంది మోసపోతున్నారు.

## భారీగా పెరిగిన చమురు కంపెనీల ఆదాయం.. సామాన్యులకు ఊరట కలిగించేరేమీ..?!




**న్యూఢిల్లీ- నవభూమి:** దేశానికి చెందిన చమురు కంపెనీల లాభం భారీగా పెరిగింది. మార్చి నుంచి పెట్రోల్‌పై లీటర్‌కు రూ.15, డీజిల్‌పై రూ.12 లాభం వస్తున్నది. ఈ సమయంలో ముడి చమురు బ్యారెల్‌కు 84 డాలర్ల నుంచి 72 డాలర్ల దిగువకు చేరింది. వాస్తవానికి కంపెనీలు ధరలను తగ్గించి ప్రజలపై భారాన్ని తగ్గించేందుకు చాలా అవకాశం ఉన్నది. ముడి చమురు ధర బ్యారెల్‌కు 71.31 డాలర్లకు చేరింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పడుతుండగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం రూ.60వేలకోట్ల దిగుమతి బిల్లు ఆదా కానున్నది. అయినా ధరలను తగ్గించేందుకు ఆసక్తి చూపడం లేదు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు కావాలంటే లాభాలు ఇవ్వొచ్చని.. చాలాకాలంగా ధరలు స్థిరంగా ఉంటున్నాయని ఐసీఆర్ఏ నివేదిక పేర్కొంటున్నది. ఇన్వెస్ట్‌మెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ నివేదిక ప్రకారం.. మార్చి నుంచి క్రూడ్ ధర 12శాతం పతనమైంది.
సౌదీ అరేబియా ధరలను తగ్గించేందుకు సిద్ధమవుతోందని పలు నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో రాబోయే కాలంలో ధరలు మరింత తగ్గే అవకాశం ఉంది. దేశీయ ఆయిల్ కంపెనీల లాభాలు మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. క్రూడాయిల్ బ్యారెల్‌కు డాలర్ తగ్గితే భారత్‌కు దిగుమతి బిల్లులపై వార్షికంగా రూ.13వేలకోట్లు ఆదా అవుతుంది. ఆర్థిక సర్వే 2024 ఈ ఆర్థిక సంవత్సరంలో ముడి చమురు సగటు ధర బ్యారెల్‌కు 84 డాలర్లుగా ఉండవచ్చని అంచనా వేసింది. అయితే, ప్రస్తుతం బ్యారెల్‌కు 70 నుంచి 75 డాలర్ల మధ్య పలుకుతున్నది. ఇదే సమయంలో ధరలను స్థిరీకరించినట్లయితే ఈ ఆర్థిక సంవత్సరంలో భారత్ మరింత బిల్లును మరింత ఆదా చేయగలదని నిపుణులు పేర్కొంటున్నారు. ఫలితంగా ద్రవ్యోల్బణం తగ్గుతుందని.. పెట్టుబడులకు అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. దేశానికి చెందిన ప్రధాన మూడు చమురు కంపెనీలు భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్ సంస్థలు 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.81వేలకోట్ల లాభాన్ని ఆర్జించాయి. ఇందులో ఇండియన్ ఆయిల్ రూ.39,619 కోట్లు, భారత్ పెట్రోలియం రూ.26,673 కోట్లు, హిందుస్థాన్ పెట్రోలియం రూ.14,694 కోట్లు వెనుకేసుకున్నాయి.
తీద్దాం.. వాడుదాం.. ఎగ్గొడుదాం.. పెడదారి పడుతున్న క్రెడిట్ కార్డుల వినియోగం యువతలో పెరుగుతున్న క్రెడిట్ కార్డుల వినియోగం పెడదారి పడుతున్నది. ఓ వైపు క్రెడిట్ స్కోర్లపై అవగాహనను పెంచుకుంటూనే.. మరోవైపు క్రెడిట్ కార్డులను విచ్చలవిడితనంతో వాడేస్తున్నారు. స్వైప్ చేద్దాం, ఎడాపెడా ఖర్చు పెడదాం, ఆ మొత్తాలను తిరిగి చెల్లించకుండా ఎగవేద్దాం.. అన్న రీతిలో చాలామంది క్రెడిట్ కార్డు యూజర్లు, ముఖ్యంగా మిల్లేనియల్స్ (1981-1996 మధ్య జన్మించినవారు) ఉండటం ఇప్పుడు ఆందోళన కలిగిస్తున్నది మరి.

## తీద్దాం.. వాడుదాం.. ఎగ్గొడుదాం.. పెడదారి పడుతున్న క్రెడిట్ కార్డుల వినియోగం



**న్యూఢిల్లీ-నవభూమి:** యువతలో పెరుగుతున్న క్రెడిట్ కార్డుల వినియోగం పెడదారి పడుతున్నది. ఓ వైపు క్రెడిట్ స్కోర్లపై అవగాహనను పెంచుకుంటూనే.. మరోవైపు క్రెడిట్ కార్డులను విచ్చలవిడితనంతో వాడేస్తున్నారు. స్వైప్ చేద్దాం, ఎడాపెడా ఖర్చు పెడదాం, ఆ మొత్తాలను తిరిగి చెల్లించకుండా ఎగవేద్దాం.. అన్న రీతిలో చాలామంది క్రెడిట్ కార్డు యూజర్లు, ముఖ్యంగా మిల్లేనియల్స్ (1981-1996 మధ్య జన్మించినవారు) ఉండటం ఇప్పుడు ఆందోళన కలిగిస్తున్నది మరి. ప్రముఖ క్రెడిట్ రేటింగ్ సమాచార సంస్థ, ట్రాన్స్‌యూనియన్ సిబిల్ తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో ఒకింత విస్తుపోయే నిజాలే వెలుగుచూశాయి. బై నౌ, పే లేటర్ (ఇప్పుడు కొనండి, తర్వాత తీరిగ్గా చెల్లించండి) సంస్కృతికి యంగ్ మిల్లేనియల్స్ అలవాటు పడిపోయిన తీరు స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ-కామర్స్ వేదికలపై చేసే ఆన్‌లైన్ షాపింగ్‌ల్లో ఈఎంఐలతో జరుగుతున్న కొనుగోళ్లే ఎక్కువగా ఉండటాన్నిబట్టి పరిస్థితుల తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.క్రెడిట్ కార్డులను సక్రమంగా వినియోగించుకుంటే ఎన్ని లాభాలున్నాయో.. దారితప్పితే అన్ని నష్టాలూ ఉన్నాయి. సిబిల్ వివరాల ప్రకారం క్రెడిట్ కార్డ్ డిఫాల్ట్స్ ఈ ఏడాది జూన్ నాటికి 1.8 శాతానికి పెరిగాయి. 6 నెలల క్రితం ఇది 1.7 శాతంగా ఉండగా, గత ఏడాది మార్చిలో 1.6 శాతంగా ఉన్నది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే క్రెడిట్ కార్డుల బకాయిలు ఈ జూన్‌దాకా రూ.2.7 లక్షల కోట్లుగా ఉన్నాయి. మార్చిలో రూ.2.6 లక్షల కోట్లుగా ఉన్నట్టు సిబిల్ తెలియజేసింది. నిరుడు మార్చిలో రూ.2 లక్షల కోట్లే. నిజానికి కరోనాకు ముందు 2019 మార్చిలో మొత్తం బకాయిలు రూ.87,686 కోట్లుగానే ఉన్నాయి. కానీ ఆ తర్వాతి ఐదేండ్లలో మూడింతలు ఎగిశాయి. చక్ర వార్షిక వృద్ధిరేటు (సీఏజీఆర్) 24 శాతంగా నమోదైంది. కాగా, 1-2 నెలలపాటు చెల్లించకపోతే బ్యాంకులు బకాయిలుగా భావిస్తాయి. ఆపై 6 నెలలపాటు చెల్లించకపోతే దాన్ని డిఫాల్ట్‌గా పరిగణిస్తాయి.
క్రెడిట్ కార్డుపైనున్న మొత్తం నగదు పరిమితిని యువత వాడేస్తున్నది. ఆన్‌లైన్ షాపింగ్‌లలో స్మార్ట్‌ఫోన్లు, బట్టలు, షూస్ కొనుగోళ్ల కోసం ఎక్కువగా క్రెడిట్ కార్డులనే యంగ్ మిల్లేనియల్స్ ఆశ్రయిస్తున్నారు. అనవసరపు ఖర్చులకు దిగుతూ.. తిరిగి వాటిని చెల్లించలేక చేతులెత్తేస్తున్నారు. చివరకు అవి మొండి బకాయిలుగా మారుతున్నాయి. దీనివల్ల భవిష్యత్తులో గృహ రుణాల వంటి కీలకమైన ఆర్థిక సాయాన్ని పొందలేని పరిస్థితి వస్తున్నది. కాబట్టి క్రెడిట్ కార్డులు ఇస్తున్నారు కదా అని తీసుకోవద్దు. అవసరం ఉంటేనే తీసుకోవాలి. లేకపోతే వాటి జోలికి వెళ్లకపోవడమే మంచిది.



## గెలిచేది మేమే, వచ్చేది మా ప్రభుత్వమే: ఒమర్


**కుప్వారా–నవభూమి:** జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్–కాంగ్రెస్ కూటమి గెలుపు తథ్యమని, తామే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. బీజేపీ గెలుపు అవకాశాలపై ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ, సొంతంగా మెజారిటీ సాధించేందుకు అవసరమైన సీట్లలో వాళ్లు పోటీ చేయలేదన్నారు. కశ్మీర్‌లో చాలా స్థానాల్లో వాళ్లు పోటీ చేయలేదని, జమ్మూలోనూ ఎక్కువ సీట్లు గెలుచుకునే పరిస్థితిలో ఆ పార్టీ లేదని చెప్పారు. తమకు అక్కడా, ఇక్కడా (జమ్మూ, కశ్మీర్) బీ,సీ,డీ,ఈ టీమ్‌లు ఉన్నాయనే సంకేతాలతో వాళ్లు ప్రజలను మరోసారి ఫూల్స్ చేయాలనుకుంటున్నారని, ప్రజలకు వాళ్లేంటో బాగా తెలుసునని ఒమర్ అన్నారు. తొలి రెండు విడతల పోలింగ్ సరళిని బట్టి ఎన్‌సీ–కాంగ్రెస్ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని తాను అనుకుంటున్నట్టు చెప్పారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను తొలగించడంలో బీజేపీ ఉద్దేశం ఏమిటని ఒమర్ ప్రశ్నించారు. అందువల్ల ఎలాంటి ప్రయోజనం ఒనగూరిందో చెప్పాలన్నారు. సుప్రీంకోర్టు మీద తమకు నమ్మకం ఉందని, ఎన్నికల తర్వాత రాష్ట్ర హోదాను తిరిగి తెచ్చుకుంటామని ఒమర్ స్పష్టం చేశారు. కాగా, మూడు విడతల జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా మొదటి, రెండవ విడత పోలింగ్ సెప్టెంబర్ 18, 25 తేదీల్లో జరిగాయి. మూడో విడత పోలింగ్ అక్టోబర్ 1న జరుగుతుంది.

## కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌పై కేసు




**న్యూఢిల్లీ– నవభూమి:** ఎన్నికల బాండ్ల పేరిట అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ అంశంపై జనాధికార సంఘర్ష పరిషత్ ఉపాధ్యక్షుడు ఆదర్శ్ అయ్యర్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం 42వ ప్రజాప్రతినిధుల కోర్టుకు బదిలీ అయింది. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన కోర్టు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని బెంగళూరులోని తిలక్‌నగర్ పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబరు 10కి వాయిదా వేసింది. దీంతో పోలీసులు శనివారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్(ఏ1), ఈడీ (ఏ2), బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా(ఏ3), మాజీ ఎంపీ నళిన్‌కుమార్(ఏ4), బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర(ఏ5), రాష్ట్ర బీజేపీ నేతల(ఏ6)పై ఐపీసీ 384, 120 బీ, 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎలక్టోరల్ బాండ్ల ముసుగులో వివిధ కార్పొరేట్ కంపెనీల ఎండీలు, సీఈవోలను బెదిరించి రూ. 8వేల కోట్లు దోపిడీ చేశారని ఆదర్శ్ అయ్యర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కర్ణాటక సీఎం సిద్దరామయ్య స్పందించారు. "ఎఫ్ఐఆర్ నమోదైనందున కేంద్ర మంత్రి నిర్మల తన పదవికి రాజీనామా చేస్తారా" అని ప్రశ్నించారు.

## బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై నిషేధం ఎత్తివేత



**న్యూఢిల్లీ– నవభూమి:** బాస్మతీయేతర తెల్ల బియ్యం ఎగుమతులపై అమల్లో ఉన్న నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. అయితే టన్నుకు 490 డాలర్ల కనీస ఎగుమతి ధర (ఎంఈపీ)ను శనివారం విధించింది. అలాగే ఈ బియ్యంను ఎగుమతి సుంకం నుంచి మినహాయించింది. దేశీయంగా బియ్యం సరఫరాను పెంచడానికే కాకుండా ధరలను నియంత్రించే ఉద్దేశంతో గత ఏడాది జూలైలో బాస్మతీయేతర తెల్ల బియ్యంపై కేంద్రం నిషేధం విధించింది. తాజాగా బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై నిషేధాన్ని ఎత్తివేయడంతోపాటు కనీస ఎగుమతి ధరను విధిస్తూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫటీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది. దేశంలోని గోదాముల్లో బియ్యం నిల్వలు పెరగడం, రిటైల్ ధరలు నియంత్రణలోనే ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. మరోవైపు పారాబాయిల్డ్ బియ్యంపై ఎగుమతి సుంకాన్ని 20 శాతం నుంచి 10 శాతానికి కేంద్రం తగ్గించింది. బ్రౌన్ రౌస్‌పై ఎగుమతి సుంకాన్ని 10శాతానికి తగ్గిస్తున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని రెవెన్యూ విభాగం ఓ నోటిఫికేషన్‌లో పేర్కొంది. బాస్మతీయేతర తెల్లబియ్యంపైనా ఎగుమతి సుంకం 20శాతం ఉండగా ఈ బియ్యాన్ని ఎగుమతి సుంకం నుంచి మినహాయించారు. తక్షణమే సుంకాల్లో మార్పు అమల్లోకి వస్తుందని నోటిఫికేషన్‌లో తెలిపారు.

## దేశ ప్రయోజనాలే మిన్నగా బతికిన వ్యక్తి ఏచూరి



**న్యూఢిల్లీ– నవభూమి:** రాజకీయంగా ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా దేశ ప్రయోజనాలే మిన్నగా జీవితాంతం బతికిన వ్యక్తి సీతారాం ఏచూరి అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఎన్డీయేకు వ్యతిరేకంగా ఏర్పడిన ఇండియా కూటమిని ఐక్యంగా ఉంచి, బలంగా ముందుకు తీసుకెళ్లడంలో తెరవెనుక ఏచూరి కీలక పాత్ర పోషించారని తెలిపారు. శనివారం, ఇక్కడ తాల్‌కటోరా స్టేడియంలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభను ఆ పార్టీ నిర్వహించింది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడారు. ఏచూరికి తాను స్నేహితుడిని అయినందుకు గర్వంగా ఉందన్నారు.

# లైఫ్ సపోర్ట్ తీసేయొచ్చు



**న్యూఢిల్లీ– నవభూమి:** చికిత్సతో ఎంతమాత్రమూ కోలుకోవటానికి అవకాశం లేకుండా, మరణశయ్యపై ఉన్న రోగులకు పరోక్ష కారుణ్య మరణాన్ని అందించే అంశానికి సంబంధించి కేంద్ర ఆరోగ్యశాఖ శనివారం ముసాయిదా మార్గదర్శకాలను వెలువరించింది. జీవనాధార వైద్య ప్రక్రియలపైనే (లైఫ్ సస్టెయినింగ్ ట్రీట్‌మెంట్స్ – ఎల్ఎస్టీపై) ఆధారపడిన రోగులను దృష్టిలో ఉంచుకొని వీటిని రూపొందించారు. వీటి ప్రకారం.. వెంటిలేషన్, వాసోప్రెషర్స్, డయాలిసిస్, శస్త్రచికిత్సలు, ట్రాన్స్‌ఫ్యూజన్స్, పేరెంటల్ న్యూట్రిషన్స్ తదితర ప్రక్రియలను ఎల్ఎస్టీగా పేర్కొన్నారు. 'వీటిని కొనసాగించటం ద్వారా రోగికి ఎంతమాత్రమూ ఉపశమనం లేనప్పుడు అవి రోగికి మరింత భారంగా పరిణమిస్తాయి. అంతేగాక రోగి కుటుంబంపై అవి మానసికంగా, ఆర్థికంగా ఒత్తిడి కలుగజేస్తాయి. ఇటువంటి ఐసీయూ కేసుల్లో ఎల్ఎస్టీని తొలగించటం ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్న విధానం' అని వివరించారు.

### నాలుగు షరతులు

ఎల్ఎస్టీని తొలగించటం ద్వారా రోగికి పరోక్ష కారుణ్య మరణాన్ని కల్పించటానికి పాటించాల్సిన నాలుగు షరతులను ఈ మార్గదర్శకాల్లో పొందుపరిచారు. అవి, 1. రోగిని బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించారా? 2. రోగి పరిస్థితి పూర్తిగా విషమించిందని, ఎంత తీవ్రమైన చికిత్సను అందించినా మెరుగుపడే అవకాశం లేదని వైద్యులు భావిస్తున్నారా? 3. ఎల్ఎస్టీని కొనసాగించవద్దని రోగి లేదా రోగి తరఫు వ్యక్తులు రాతపూర్వకంగా తెలియజేశారా? 4. ఎల్ఎస్టీపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఉందా?. వీటి ద్వారా ఎల్ఎస్టీ తొలగింపుపై నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. కాగా, ఆరోగ్యం పూర్తిగా విషమించిన రోగులకు ఎల్ఎస్టీ చికిత్సను ప్రారంభించే ముందు కూడా డాక్టర్లు ఈ షరతులను పరిగణనలోకి తీసుకోవాలని ముసాయిదా మార్గదర్శకాల్లో నిర్దేశించారు.

# అద్భుతం... ప్రపంచంలో 0.3శాతం మందికి మాత్రమే ఇలా జరుగుతుంది!



**న్యూఢిల్లీ– నవభూమి:** చైనాకు చెందిన ఓ మహిళ కవలలకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని అక్కడ మీడియా ప్రత్యేకంగా హైలెట్ చేసింది. ఇందులో అంత హైలెట్ చేయడానికి ఏముంది అని అనుకుంటే పొరపాటే సుమా! ఎందుకంటే... ప్రపంచంలో కేవలం 0.3 శాతం మంది మహిళలకు మాత్రమే ఉండే అరుదైన పరిస్థితిలో ఆమె కవలలకు జన్మనిచ్చింది. అవును... దక్షిణ చైనా మార్నింగ్ పోస్ట్ నివేదిక ప్రకారం... ఆ దేశంలోని వాయువ్య ప్రాంతానికి చెందిన ఓ మహిళ సెప్టెంబరు లో కవలలకు జన్మనిచ్చింది. ఆమెకు రెండు గర్భాశయాలు ఉండగా.. ఈ కవలలు ఒక్కొక్కరూ వేర్వేరు గర్భాల నుంచి జన్మించారు. వీరిలో ఒకరు అబ్బాయి, మరొకరు అమ్మాయి. %హాశ్రీంశీ =ముం% – భారత్ లో రూ. 5,000, రూ. 10,000 నోట్లు... ఎందుకు నిలిపేశారో తెలుసా? యుటెరస్ డిడెల్ఫిస్ అని పిలవబడే ఆమె పరిస్థితి చాలా అరుదైనదని.. సహజమైన గర్భధారణ ద్వారా రెండు గర్భాశయాల్లో పిండం అభివృద్ధి చెందడం చాలా అరుదని చెబుతున్నారు. ఆమె ఎనిమిదిన్నర నెలల గర్భవతిగా ఉన్నప్పుడు షాంగ్సీ ప్రావిన్స్ లోని ఆసుపత్రిలో కవలలకు జన్మనిచ్చారు. వైద్యులు ఈ కేసును మిలియన్ లలో ఒక విషయంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా స్పందించిన ఆసుపత్రి వైద్యుడు కాయ్ యింగ్... సహజమైన గర్భధారణ ద్వారా రెండు గర్భాశయాల్లో గర్భవతి కావడం చాలా అరుదని.. తాము చైనా, విదేశాల నుంచి ఇటువంటి రెండు కేసుల గురించి మాత్రమే విన్నట్లు తెలిపారు. ఈ పరిస్థిలో ఉన్న మహిళలు గర్భస్రావం, ముందస్తు జననం వంటి సవాళ్లను ఎదుర్కొంటారని అన్నారు. ఇక తాజాగా ఆమె కవలలను సిజేరియన్ ద్వా రా ప్రసవించింది. ఈ సమయంలో అబ్బాయి బరువు 3.3 కిలోలు, అమ్మాయి బరువు 2.4 కిలోల బరువు ఉన్నారని.. ఇద్దరూ ఆరోగ్యంగానే జన్మించారని చెబుతున్నారు.

## భారత్ లో రూ.5,000, రూ.10,000 నోట్లు...
# ఎందుకు నిలిపేశారో తెలుసా?




**న్యూఢిల్లీ –నవభూమి:** ప్రస్తుతం భారతదేశంలో రూ. 500 నోటు అత్యధిక విలువైనదిగా ఉన్న సంగతి తెలిసిందే. 2016 డిమోనిటైజేషన్ తర్వాత ప్రవేశపెట్టబడిన రూ. 2,000 నోటు అంతక ముందు దేశంలో అత్యధిక విలువైన నోటుగా ఉండేది. అయితే... భారత్ లో ఒకప్పుడు రూ. 5,000.. రూ. 10,000 వంటి అధిక విలువున్నవి నోట్లు ఉన్న సంగతి చాలా మందికి తెలిసి ఉండదు. అవును.. దేశ ఆర్థిక చరిత్రలో అంతగా తెలియని రూ. 5,000.. రూ. 10,000 నోట్ల అధ్యాయం ఓ ఆసక్తికర అంశం. వాస్తవానికి భారతదేశంలో రూ. 10,000 నోటు స్వాతంత్ర్యానికి పూర్వం ఉండేది. 1938లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మొదట రూ. 10,000 నోటును విడుదల చేసింది. ఇదే ఇప్పటివరకూ దేశంలో చలామణిలో ఉన్న అతిపెద్ద డినామినేషన్ గా నిలిచింది. అయితే 1946 జనవరిలో బ్రిటీష్ ప్రభుత్వం ఈ రూ. 10,000 నోటును రద్దు చేయాలని నిర్ణయించింది. ప్రధానంగా రెండో ప్రపంచ యుద్ధం సమయంలో పెరిగిన బ్లాక్ మార్కెట్ కార్యకలాపాలను అరికట్టడానికి నాడు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో స్వాతంత్రయం అనంతరం 1954లో రూ. 10,000.. రూ. 5,000 నోట్లను తిరిగి చలామణిలో పెట్టారు. ఈ నేపథ్యంలో 1978లో రూ. 10,000 నోటు వ్యవహారం మరో మలుపు తిరిగింది. భారత ప్రభుత్వం ఈ నోటుతో పాటు ఐదువేల రూపాయల నోటును మళ్లీ డీమోనిటైజ్ చేయాలని నిర్ణయించుకుంది. ఈ అధిక విలువైన నోట్లను సాధారణ ప్రజలు విస్తృతంగా ఉపయోగించేవారు కాదు కానీ... వాణిజ్యంలో పెద్ద పెద్ద లావాదేవీలకు, బ్లాక్ మార్కెట్ లావాదేవీలకు ఉపయోగించేవారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ నేతృత్వంలోని ప్రభుత్వం డీమోనిటైజేషన్ చేయాలని నిర్ణయించింది. అయితే... ఇటీవల రూ. 5,000.. రూ. 10,000 నోట్లను తిరిగి ప్రవేశపెట్టాలనే విషయంపై కొంత పరిశీలన జరిగింది. ఆ సమయంలో ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ ఈ అధిక విలువ గల నోట్లు తిరిగి రావొచ్చును సూచించారు! అయితే అంతిమంగా ఆ ఆలోచనను విరమించుకున్నారు! దానికి బదులుగా 2016 డీమోనిటైజేషన్ సమయంలో రూ. 500, రూ. 1,000 నోట్ల ఉపసంహరించుకున్నప్పుడు.. ప్రభుత్వం రూ. 2,000 నోటును ప్రవేశ పెట్టాలని నిర్ణయించింది. అయితే... 2023 మే 19న రూ. 2,000 నోట్లనూ చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్బీఐ ప్రకటించింది.

# సీఎంకు లెప్టోస్పిరోసిస్ పాజిటివ్



**చండీగఢ్: నవభూమి:** పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ 'లెప్టోస్పిరోసిస్' బారిన పడ్డారు. వైద్య పరీక్షల్లో పాజిటివ్ వచ్చింది. అరుదైన బాక్టీరియా ఇన్‌ఫెక్షన్ అయిన 'లెప్టోస్పిరోసిస్' ప్రధానంగా కీలకమైన ఊపిరితిత్తులు, మూత్రపిండాలు వంటి అవయాలపై ప్రభావం చూపుతుంది. పరిస్థితి తీవ్రమైన సందర్భాల్లో మరణాలకు దారితీసే అవకాశం కూడా ఉంటుంది. భగవంత్ మాన్ 'లెప్టోస్పిరోసిస్'తో బాధపడుతున్నట్టు వైద్య పరీక్షల్లో తేలిందని మొహాలిలోని ఫోర్టిస్ ఆసుపత్రి వైద్యులు ధ్రువీకరించారు. అయితే ప్రధాన అవయవాలు నిలకబడగా పనిచేస్త్తున్నట్టు చెప్పారు. వైద్య చికిత్సకు సీఎం చాలా బాగా స్పందిస్తున్నట్టు 'ఆప్' నేతలు తెలిపారు. "క్లినికల్ ప్రమాణాల ఆధారంగా మాన్ ఆరోగ్యం చాలా మెరుగ్గా ఉంది. ట్రీట్‌మెంట్‌కు కూడా బాగా స్పందిస్తున్నారు. ప్రస్తుతానికి ఆయన కీలక అవయాలన్నీ నిలకడగా పనిచేస్తున్నాయి. ఆసుపత్రిలో చేరినప్పుడు టైఫాయిడ్ జ్వరంగా అనుమానించాం. రక్తపరీక్షల్లో లెప్టోస్పిరోసిస్ పాజిటివ్ అని తేలింది" అని ఫోర్టిస్ ఆసుపత్రి డైరెక్టర్, కార్డియాలాజీ విభాగం అధిపతి డాక్టర్ ఆర్‌కే జస్వాల్ తెలిపారు. 50 ఏళ్ల భగవంత్ మాన్ గత బుధవారం రాత్రి రొటీన్ వైద్య పరీక్షల కోసం ఫోర్టిస్ ఆసుపత్రిలో చేరినట్టు సీఎంఓ కార్యాలయం ఇంతకుముందు తెలిపింది.

## ఢిల్లీలో తండ్రి, నలుగురు కూతుళ్ల ఆత్మహత్య!



**న్యూఢిల్లీ– నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీలోని వసంత్‌కుంజ్‌లో ఘోరం జరిగింది. ఓ కుటుంబం సామూహిక ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో లోపలి నుంచి తలుపులు బిగించుకొని 48 ఏళ్ల ఇంటి పెద్ద, ఆయన నలుగురు కూతుళ్లు బలవన్మరణానికి పాల్పడ్డారు. నలుగురి కూతుళ్లు 15–25 ఏళ్ల మధ్య వయస్కులు. నలుగురూ మానసిక వికలాంగులే! ఈ అమ్మాయిల తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. శుక్రవారం వాళ్ల ఫ్లాట్‌లోంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారొచ్చి తలుపులు బద్దలుకొట్టి చూసేసరికి నలుగురి మృతదేహాలు కుళ్లిపోయిన స్థితిలో కనిపించాయి. 3–4 రోజుల క్రితమే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. మృతదేహాల పక్కన పురుగుల మందు డబ్బా, జ్యూస్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్ కనిపించాయి.

## పల్లెల పురోగతికి ప్రణాళికలు



**న్యూఢిల్లీ– నవభూమి:** పల్లెలను పురోగతి బాట పట్టించే దిశగా కేంద్రం ప్రణాళికలు రచిస్తోంది. దీనిలో భాగంగా రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై దిశానిర్దేశం చేసేందుకు అక్టోబరు 2న ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనుంది. ఈ సభల్లో దేశవ్యాప్తంగా 2.55 లక్షల గ్రామ పంచాయతీలు, 6,700 బ్లాక్ పంచాయతీలు, 665 జిల్లా పంచాయతీలు పాల్గొంటాయని కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. అన్ని పంచాయతీల్లో భాగస్వామ్య ప్రణాళికను పెంపొందించడం, పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు(పీడీపీ) సకాలంలో రూపొందించడం లక్ష్యంగా 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్' అభియాన్ కింద శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందులో 20వేల మంది కళాశాల విద్యార్థులు పాల్గొంటారని, వారంతా వివిధ పంచాయతీల్లో పీడీపీల తయారీకి సహకరిస్తారని అధికారులు వెల్లడించారు. ఈ సభలను పర్యవేక్షించడానికి అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ఎంపిక చేసిన పంచాయతీలకు అధికారులు, కన్సల్టెంట్లను నియమిస్తున్నారు. అక్టోబరు 2 కార్యక్రమానికి ముందు, ఈ నెల 30న మంత్రిత్వ శాఖ ఒక జాతీయ వర్క్‌షాపను నిర్వహిం చనుంది. దీనిలో వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు, పంచాయతీల ప్రతినిధులు పాల్గొని తన అనుభవాలను పంచుకుంటారు.

## కోల్‌కత ఘటనపై సినిమా.. విద్యార్థి నాయకుడు సస్పెండ్!

**న్యూఢిల్లీ– నవభూమి:** కర్ కేసుకు సంబంధించిన సినిమా తీసినందుకు స్టూడెంట్స్ వింగ్ నాయకులు సస్పెండ్ అయ్యారు. ఈ లఘు చిత్రం రాజకీయంగా పెద్ద గడబిడకు తెర తీసింది. సీఎం మమతపై బీజేపీ ఎదురు దాడికి దిగింది. పూర్తి వివరాల్లోకి వెళితే.. కోల్‌కతాలోని ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌లో ట్రైనీ డాక్టర్ అత్యాచారం, హత్యపై తీసిన షార్ట్ ఫిల్మ్‌పై తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) విద్యార్థి విభాగం తృణమూల్ ఛత్ర పరిషత్ శుక్రవారం ఇద్దరు సీనియర్ నేతలను సస్పెండ్ చేసింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలపై ఇద్దరు నేతలు ప్రతీక్ చక్రవర్తి, రాజన్య హల్దార్‌లు సస్పెన్షన్‌కు గురయ్యారు. పిటిఐ కథనం ప్రకారం.. పార్టీ క్రమశిక్షణా కమిటీ ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకునే వరకు ఇద్దరు సభ్యులపై సస్పెన్షన్ కొనసాగుతుందని తృణమూల్ ఛత్ర పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు తృణంకూర్ భట్టాచార్య నోటీసులో పేర్కొన్నారు. ఇద్దరు విద్యార్థి కార్యకర్తలు పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించారని, టిఎంసిపి సినిమాను ప్రమోట్ చేస్తోందని ప్రజల్లో తప్పుడు అభిప్రాయాన్ని సృష్టించారని ఆయన అన్నారు. ఆగమణి–తిలోత్తోమాడర్ గల్పో(తిలోత్తోమాస్ కథ) సినిమా పోస్టర్‌ను ఇన్ ది బ్యాక్‌డ్రాప్ ఆఫ్ ఆర్‌జి కర్ అనే ట్యాగ్‌లైన్‌తో సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన కొద్దిసేపటికే ప్రాంతిక్ చక్రవర్తి, రాజన్య హల్దార్‌లను తృణమూల్ ఛత్ర పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు తృణంకూర్ భట్టాచార్య తక్షణమే సస్పెండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ (బిజెపి) శుక్రవారం బెంగాల్ సిఎం మమతా బెనర్జీ నేతృత్వంలోని టిఎంసిపై విరుచుకుపడింది. టిఎంసి నాయకుడు రాజన్య హల్దార్ ఒక షార్ట్ ఫిల్మ్‌లో తిలోత్తమ ఆడటం అభయ స్మృతికి అసహ్యాకరమైన అవమానం. టిఎంసి ఈ విషాదాన్ని అపవిత్రం చేయడం సరికాదు. న్యాయం కోసం పోరాటాన్ని అపహాస్యం చేయడం వలన మర్యాద పూర్తిగా నశించింది.. ఇది అగౌరవానికి మించినది–అభయపై జరిగిన అత్యాచారం .. హత్యకు జవాబుదారీగా ఉండాలని డిమాండ్ చేస్తున్న ప్రతి వ్యక్తికి ఉద్దేశపూర్వకంగా చెంపదెబ్బ. వారికి సిగ్గు లేదు.. మనస్సాక్షి లేదు. న్యాయం పట్ల గౌరవం లేదని రుజువు చేస్తూ చౌకబారు స్టంట్ చేస్తున్నారు! అంటూ భాజపా దాడికి దిగింది. ఆర్.జి కర్ హత్యాచార కేసు వివరాల్లోకి వెళితే.. ఆగస్టు 9న కోల్‌కతాలోని ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌లో 31 ఏళ్ల ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేశారు. ఈ ఘటనతో పనిలో ఉన్న మహిళల భద్రతపై పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగాయి. దేశవ్యాప్తంగా వైద్యులు బాధితురాలి తల్లిదండ్రులకు సంఘీభావం తెలుపుతూ తమ విధులను నిలిపివేసి నిరసనలు తెలిపారు. ఈ కేసు సుప్రీంకోర్టులో విచారణలో ఉంది. సెప్టెంబర్ 30న తదుపరి విచారణ జరగనుంది. సెప్టెంబర్ 27న వాయిదా సమయంలో, బెంగాల్ ప్రభుత్వ న్యాయవాది వెస్ట్ అభ్యర్థన మేరకు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తేదీని సెప్టెంబర్ 30కి మార్చింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in



హైదరాబాద్
ఆదివారం
29 సెప్టెంబర్ 2024




లేడీ డ్యాన్సర్‌ను లైంగికంగా వేధించాడ"ంటూ ఆరోపణలతో పాటు పోక్సో కేసులో అరెస్టయిన టాలీవుడ్ కొరియోగ్రాఫర్

## ముగిసిన జానీ మాస్టర్ పోలీస్ కస్టడీ.!

జానీ మాస్టర్ పోలీసు కస్టడీ ముగిసింది. నాలుగు రోజులు పాటు పోలీసు కస్టడీలో ఉన్న అతడిని నార్సింగి పోలీసులు విచారించగా.. కస్టడీ గడువు ముగియడంతో అతడిని పోలీసు స్టేషన్ నుంచి ఉప్పరపల్లి కోర్టుకు తరలించారు. ఇక కోర్టు విచారించిన అనంతరం అక్టోబర్ 03 వరకు జ్యూడిషియల్ రిమాండ్ విధించడంతో అతడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

అయితే ఆమె చేసిన పనులు నచ్చక జానీ మాస్టర్ దూరం పెట్టారు. దీంతో కక్ష సాధింపు చర్యలకు దిగింది. కావాలనే ఆరోపణలు చేసి కేసు పెట్టింది. ఆమె తల్లి కూడా అనేక ఇబ్బందులు పెట్టింది. అందుకే ఆమెపై చర్యలు తీసుకోండి. నాకు న్యాయం చేయండి. నాతో పాటు నా పిల్లలకు ఏం జరిగినా వాళ్ళదే బాధ్యత. అందుకే నాకు దయచేసి న్యాయం జరిగేలా చూడండి" అని ఫిర్యాదులో అయేషా కోరింది. మరి దీనిపై ఫిల్మ్ ఛాంబర్ ఎలా స్పందిస్తుందో చూడాలి.





ఊర్వశీ రౌతేలా


## వేరే కోణంలో చూడొద్దు ప్లీజ్..

డేటింగ్ యాప్‌లో సెలబ్రిటీల పేర్లు ప్రస్తుతం బీటౌన్‌లో చర్చనీయాంశం అయ్యింది. ఈ పేర్లలో బాలీవుడ్ భామ ఊర్వశీ రౌతేలా పేరు కూడా ఉండటంతో.. ఈ వ్యవహారంపై ఊర్వశీ స్పందించింది. 'కేవలం మేం మాట్లాడుకోవడం కోసమే ఈ యాప్‌లో లాగిన్ అయ్యాం. ఇందులో నాతోపాటు హృతిక్, ఆదిత్యరాయ్.. ఇలా చాలామంది పేర్లున్నాయి. సమయం దొరికినప్పుడల్లా ఈ యాప్ ద్వారా మాట్లాడుకుంటూ ఉంటాం. లీజర్ టైమ్‌లో ఒకరికొకరం రిక్వెస్టులు పెట్టుకుంటాం. దయచేసి దీన్ని వేరే కోణంలో చూడొద్దు. ప్లీజ్..' అంటూ రిక్వెస్ట్ చేసింది ఊర్వశీ రౌతేలా. ప్రస్తుతం ఈ అందాలభామ టాలీవుడ్‌లో నటిస్తున్న విషయం తెలిసిందే. బాలకృష్ణ హీరోగా కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రంలో ఊర్వశి కీలక పాత్ర పోషిస్తున్నది. ఈ సినిమా గురించి ఇటీవల మాట్లాడుతూ 'బలమైన కథతో రూపొందుతోన్న చిత్రమిది. ఇందులో నా పాత్ర కొత్తగా ఉంటుంది. బాలయ్యసార్‌తో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. ఆయన గొప్ప నటుడు మాత్రమే కాదు, మంచి వ్యక్తి కూడా. టాలీవుడ్ వాతావరణం నాకెంతో నచ్చింది. ఇక్కడ మరిన్ని సినిమాలు చేయాలని ఉంది' అంటూ చెప్పుకొచ్చింది ఊర్వశీ రౌతేలా.

### 'దేవర' ఫస్ట్‌డే కలెక్షన్స్..

# ప్రభాస్ రికార్డు బద్దలు

'ఆర్ఆర్ఆర్' వంటి గ్లోబల్ బ్లాక్ బస్టర్ తర్వాత నందమూరి తారక రామారావు హీరోగా వచ్చిన చిత్రం దేవర. సోలో హీరోగా ఎన్టీఆర్ (%జీతీ చీ=%) నుంచి ఆరేళ్ల తర్వాత వచ్చిన సినిమా.. ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేసిన నాలుగో సినిమా.. ఎన్టీఆర్–కొరటాల కాంబినేషన్ లో వచ్చిన రెండో సినిమా.. శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ తెలుగు తెరకు పరిచయమైన సినిమా.. ఓవర్సీస్‌లో ప్రీసేల్‌లో అత్యంత వేగంగా మిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరిన తొలి సినిమా.. ఇలా ఎన్నో ప్రత్యేకతలు, భారీ అంచనాలు మధ్య ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'దేవర' మొదటిరోజే బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టించింది. వరల్డ్ వైడ్‌గా ఫస్ట్ రోజే రూ. 172 కోట్ల కలెక్షన్లు రాబట్టింది ఈ చిత్రం. దీంతో ప్రభాస్ ఆదిపురుష్ పేరిటా ఉన్న (రూ.140 కోట్ల) రికార్డును బద్దలు కొట్టింది. ఇకపోతే ఎన్టీఆర్ కెరీర్‌లో ఇది హైయెస్ట్ కలెక్షన్లు అని చెప్పుకోవచ్చు. ఇక రానున్న రెండు రోజులు వీకేండ్‌తో పాటు దసరా సెలవులు వస్తుండటంతో ఈ సినిమా కలెక్షన్లు మరింత పెరిగే అవకాశం ఉంది.




ఇక డే1 అత్యధిక కలెక్షన్లు సాధించిన సినిమాలలో చూసుకుంటే దేవర ఐదో స్థానంలో ఉంది. రూ. 223 కోట్లతో ఆర్ఆర్ఆర్ మొదటి స్థానంలో ఉండగా.. రెండో స్థానంలో బాహుబలి (రూ.217 కోట్లు) మూడో స్థానంలో కల్కి (రూ.180 కోట్లు) నాలుగో స్థానంలో సలార్ (రూ.178 కోట్లు) ఉన్నాయి.

## దేశం వదిలి వెళ్లేందుకు హర్షసాయి ప్లాన్.. పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు



తెలుగు యూట్యూబర్ హర్షసాయి కేసులో ట్విస్ట్‌ల మీదా ట్విస్ట్‌లు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే తనను లైంగికంగా దాడి చేయడంతో పాటు మానసికంగా వేధిస్తున్నట్లు కేసు పెట్టిన యువతి తాజాగా మరో విషయంపై పోలీసులను ఆశ్రయించింది. హర్షసాయి పోలీసులకు దొరకకుండా తప్పించికుని తిరుగుతున్న విషయం తెలిసిందే. అతడి గురించి చిన్న సమాచారం దొరికిన ముమ్మరంగా గాలిస్తున్నారు పోలీసులు. అయితే ఈ క్రమంలోనే మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. హర్షసాయి పోలీసుల కళ్లుగప్పి దేశం వదిలి వెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నట్లు బాధిత యువతి పోలీసులను ఆశ్రయించింది.

ఈ కేసు విషయంలో సైబారాబాద్ సీపీని కలిసిన ఆ యువతి.. హర్షసాయి దేశం వదిలి వెళ్లకుండా చూడాలని ఫిర్యాదులో పేర్కొంది. అలాగే సోషల్ మీడియా.. డిజిటల్ మీడియాలో తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై కూడా చర్యలు తీసుకోవాలని యువతి ఫిర్యాదులో తెలిపినట్లు సమాచారం. మరోవైపు హర్షసాయి కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకోబోతున్నట్లు తెలుస్తుంది. తనంతటా తాను పోలీసులకు లొంగిపోకపోతే హర్షసాయిపై లుకౌట్ నోటీసు జారీ చేసే యోచనలో పోలీసులు ఉన్నట్లు సమాచారం.

## ఐఫా ఉత్సవాల్లో సందడి చేసిన తారలు..





సినీరంగంలో ఎంతో ప్రతిష్మాత్మకంగా భావించే ఐఫా అవార్డుల వేడుక అబుదాబి వేదికగా ఘనంగా జరుగుతోంది. ఈ ఈవెంట్‌లో బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్, కోలీవుడ్ నుంచి నటులు హాజరై సందడి చేస్తున్నారు. స్టార్ నటులు సమంత, రానా, వెంకటేశ్, బాలకృష్ణ, చిరంజీవి, ఐశ్వర్య రాయ్ బచ్చన్, కృతి సనన్, కీర్తి సురేశ్, మృణాల్ ఠాకూర్, నాని, ఏఆర్ రెహమాన్, ఊర్వశి రౌతేల, షాహిద్ కపూర్ తదితరులు సందడి చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట తెగ వైరల్‌గా మారాయి.

## సర్ఫరాజ్ సోదరుడు ముషీర్ ఖాన్‌కు రోడ్డు ప్రమాదం.. 3 నెలలు క్రికెట్‌కు దూరం



**ముంబై–నవభూమి:** భారత క్రికెటర్ సర్ఫరాజ్ ఖాన్ సోదరుడు ముషీర్ ఖాన్‌కు రోడ్డు ప్రమాదం అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఆ యాక్సిడెంట్‌లో అతని మెడకు గాయమైనట్లు తెలుస్తోంది. ఇరానీ కప్ మ్యాచ్ కోసం కాన్పూర్ నుంచి లక్నోకు వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. ఆ సమయంలో అతని తండ్రి నౌషాద్ ఖాన్ కూడా అతనితోనే ఉన్నాడు. ముషీర్ ప్రతిభ ఉన్న యువ క్రికెటర్. ఇటీవల దులీప్ ట్రోఫీలో ఇండియా సీ జట్టు తరపున ఆడి 181 రన్స్ స్కోర్ చేశాడు. ఇప్పటి వరకు అతను 9 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. ప్రమాదానికి గురైన 19 ఏళ్ల ముషీర్ ప్రస్తుతం ముంబై తరపున ఆడుతున్నాడు. కానీ యాక్సిడెంట్ వల్ల అతను అక్టోబర్ ఒకటో తేదీ నుంచి రెస్ట్ ఆఫ్ ఇండియాతో జరగాల్సిన మ్యాచ్‌కు దూరం కానున్నాడు. ఇక అక్టోబర్ 11వ తేదీ నుంచి ప్రారంభంకానున్న రంజీ సీజన్‌కు కూడా అతను మిస్సయ్యే అవకాశాలు ఉన్నాయి. మెడకు గాయం కావడం వల్ల అతను కనీసం మూడు నెలలు క్రికెట్‌కు దూరంగా ఉండే అవకాశాలు ఉన్నట్లు ఓ రిపోర్టు ద్వారా తెలుస్తోంది. ఇరానీ కప్ కోసం లక్నోకు వెళ్లిన ముంబై జట్టుతో అతను ట్రావెల్ చేయలేదు. ఆజంఘర్ నుంచి అతను తండ్రితో కలిసి వెళ్లినట్లు తెలిసింది. ఆ సమయంలోనే ప్రమాదం జరిగింది. ఫస్ట్ క్లాస్ సీజన్‌లో రాణిస్తున్న ముషీర్.. గాయం వల్ల ఆస్ట్రేలియాలో జరిగే ఇండియా ఏ జట్టు మ్యాచ్‌లకు దూరం అయ్యే అవకాశాలు ఉన్నాయి. దులీప్ ట్రోఫీ, ఇరానీ కప్ పర్ఫార్మెన్స్ ఆధారంగా ఇండియా ఏ జట్టును ఎంపిక చేస్తారు.

## అరంగేట్ర స్పిన్నర్ ధాటికి న్యూజిలాండ్ ఆలౌట్.. గెలుపు వాకిట శ్రీలంక



**ముంబై–నవభూమి:** గాలే స్టేడియంలో జరుగుతున్న రెండో టెస్టులో న్యూజిలాండ్ కుప్పకూలింది. సుదీర్ఘ ఫార్మాట్‌లో శ్రీలంకపై చెత్త రికార్డు నమోదు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటర్ల వైఫల్యంతో 88 రన్స్‌కే పర్యాటక జట్టు ఆలౌటయ్యింది. 1992 తర్వాత లంకపై మరీ ఇంత తక్కువకు న్యూజిలాండ్ ఆలౌట్ కావడం ఇదే తొలిసారి. ఇంతకుముందు లంకపై 102కు కివీస్ పది వికెట్లు కోల్పోయింది. మూడో రోజు ఆట మొదలైన కాసేపటికే ప్రభాత్ జయసూర్య(6/42), అరంగేట్ర స్పిన్నర్ నిషాన్ పీరిస్(3/33)ల విజృంభించారు. కివీస్ ఆటగాళ్లను వరుసపెట్టి పెవిలియన్ చేర్చి పతనాన్ని శాసించారు.

ఓవైపు అందరూ క్యూ కడుతుంటే.. ఆల్‌రౌండర్ మిచెల్ శాంటన్నర్ 29 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడంటే అర్థం చేసుకోవచ్చు లంక బౌలర్లు ఏ మేర చెలరేగారో. ఫాలో ఆన్‌లోనూ న్యూజిలాండ్ ఆట మారలేదు. 121 పరుగులకే సగం వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచింది.

## బంతి పడకుండానే రెండో రోజు ఆట రద్దు..



**కాన్పూర్–నవభూమి:** కాన్పూర్‌లోని గ్రీన్ పార్క్ గ్రౌండ్‌లో బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టు( రెండో రోజు ఆట రద్దు అయ్యింది. ఒక్క బంతి పడకుండానే ఆటను రద్దు చేశారు. ఉదయం నుంచి పలు మార్లు కాన్పూర్‌లో వర్షం పడింది. కవర్స్‌ను మైదానం నుంచి తీయలేదు. ఉదయం చిన్నపాటి జల్లుగా పడిన వాన.. ఆ తర్వాత భారీ వర్షంగా మారింది. దీంతో గ్రౌండ్‌లోని కవర్స్ తీయకుండానే ఉండిపోయాయి. కొంత సమయం వర్షం ఆగినా.. సూపర్ సోపర్లతో ఆ నీటిని తొలగించే ప్రయత్నం చేశారు. అయితే మబ్బు పట్టడం వల్ల విజిబులిటీ తగ్గింది. పరిస్థితుల్లో ఎటువంటి మార్పు లేకపోవడంతో.. రెండో రోజు ఆటను మధ్యాహ్నం 2.15 నిమిషాలకు రద్దు చేశారు. వాతావరణ శాఖ నివేదిక ప్రకారం ఆదివారం కూడా కాన్పూర్‌లో వర్షం పడే అవకాశాలు ఉన్నాయి. సోమ, మంగళవారాలు మాత్రం వెచ్చగా ఉండనున్నది. తొలి రోజు 35 ఓవర్లు ఆడిన బంగ్లాదేశ్ 3 వికెట్లు కోల్పోయి 107 రన్స్ చేసిన విషయం తెలిసిందే.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**